నవల

యోగివేమన విశ్వవిద్యాలయం

ఎం.ఏ. తెలుగు కోర్సు
పాఠ్యపుస్తకం (4వ సెమిస్టర్)

# నేల దిగిన వాన

రాయలసీమ ప్రాంతంలోని రైతుల జీవన జీవిత దృశ్యాలను,
వాన కోసం తపించే కరవు భూముల ఘోషను,
రైతుల కంఠస్వరాన్ని అక్షరీకరించిన నవల



డా॥ వేంపల్లి గంగాధర్

# నేలదిగిన వాన

(నవల)

డా॥ వేంపల్లి గంగాధర్

పాపాఘ్ని ప్రచురణలు
కడప

# నేలదిగిన వాన

డా॥ వేంపల్లి గంగాధర్

**Nela Digina Vaana** **(Novel)**

by **Dr. Vempalli Gangadhar**
gangadhar.vempalli@gmail.com
mobile : 9440074893

Copyright © by writer

| | | |
|---|---|---|
| First Published | : | Feb 2009, Chatura Monthly |
| Second Edition | : | March 2013, Palapitta Books, Hyd |
| Third Edition | : | July 2019,<br>Papagni Prachuranalu, Kadapa |
| For Copies | : | Dr. Vempalli Gangadhar<br>4/432, Vivekananda Nagar<br>Kadapa-516 0019848859954 |
| Cover Design | : | B. Sivaram (Sivaram Graphics)<br>Cell : 9959214299 |
| Copies available | : | Vishalandhra, Navachentana and<br>Navodaya Hyderabad, Pallavi at Vijayawada |
| Price | : | ₹ 100.00 |

**డా॥ వేంపల్లి గంగాధర్** : 'రాష్ట్రపతి భవన్'లో విశిష్ట ఆతిథ్యం అందుకున్న తొలి భారతీయ సాహితీవేత్తగా వీరు గుర్తింపు పొందారు. 2014, సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 26 వరకు వీరు రాష్ట్రపతి భవన్‌లో విడిది చేశారు. రాయలసీమ ప్రాంతానికి సంబంధించిన పలు అంశాలపై పుస్తకాలు రాశారు. వీరి కథా సంకలనం 'మొలకల పున్నమి'కి కేంద్ర సాహిత్య అకాడమి మొదటి యువపురస్కారం - 2011 లభించింది. ప్రసిద్ధ సాహితీవేత్త సునీల్ గంగోపాధ్యాయ చేతుల మీదుగా తామ్రపత్రం అందుకున్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి 'రాయలసీమ కథా సాహిత్యం' పై పిహెచ్‌డి, 'రాయలసీమ ఫ్యాక్షనిజం' పై ఎంఫిల్ పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం వారి 'రైటర్స్ ట్రావెల్ గ్రాంట్' ద్వారా 'శాంతినికేతన్'లో పర్యటించారు. మొలకల పున్నమి, దేవరశిల, గ్రీష్మభూమి, తొలితెలుగు శాసనం, పూణే ప్రయాణం, కథనం, హిరణ్యరాజ్యం, నేలదిగినవాన, నేను చూసిన శాంతినికేతన్, పాపాఘ్ని కథలు, రావణవాహణం కథలు, కడప వైభవం (సంపాదకత్వం), అనంతపురం చరిత్ర (సంపాదకత్వం), ఎర్రచందనం దారిలో తమిళ కూలీలు, యురేనియంపల్లె నవల పుస్తకాలు రాశారు. సీమ గిరిజన తండాల నుంచి పడుపు వృత్తిలోకి తరలిపోతున్న మహిళల జీవన ఆక్రందనను 'పూణే ప్రయాణం' రచనలో చిత్రణ చేశారు. ఇదే ఇతివృత్తంతో రాసిన 'మైనం బొమ్మలు' కథకు అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) పురస్కారం దక్కింది. న్యూఢిల్లీ కథా ఫౌండేషన్‌వారి నుంచి 'శిలబండి' కథకు జాతీయ కథాపురస్కారం, 'నేలదిగిన వాన' నవలకు అంపశయ్య నవీన్ సాహితీ పురస్కారం, 'దేవరశిల'కు రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారం అందుకున్నారు. వీరి కథలు పలు భారతీయ భాషలలోకి అనువాదమయ్యాయి.




న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జి గారికి తన రచనలను అందజేస్తున్న డా॥ వేంపల్లి గంగాధర్.

*'In Residence Programme'* లో భాగంగా
2014 సెప్టెంబర్ 8వ తేది నుండి 26వ తేది వరకు గంగాధర్
రాష్ట్రపతి భవన్‌లో విశిష్ట అతిథిగా విడిదిచేశారు.

# బహుముఖ పార్శ్వాల ఆవిష్కరణ

వాన కోసం ఎదురు చూడటంలో వున్న స్థితి నగర జీవులకు తెలియదు. కానీ నేలతో బతుకు ముడిపెట్టుకున్న రైతులకు, పల్లెవాసులకు బాగా తెలుసు. వారికి తెలిసిన జీవితాన్ని తనదయిన కోణంలోంచి ఆవిష్కరించారు రచయిత వేంపల్లి గంగాధర్. 'నేల దిగిన వాన' అతని తొలి నవల. మొదట 'చతుర' మాసపత్రికలో వచ్చింది. ఇప్పుడు పుస్తకరూపంలో పాఠకుల ముందు నిలిచింది. కేంద్ర సాహిత్య అకాడెమీ వారి తొలి 'యువ' పురస్కారాన్ని అందుకున్న గంగాధర్ జీవితాన్ని సృజనాత్మకంగా మలుచుకున్న రచయిత. కవిగా, కథకునిగా ప్రసిద్ధుడయిన గంగాధర్ ఈ నవల రాయడం ద్వారా తన రచనా వ్యాసాంగాన్ని విస్తరించుకున్నారు. సీమ జీవితంలో కథావస్తువులు అనేకం. వాటికి సవ్యమైన రీతిలో సృజనాత్మక రూపం ఇవ్వడం రచయితల బాధ్యత. ఆ బాధ్యతని నెరవేర్చడంలో గంగాధర్ చూపిన పరిణతి అభినందనీయం.

అనావృష్టి కారణంగా రాయలసీమ పల్లెలు వర్షాలు లేక తల్లడిల్లుతున్నాయి. వర్షాల కోసం తపించే ప్రజల సాంస్కృతిక జీవనాన్ని ఎంతో ఆర్ద్రంగా చూపారు రచయిత. జీవిక కోసం చేయరాని పనుల్ని చేయక తప్పని స్థితిలోకి నెట్టివేసే హృదయ విదారక సన్నివేశాల్ని కన్నీళ్ళతో సృజించిన గంగాధర్ ఆర్తిని అర్థం చేసుకోవాలి. జీవన బీభత్సాన్ని సంయమనంతో చెప్పడానికి రచయిత చేసిన ప్రయత్నం అభినందనీయం. రచయిత దృష్టికోణం, కంఠస్వరం రైతుల పట్ల వున్న సహానుభూతిని తెలియజేస్తాయి. ఇప్పటికే చాలా కథలు రాసిన గంగాధర్ నవలారచనలో మరిన్ని ప్రయోగాలు చేయాలి. రాయలసీమ జీవితంలోని బహుముఖ పార్శ్వాల్ని రికార్డు చేయాలి. పలు కోణాల్ని పరిచయం చేయాలి. జీవితాన్ని గెల్చుకోడానికి చేసే ప్రయత్నాలకు స్ఫూర్తిని ఇస్తాయి అతని రచనలు. కనుకనే ఈ నవలని పాఠకుల ముందుకు తీసుకువస్తున్నాము. మా ఇతర ప్రచురణల మాదిరిగానే ఈ నవలని సమాదరిస్తారని ఆశిస్తున్నాం.

**– ఉషస్సు ప్రచురణలు**




కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారాన్ని
డా॥ వేంపల్లి గంగాధర్‌కు ప్రదానం చేస్తున్న
ప్రసిద్ధ సాహితీవేత్త, అకాడమి అధ్యక్షులు
సునీల్ గంగోపాధ్యాయ
(25 ఆగస్టు 2012, భువనేశ్వర్)

# వానకోసం ఎదురుచూపులు

## అంపశయ్య నవీన్

రాయలసీమలోని ఓ మధ్యతరగతి రైతు వెతల్ని చిత్రించిన నవల వేంపల్లి గంగాధర్ రచించిన "నేలదిగిన వాన". ఇది ఆయన మొదటి నవల. ఇదివరకు గంగాధర్ కథలు రాశాడు. ఆయన రాసిన కథల్లో కొన్ని రాష్ట్రస్థాయి పురస్కారాలను అందుకున్నాయి. ఇటీవల కేంద్ర సాహిత్య అకాడెమీ వారి 'యువ' పురస్కారం లభించింది.

రాయలసీమ అంటేనే కరువు కాటకాలను నిలయమని మనకు అక్కడి రైతులకు వర్షం కురిస్తే తప్ప కాలువల్లాంటి మరో నీటి వసతులు లేవు. అనుక్షణం ఇక్కడి రైతులు వానలకోసం ఎదురు చూస్తుంటారు. ఎన్నాళ్ళకో గానీ వాళ్ల ఎదురుచూపులు ఫలించి వానలు కురవవు. సకాలంలో వర్షాలు కురవకపోవడం వల్ల ఇక్కడి రైతులు పంటలు పండించలేకపోతారు. అప్పులపాలవుతుంటారు. అప్పులు తీర్చలేక కొన్నిసార్లు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు  పాల్పడి కొంత డబ్బు సంపాదిస్తుంటారు. కొన్ని అనైతిక చర్యలకు పాల్పడుతుంటారు. చట్టం చేతిలో చిక్కి శిక్షలు అనుభవిస్తుంటారు. ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యడం కోసం అప్పులు చేస్తుంటారు. భూముల్ని అమ్ముకుంటారు. కువైట్ లాంటి గల్ఫ్ దేశాలకు వలసపోతుంటారు. ఇలా రాయలసీమ ప్రాంత రైతుల బాధల్ని, ఆ ప్రాంత సంస్కృతీ సంప్రదాయాల్ని గంగాధర్ ఈ నవలలో గొప్ప సహానుభూతితో, ఆర్తితో చిత్రించాడు.

ఈ నవలను ఓ రైతు "నేనూ" అంటూ ఉత్తమ పురుషలో చెబుతున్నట్టుగా గంగాధర్ రచించాడు. ఓ రాయలసీమ రైతు చెబుతున్నట్టుగా రాయడం వల్ల రచయిత ఈ నవల మొత్తాన్ని రాయలసీమ మాండలికంలో చెప్పడం సమంజసం గానే ఉంది. వేరే ప్రాంత పాఠకులకు కూడా అర్థమయ్యే సరళ రాయలసీమ మాండలికాన్నే రచయిత ఈ నవలలో వాడాడు. అయితే ఈ నవలలో చాలాచోట్ల రచయిత చక్కని కవిత్వాన్ని గుప్పించాడు. నవల అనేది ప్రధానంగా వచన ప్రక్రియ – కవిత్వం – అది వచన కవిత్వమే. అయినా – మరీ ఎక్కువైపోతే నవల నడక కుంటుబడిపోతుందని ఈ రచయిత గుర్తించాలి. నవల ప్రారంభాన్నే నాలుగు పేజీల కవిత్వం లాంటి వచనంతో ప్రారంభించాడు. తన ప్రాంతమైన రాయలసీమ మీద గంగాధర్‌కు ఎంత అభిమానముందో ఈ ప్రారంభ పేజీల్లోని కవిత్వాన్ని చదివితే మనకర్థమౌతుంది. రాయలసీమ వాసులను గూర్చి రచయిత

***"మా జీవితాలు అపశ్రుతులు***

***మా జీవితాలు వక్రరేఖలు***

***మా జీవితాలు తీరని శాపాలు***

***ఎందుకో తెలుసా?***

***మేము ఆకాశం నుంచి చినుకుల కోసం ఎదురుచూసేవాళ్లం"*** అంటాడు.

ఈ నవలలో చాలాచోట్ల రాయలసీమ ప్రజలు జరుపుకునే పండుగల్ని గూర్చి, పండగల సందర్భంలో – ముఖ్యంగా సంక్రాంతి పండగ సందర్భంగా ఎద్దులు బరువైన బండల్ని లాగే పోటీలను గురించి, వర్షాలు రాకపోతే జరుపుకునే క్షుద్రపూజల్ని గూర్చి, కప్పలను పూజిస్తూ ఊరేగించే తంతును గూర్చి, అప్పుడు ప్రజలు పాడుకునే జానపద పాటల్ని గూర్చి రచయిత వివరించాడు. ఇలా తన నవలలో రాయలసీమ ప్రాంత సంస్కృతినంతా చిత్రించాలనే ప్రయత్నాన్ని రచయిత చేశాడు.

ఈ నవలను నేనూ అంటూ చెబుతున్న రైతు పేరేమిటో రచయిత చెప్పలేదు. ఇతనికి చాలా భూములున్నాయి. కానీ వర్షాలు కురవకపోతే ఆ భూముల్లో యేమీ పండదు. అందువల్ల అతడు చాలాసార్లు తన కుటుంబాన్ని పోషించుకోవడానికి అప్పులు చెయ్యాల్సి వస్తుంది. అయితే ఈయన కుటుంబం చిన్నదే. ఈయనకో చిన్నాయన ఉంటాడు. ఒక చెల్లెలు, తల్లి ఉంటారు. ఆ చిన్నాయనే ఆ కుటుంబానికి

పెద్దదిక్కు. ఇతనికి మంచి ఎద్దుల జత ఉంటుంది. సంక్రాంతి సందర్భంగా జరిగే ఎద్దుల పోటీలో పాల్గొని ఫస్ట్‌గా వచ్చి పదివేల నూటపదహారు రూపాయల్ని సంపాదించి ఆ డబ్బుతో ఒక అప్పు తీర్చేస్తాడు. చెల్లెలి పెళ్ళి చేయడం కోసం ఆ ఎద్దుల జతను అమ్ముకునే దృశ్యం కళ్ళకు నీళ్ళు తెప్పిస్తుంది.

అతడున్న ఊర్లోని అనేకమంది సరిఅయిన ఆదాయం లేక ఎలా చట్ట వ్యతిరేక, అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారో ఇతడు చెబుతాడు. ఈ ఊరికి పక్కనే ఉన్న అడవుల్లో ఉన్న ఎర్రచందనం చెట్లను నరకడానికి వెళ్తే ఆ కంట్రాక్టర్ చాలా డబ్బులిస్తాడని ఆంజనేయులనే స్నేహితుడితో కలిసి మనకీ కథ చెబుతున్న రైతు ఎర్రచందనం చెట్లను నరకడానికి అడవులకు వెళ్తుంటాడు. అలా రహస్యంగా ఎర్రచందనం చెట్లను నరికితే ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వాళ్లొచ్చి అరెస్టు చేసి జైళ్ళో పెడ్తారని తెలిసి కూడా కొందరు రైతులు ఈ పని చేస్తుంటారు. అలా ఆంజనేయులు అనే అతడు జైలుపాలవుతాడు.

ఊర్లో కొందరు మాట్కాజూదం ఆడ్తూ విపరీతంగా నష్టపోతుంటారు. ఈ ఊర్లోని సావిత్రి అనే ఆమె అందంగా ఉన్న కూతుర్ని వ్యభిచారం వృత్తిలోకి దించి పూనాకు పంపిస్తుంది. కొందరు డబ్బున్నవాళ్లు వర్షాలు కురవక ఎండి పోయిన నదుల్లో ఉన్న ఇసికను ట్రాక్టర్ల మీద నగరాలకు తరలించి విపరీతంగా సంపాదిస్తుంటారు. కొందరేమో కొండల్ని పిండిచేసి సంపాదిస్తుంటారు. ఇలా వర్షాలు కురవకపోవడం వల్ల ఆ గ్రామ ప్రజలు ఉపాధి కోసం రకరకాల అనైతిక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటాన్ని రచయిత ఈ నవలలో అత్యంత వాస్తవికంగా చిత్రించాడు.

సోమశిల ప్రాజెక్టు నిర్మిస్తున్నామని, అందువల్ల 14 గ్రామాలు ముంపుకు గురవుతాయని, ఈ కథ చెబుతున్న రైతు గ్రామం కూడా అందులో ఒకటని, కాబట్టి అందరూ ఆ గ్రామాలను ఖాళీ చేసి వేరే ఊరికి వెళ్లిపోవాలని ప్రభుత్వం వారు ప్రకటించటం, దాన్ని ఆ గ్రామ ప్రజలు వ్యతిరేకించటం వంటి సమస్యను కూడా రచయిత ఈ నవలలో చిత్రించాడు. నీలకంఠం అనేవాడు కాంచన అనే అమ్మాయిని చెరచడం, ఆ కాంచననే నీలకంఠం పెళ్లి చేసుకోవాలని గ్రామపెద్దలు తీర్పు చెప్పడం, పెళ్ళి చేసుకున్నాక ఈ నీలకంఠం అనేవాడు కాంచనను అమాను షమైన చిత్రహింసలకు గురిచేయడంతో ఒకరోజు కాంచన అతన్ని చంపేయడం లాంటి సంఘటనల్ని కూడా రచయిత ఈ నవలలో చిత్రించాడు.

ఇలా ఒక గ్రామాన్ని కథాకేంద్రంగా తీసుకొని రాయలసీమ ప్రాంత ప్రజల సమస్యల్ని, సంస్కృతీ సంప్రదాయాల్ని అత్యంత వాస్తవికంగా చిత్రించిన గంగాధర్‌ను అభినందిస్తున్నాను. రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నట్టుగా ప్రారంభమైన ఈ నవలను వర్షం కురుస్తున్నట్టుగా సకారాత్మక సూచనతో ముగించటం బావుంది.

# ఒక విషాదానంద గీతం

## గౌరునాయుడు

**చినుకు నేలకు దూకుతుంది**
**చెరువు ఒడిని ఆకాశమంత నింపడానికి!**
**నాగరికతలు నీళ్ళతోనే ప్రవహిస్తాయి**
**చరిత్రలో యేటి అలలే రాస్తాయి...**

అంటూ రాయలసీమలో ప్రతి ఒక్కరి 'కల'ను తనే కన్నట్టు వేంపల్లి గంగాధర్ యీ మాటల్ని అంటుంటే వాన కోసం ఆ నేల ఎంత తపించిపోతుందో అర్థమౌతుంది.

సేద్యం చట్టుబండలై ఇనపగజ్జెల తల్లి నాట్యం చేసే మట్టిలోగిళ్ళ సీమ. నారు పోసినోడు నీరు పోయ్యలేని సీమ. కరువుసీమ. వ్యవసాయ కూలీలుగా కూడా బ్రతకలేని దుర్భర దారిద్ర్యం మనుషుల్ని నగరాలకు, ఫ్యాక్టరీలకు తరిమేస్తుండే ఒకానొక హృదయ విదారక దృశ్యం. అంతేకాదు... అప్పుల బాధలకు తాళలేక ఆత్మహత్యలు చేసుకునే వాళ్ళు, నేలను నమ్ముకుని కరువు కుంపటి నెత్తికెత్తుకునే వాళ్ళు, పొట్ట గడుపుకోడానికి వ్యభిచార గృహాలకు అమ్ముడైన అమ్మాయిలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు, అనైతిక చర్యలకు అలవాటు పడేవారు అడుగడుగునా దర్శనమిచ్చే అభాగ్యసీమ కరువు సీమ. అదొక కన్నీటి చెలమ.

ఇదీ 'నేలదిగిన వాన' నవలలో వేంపల్లి గంగాధర్ మనముందు ఆవిష్కరించిన కఠిన వాస్తవం. ఫిబ్రవరి 2009లో 'చతుర' నవలగా పాఠకుల గుండెల్లో కన్నీటివానగా కురిసి వెలసింది. మళ్ళీ యిప్పుడు పాలపిట్ట ప్రచురణగా వస్తుందని గుడిపాటి గారు అన్నప్పుడు తప్పక చేయవలసిన అవసరమైన పని అనిపించింది. ఒక మాట రాయమని అడిగనప్పుడు మనసులోని మాట... నలుగురితో పంచుకునే అవకాశం కలిగినందుకు మరింత సంతోషమయ్యింది.

రాయలసీమ అయిన కళింగసీమ అయినా అవి కరువు సీమలే. వాన లేక అక్కడ- వనరులుండీ యిక్కడ... దుర్భర దారిద్ర్యంతో అల్లాడే జనం... వలసలతో... ఖాళీ అవుతున్న గ్రామాలు... కారణాలేవయినా కన్నీరొకటే... దారులు వేరు కావొచ్చు... దృశ్యాలు అవే. అక్కడయినా యిక్కడయినా... అట్టడుగు జనాల ఆర్తి ఒక్కటే... రైతు బతుకు రగులుతున్న చితుకు... అని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తున్న పచ్చి నిజమీ నవల.

ఈ నవలలో ఓ యువ రైతు... చెబుతున్న అనుభవాలుగా... ఉత్తమ పురుషలో సాగుతుంది కథ. రైతు చెబుతున్నట్లుగా కథ ఎత్తుకోవడం వల్ల... రాయలసీమ మాండలికం.. ఆ జీవద్భాషలో పాత్రలు ప్రాణం పోసుకుని పాఠకుల హృదయాలను కదిలిస్తాయి. తన ప్రాంతం మీద రచయితకు గల మమకారం... తన నేల గురించిన ప్రతి విషయాన్ని చెప్పాలన్న ఆరాటం... ఈ నవల నవలంతటా వ్యక్తమౌతూనే వుంటుంది. రేనాడు రాజ్యం... ఆ రాజ్యాన్ని పాలించిన రాజులు, వారి శాసనాలు... ఒంటిమిట్ట కోదండరాముని ఆలయం, పీరమ్మ మండపం (గబ్బు మండపం) అక్కడి శాసనం... వాన కోసం 'కప్పదేవర' ఉత్సవం... ఆ సంబరంలో పాడుకునే పాటలు... ఇలా... అనేకానేక ... సీమ సాంస్కృతిక, చారిత్రక విషయాలను... హృద్యంగా తెలియ చేస్తాడు రచయిత. తాను 'పరిశోధ కుడు' కావడం దానికి కారణం కావచ్చు. ఒక ప్రాంత చారిత్రక, సాంస్కృ తిక నేపథ్యంతో.... కథాగమనాన్ని కుంటుపడనీయకుండా ఉత్కంఠభరితంగా నడిపిం చడం రచయిత ప్రతిభకు నిదర్శనం. గంగాధర్‌కు యిది మొదటి నవల అయినా.. ఆర్తితోను... చిత్తశుద్ధితోను చిత్రించినందున రచన ఆసక్తికరంగా... సాగింది.

ఈ నవలను చదువుతున్నప్పుడు నాకనిపించింది- గంగాధర్ మంచి కవి అని. నవల నాలుగు పేజీల తర్వాతే ప్రారంభమవుతుంది. ముందు మూడు పేజీలు... కవిత్వమే... (బహుశా... చతుర నవలకు అవసరమైనన్ని పేజీల కోసం

ఈ కవిత్వం చేరిందేమో) ఏది ఏమయినా గంగాధర్ కవి కూడా కావడం వల్ల నవలను ఆకర్షణీయంగా నడిపించడంలో సఫలీకృతుడయినాడు. అయినా గానీ... కవిత్వం కథాగమనానికి ఆటంకం కాకూడదని తెలియని వాడా గంగాధర్? (నవలలో కథ చెప్పే నాయకుడు... రైతు ... కవి కాదు)

నవలలో కథానాయకుడు (పేరు లేదు...) తాను చెప్పే సంగతుల్లో మనకు అవగతమయ్యేది... అక్కడ వాన పడితే తప్ప రైతులకు బ్రతుకు లేదని. వానల కోసం కప్పదేవర సంబరాలు చేస్తారు. వర్షాలు కురవక రైతులు అప్పుల పాలవుతారు. కథా నాయకుడి తండ్రి... వానలు పడక, కరువు కమ్ముకున్నాక, భూములు మోసం చేయడం నేర్చుకున్నాక, పండిన గింజలకు కూడా గిట్టుబాటు ధర రాకుండా దళారులు మోసం చేస్తుండడం చూడలేక... వ్యవసాయం మానుకోలేక అప్పులు తీర్చలేక నడిపొలంలో గచ్చకాయలు నూరుకుని తాగి... మరణిస్తే... సత్రం కాడి భూమి తాకట్టు పెట్టి, అదీ చాలక కొర్రపాడు దగ్గర భూమి అమ్మి, అదీ చాలక కమలాపురం మామ వెంకటరెడ్డి యిచ్చిన డబ్బు మిగలక... ఎముకల గూళ్ళతో మిగిలిన కథానాయకుడైన రైతు... 'నీలకంఠారెడ్డి'కి తీర్చాల్సిన బాకీ తీర్చడానికి, చెల్లెలు లక్ష్మికి పెళ్ళి చేయడానికి తనను తల్లిని పోషించుకోడానికి... ఏఏ దారులు తొక్కాల్సి వచ్చిందో... ఏ బాధలు పడాల్సి వచ్చిందో... ఆసక్తికరంగా వివరిస్తాడు రచయిత.

సంక్రాంతి సంబరాల ఎద్దుల పోటీలో పాల్గొని బహుమతిగా వచ్చిన బంగారు గొలుసు, పదివేల రూపాయలతో... నీలకంఠం అప్పు తీరుస్తాడు. చెల్లెలి పెళ్ళి కోసం పోటీల్లో తనకు విజయం సాధించి... బహుమతి తెచ్చిపెట్టిన ఎడ్లను అమ్ముకుంటాడు. "ఒక్కొక్క దానికి దిన్నం మూడు కేజీల ఉలవలు, పది కేజీల జొన్నలు, రెండు కేజీల రాగులు... ఆదివారాలప్పుడు మసాల పెట్టిన మాంసం ముద్దలు, కోడిగుడ్లు, నూగుల పిండి, రేత్తిరి పూట అరటిపండ్లు, తమలపాకులు కూడా... పెట్టి అపురూపంగా... సాకిన ఎద్లు" అమ్మకానికి పెట్టిన దృశ్యం పాఠకుల చేత కంట తడి పెట్టిస్తుంది.

నీలకంఠారెడ్డి అప్పు తీర్చడానికి... ఆంజనేయులనే మిత్రుడితో... ఎర్ర చందనం చెట్లు నరకడానికి అడవికి వెళ్తాడు. చెట్లు నరికితే ఐదు వందల రూపాయలు వస్తాయనే ఆశతో... దొరికితే జైలు పాలు కావలసి వస్తుందని తెలిసినా

ఆ పనికి రైతులు సాహసిస్తుంటారంటే వారి జీవితాలు ఎంత దుర్భరమో తెలియజేస్తాడు... ఆ పనిలోనే తన మిత్రుడు ఆంజనేయులు జైలు పాలవుతాడు.

జూదం ఆడుతూ సొమ్ము నష్టపోయే వాళ్ళూ, కన్నకూతుర్ని వ్యభిచార వృత్తిలోకి దించి 'పూనా'కి పంపించే 'సావిత్రి' వంటి తల్లులూ... ఎండిపోయిన నదిలో ఇసకను ట్రాక్టర్లపై పట్నాలకు తరలించే కాంట్రాక్టర్లతో దారిద్ర్యం దాడి చేసిన వికృతరూపంగా గ్రామం... దర్శనమిస్తుంది. ఇన్నింటికీ కారణం 'వాన' నేలకు దిగకపోవడమే. వర్షాలు కురవని కారణంగా ఆ గ్రామ ప్రజలు బ్రతుకు తెరువు కోసం చేసే పనుల వల్ల ... రానున్న విపత్కర పరిస్థితులు తెలిసినా అలా చేయక తప్పని పరిస్థితుల్ని రచయిత వివరించిన తీరు గుండెను కలచి వేస్తుంది.

కథానాయకుడు అప్పు తీర్చాల్సిన నీలకంఠం... కథా నాయకునికి ఆత్మీయమైన నేస్తం... జానపదగాయని కాంచన అనే అమ్మాయిని పాడు చేస్తే ఆ కాంచననే పెళ్ళి చేసుకోవాలని తీర్పు చెప్పి, నీలకంఠంతో కాంచనకు పెళ్ళి జరిపించేక ఆమె నీలకంఠం పెట్టే చిత్రహింసలకు విసిగి వేసారి... అతడిపై హత్యాయత్నం చేయడం... వంటి సంఘటన.... సోమశిల ప్రాజెక్టు నిర్మాణంలో గ్రామాల ముంపు, ఆ గ్రామాలు ఖాళీ చేయాల్సి వుందని ప్రభుత్వం ప్రకటించడం, ప్రజా వ్యతిరేకత... యిలా అనేక సంఘటనలను... ఒక గ్రామం నేపథ్యంలో చిత్రించడంలో రచయిత రాయలసీమ గ్రామాల దుస్థితిని కళ్ళకు కట్టినట్లయింది.

సీమ ప్రజల సమస్యలను సంస్కృతీ సంప్రదాయాలను హృద్యంగా... అత్యంత వాస్తవికంగా అక్షరబద్ధం చేసిన గంగాధర్... ఆ ప్రాంతపు భాష.. అక్కడి జానపద గీతాలను అవసరానుగుణంగా వాడుకోవడంలో చూపిన నేర్పు ముచ్చట గొలుపుతాయి.

చినుకు... నేలకు దూకుతుంది.... చెరువు ఒడిని ఆకాశమంత నింపడానికి నాగరికతలు నీళ్ళతోనే ప్రవహిస్తాయి. చరిత్రలు ఏటి అలలే రాస్తాయి... అని ఆశగా... నవలను ఆరంభించిన గంగాధర్.. ఆ నేల దుర్భర స్థితిని పాఠకుల ముందుంచి... కన్నీటి వాన కురిపించి...

ఒక ప్రాచీన నాగరికతకు ప్రాణం పోస్తూ శాఖోపశాఖలుగా వ్యాప్తమై, పరివ్యాప్తమై, ఒక హరితలోకమై... అణువంత విత్తనం విస్తరించి అరణ్యమై,

మహారణ్యమై జనారణ్యమైన తర్వాత కూడా ఈ హిరణ్యరాజ్యంలో రాజహంసలు ఎగరాలి... బంగారం పండాలి... అనే ఆశతో ముగిస్తాడు.

నవల చదవడం పూర్తయ్యాక బరువెక్కిన హృదయంతో కొంత మౌనంలోకి జారి శిరస్సు అవనతమై పోతుంది పాఠకుడికి. ఏ వాస్తవంలో బ్రతుకుతున్నాం మనం? అని ప్రశ్నించుకుని ప్రగతి, అభివృద్ధి, గ్రామ స్వరాజ్యం... అంటూ పాలకులు చెప్పే మాటలు మనని గురించి కాదులే అనుకుని బాధలకు అలవాటు పడిన ఒక నిర్లిప్తతలోకి జారి, తిరిగి అక్షరం... యిచ్చిన ఉత్సాహంతో చైతన్య ప్రపంచంలోకి మేలుకుని గుండెల నిండా కొత్త కాంతిని నింపుకుంటాం.

రాయలసీమ జనం భాషలో... జీవద్భాషలో జానపదులు పాడుకునే

**రాళ్ళు కరిగే వేళ ఎన్నెలా**

**లోకాలు నిద్దరోతాయి ఎన్నెలా...**

వంటి వెన్నెల పాటలతో కప్పదేవర, కడవ సాంగెం, వంటి సంప్రదాయ సంబరాలతో, నాకు తెలియని ఒక కొత్త ప్రపంచంలో విహరింపజేసి 'విషాదానందగీతం' వినిపించిన మిత్రుడు వేంపల్లి గంగాధర్ నుండి మరిన్ని గొప్ప నవలలు వస్తాయని... తెలుగు నవలకు గంగాధర్ ఒక కొత్త 'ఆశ'గా భావిస్తూ... అతనిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

*17 అక్టోబర్ 2012, పార్వతీపురం*

# కంఠస్వరమే ప్రత్యేక ఆకర్షణ

## గుడిపాటి

నవలారచన ఓ కళాత్మక సాధన. సృజనాత్మక విన్యాసం. ఏం చెప్పాలన్న దాని కన్నా ఎలా చెప్పాలన్న అంశంపైనే రచయిత ఎక్కువ దృష్టి నిలపాలి. చెప్పాలనుకున్న అంశం నిర్ధారించుకున్నాక, దానికి కళాత్మకంగా వ్యక్తం చేయడానికి తపించాలి. ఆ తపన వున్న రచయిత చేసే సాహిత్యసృజన ఉదాత్తమైన కళాఖండంగా వెలుగు చూస్తుంది. ఆ రకంగా వచ్చిందే వేంపల్లి గంగాధర్ రాసిన నవల 'నేల దిగిన వాన'. గంగాధర్ మాటలో, చేతలో చురుకుదనం ఎక్కువ. ఉత్సాహం ఉరకలెత్తుతుంటుంది. ఎంతో చెప్పాలన్న ఆరాటం ఉందతనికి. ఎంతో ఎంతో రాయాలన్న తపన అతణ్ణి నడిపిస్తుంది. ఏదయినా కొత్తగా చెప్పే అతని ప్రయత్నం అభినందనీయం.

కథ, కవిత్వం, వ్యాసం, యాత్రారచనలు చేసిన గంగాధర్ తొలి నవల ఈ రచన. కేంద్ర సాహిత్య అకాడెమీ వారి తొలి 'యువ' పురస్కారాన్ని అందుకున్న సృజనకారుడు రాసిన తొలి నవల ఎలా వుంటుందన్న ఆసక్తి, కుతూహలం పాఠకులకు వుండటం సహజం. వారి ఉత్సుకతనీ నిరాశపరచలేదు. శైలీశిల్పాల్లో తనదయిన విలక్షణ బాణీ కనబరిచారు. రాయలసీమ సాహిత్యమనగానే కరువు లేదా కక్షలు అనుకుంటారు. ఈ రెండూ లేవని కాదు, వున్నాయి. వీటితో ఇప్పటికీ జనం తల్లడిల్లుతున్నారు. వీటితోపాటుగా సీమ గ్రామీణ జీవితంలో వైవిధ్యం వుంది. విషాదం వుంది. విషాదం నుంచి వచ్చిన ఆటపాటలున్నాయి. విషాద బీభత్సం నుంచి మనుషులకు ఉపశమనం కల్పించే కళారూపాలు, ప్రదర్శనలు

న్నాయి. వాటిని నవలారచనకు ఉపయోగించుకోడం ద్వారా గంగాధర్ శైలీశిల్పాల్లో కొత్తదనం కనబరిచారు. ఈ కొత్తదనమే నవలలో ప్రధాన ఆకర్షణ.

కరువు కాటకాల విలయ తాండవంలోనూ, వాన కోసం ఎదురు చూడటం లోనూ, జీవిత పోరాటాన్ని గెలుచుకోడానికి ఆటల్ని సాధనంగా చేసుకోడంలోనూ వున్న వినూత్న కోణాల్ని రచయిత ఈ నవలలో ఆవిష్కరించారు. సీమ జీవితంలోని విలక్షణతలని తన రచనలోకి తీసుకురావడం ద్వారా పాఠకులకు తెలియని ప్రపంచాల్ని పరిచయం చేసారు రచయిత.

గ్రామీణ సమాజంలోని బహుళ సమస్యల్ని, పార్శ్వాల్ని రచయిత ఈ నవల ద్వారా చర్చకు పెట్టారు. కరువు తాకిడి గురించి మాత్రమే కాదు, ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్వాసితులయ్యే వారి వెతల్ని కూడా రచనలోకి తీసుకొచ్చారు. ఒక ఊరును ఖాళీ చేయడ మంటే ఒక జీవితాన్ని మళ్ళీ మొదట్నించి ప్రారంభించడం. రెక్కల కష్టమ్మీద బతికేవారికి అది సాధ్యమా? ఊరును వదిలి వెళ్ళడమంటే దాని తోపాటు ఒక సంస్కృతిని, జీవన విధానాన్ని వదిలివెళ్ళాల్సి రావడం. ఇది సాధ్యం కానందునే గ్రామాలను ఖాళీ చేయడానికి రైతులు వ్యతిరేకిస్తారు. కరువు బారిన పడిన ప్రాంతంలోని మరో పార్శ్వాన్ని ఈవిధంగా చిత్రించారు. సోమశిల ప్రాజెక్టు పేరుతో జరిగిన పరిణామాల పర్యవసానాలు ఈ నవలలో చర్చకు వచ్చాయి.

సీమ పల్లెల్లో పనులు దొరక్క వలసపోవడం, అప్పులు తీర్చలేక అవస్థలు పడటం, చెల్లి పెళ్ళి కోసం కథానాయకుడయిన రైతు నానా అగచాట్లు పడటం... మొదలయిన అంశాల చిత్రణలో సహజత్వం తొంగిచూస్తుంది. సంభాషణల్లో సారళ్యం వుంది. ఉత్తమ పురుషలో కథ చెబుతున్న రైతు కంఠస్వరంలో ఆర్ద్రతని చూస్తాం. బతుకుతీరుపై ఫిర్యాదు లేదు. అప్పులు తీర్చలేక, బతుకు పోరు చేయలేక ఆత్మహత్య చేసుకున్న తన తండ్రి పట్ల కూడా అతనికి వ్యతిరేకత లేదు. జీవన పోరాటంలోకి తనని నెట్టివేసిన తండ్రిని ప్రేమగానే తలుచుకుంటాడు. చివరకు చెల్లి పెళ్ళి సమయంలో తన తండ్రి వుండి ఈ సంరంభాన్ని చూస్తే బావుండేదని తలపోస్తాడు. ఈవిధంగా కథానాయకుడిని సానుకూలంగా చూపడం రచయిత దృష్టి వైశాల్యానికి నిదర్శనం.

ఫిర్యాదుల ద్వారా బతుకు గడవదు. పోరాటం అనివార్యమైనప్పుడు రంగం లోకి దిగక తప్పదు. సవాళ్ళను స్వీకరించడం ధీరలక్షణం. తన సమస్యలకు కారణాల్ని వ్యవస్థ వైఫల్యాల్లో వెదికి తప్పించుకోవచ్చు. ప్రకృతి కరుణించడం లేదని వాపోయి నిష్క్రియాపరుడు కావచ్చు. కానీ ఇందులోని కథానాయకుడు ఆ

కోవకు చెందినవాడు కాదు. బతుకును గెలుచుకోవాలనుకుంటాడు. అందుకే బండ లాగుడు పోటీల్లో పాల్గొంటాడు. ఆ పోటీల్లో గెలుపు కోసం ఆరాటపడతాడు. గెలిచి తీరాలన్న అతని తత్వం చదువుతున్న పాఠకులకు సైతం స్ఫూర్తినిస్తుంది.

నవలలోని కథానాయకుడు మాత్రమే కాదు, అతని నేస్తం ఆంజనేయులు, కథానాయకుడు అప్పు తీర్చాల్సిన నీలకంఠం, కాంచన, ఎద్దుల పోటీల్లో పాల్గొనే సదాశివరెడ్డి మొదలయిన పాత్రలు గుర్తుండిపోతాయి. కథానాయకుని చెల్లి లక్ష్మి పాత్రని తీర్చిదిద్దిన తీరు ముచ్చట గొల్పుతుంది.

సన్నివేశాల చిత్రణలో తను ఎంచుకున్న స్థలానికి సంబంధించిన వాతావరణాన్ని, సాంస్కృతిక సంరంభాన్ని దృశ్యమానం చేస్తారు. ముఖ్యంగా సంక్రాంతి పండగ సమయాన గ్రామాన వుండే వాతావరణాన్ని కథానాయకుడు ఇలా దృశ్యమానం చేస్తాడు:

"సంక్రాంతి పండగంతా పల్లెలో పశువుల పండగే. కళకళలాడే సందడంతా పశువులదే. ఎడ్లపందాలు బండ్లపందాలు, కోడి పందాల, ముగ్గులు, గొబ్బీలు, హరిదాసు పాటలు... ఇంతులూ... పూబంతుల సందడితో వసుధ పులకిస్తుంది... ముత్యాల ముగ్గుల్లో గొబ్బెమ్మల కొత్త అందాలు... గాలి పటాల మెరుపులు... ధరణికి పండువెన్నెల తెస్తుంది.. పండగ పూట ఆనందవేళ బంతిపూలు కిలకిల నవ్వుతాయి..."

ఈవిధంగా కథనంలో ఒక వేగం, ఊపు, కవితాత్మక శైలి నవలకు రమణీయతను చేకూర్చాయి. సౌందర్యాత్మక విలువల్ని ప్రోది చేయడంలో రచయిత సఫలమయ్యారు. అంతేగాక ప్రధాన ఇతివృత్తానికి అనుబంధంగా కొన్ని స్థల పురాణాల్ని కూడా నవలలో చేర్చడం వల్ల ఈ రచనకు నిండుదనం చేకూరింది. 'పీరమ్మ మండపం' గురించిన కథ ఆసక్తికరమైంది. మానవ సంబంధాల తీరుతెన్నులు ఎలా వుంటాయో, విపరిణామాల్ని సహించని సమాజం ఏవిధంగా ప్రతిస్పందిస్తుందో ఈ కథలో చూస్తాం. వీటిని చిత్రించడంలో రచయిత సంయమన దృష్టిని కనబరిచారు.

వానకోసం పాడే పాటలు, కప్పల పండగలు, వానదేవుని రాకడ కోసం ఎదురు తెన్నులు, ప్రార్థనలు ఎన్నిరకాలుగా వుంటాయో చెప్పిన తీరు నేలతో సంబంధం వున్న మనుషుల లోపలి ఆర్తిని పట్టిచూపుతుంది. వానపాటలకు మూలాలు ఎక్కడున్నాయో, ఆ పాటలు మన జీవన సంస్కృతిలో ఏవిధంగా భాగమయ్యాయో అధ్యయనం చేయాలనుకుంటే ఈ నవల చదవాలి. నవలలో

అనేక సందర్భాల్లో, సన్నివేశాల్లో సీమ పల్లెల్లో జనం పాడుకునే పాటల్ని రికార్డు చేశారు రచయిత. ఈ పాటలు కథనంలో వేగానికీ, సౌందర్యానికీ, చదివించే గుణం రెట్టింపు చేయడానికి ఉపకరించాయి. సినిమాల్లో మాదిరిగా పాటల్ని కృతకంగా పెట్టలేదు. పాటలకీ, కథనానికీ నడుమ సంబంధం సవ్యంగా ఉండేలా చూడటం రచయిత నైపుణ్యానికి దాఖలా. ఆయా సన్నివేశాల్లో పాటలు సహజంగా ఇమిడిపోయాయి.

గ్రామాలు పాతకాలంలో మాదిరిగా చెక్కు చెదరకుండా వున్నాయని గంగాధర్ చెప్పడం లేదు. వాటిలోకి అవలక్షణాలు వచ్చి చేరుతున్న వైనాన్ని కూడా చెప్పారు. ఊళ్లోకి మట్కా రావడం, దాని ప్రభావం పచ్చని సంసారాల్లో చిచ్చు పెట్టడం వంటి అంశాలు నవలలో చిత్రితమయ్యాయి. ఈ పరిణామాల చిత్రణలోనూ ఆవేశకావేశాలకు పోకపోవడం రచయిత పరిణతిని తెలియ జేస్తుంది. పాత్రలకు ఆవేశాలు, కోపాలుండవచ్చు, కానీ రచయితకు ఉండకూడదని సుప్రసిద్ధ రచయిత బుచ్చిబాబు చెబుతారు. ఈ అవగాహన గంగాధర్‌కు వుంది.

కనుకనే సీమ పల్లెలోని జీవన వైవిధ్యాన్ని ఎంతో నేర్పుతో, ఓర్పుతో ఈ నవలలోకి తీసుకొచ్చారు. అనేకానేకాంశాల్ని స్పృశిస్తూ ఈ రచన ముందుకు సాగుతుంది. 'నేల దిగిన వాన' అని పేరు పెట్టడంలోనూ సానుకూల దృష్టి వుంది. వాన రానే రాదనుకుంటే ఎలా? వస్తుంది. రావాలన్న ఆశనే కాదు, వస్తుందన్న నమ్మకం సైతం ఉండాలి. జీవితంలో గెలిచి తీరుతానన్న నమ్మకమే పట్టుదలతో కృషి చేయడానికి ఉద్యుక్తుణ్ణి చేస్తుంది. అలాగే వాన వస్తుందని విశ్వసించడమూ అబద్ధం కాదు, నిజమై తీరుతుందని ముగింపు దృశ్యం తెలియజేస్తుంది.

కవితాత్మక శైలిని ఉపయోగించడం వల్ల నవల చదివిస్తుంది. దృశ్యాలు మన కళ్ళముందు కదలాడుతుంటాయి. దృశ్యాల పరంపర సినిమా రీళ్ళలా సాగి పోతుంటుంది. సీమ జీవితాన్ని అక్కడి సాంస్కృతిక వైవిధ్యంతో సహా సినిమా తీయాలనుకుంటే ఈ నవల ఒక మంచి స్క్రిప్టుగా ఉపకరిస్తుంది. ఒక మంచి నవల చదివే అవకాశం కల్పించిన గంగాధర్‌కు ధన్యవాదాలు.

# నేల దిగిన వాన

## 1

**జా**లి లేని ఆకాశం నుంచి ఒకానొక సుదీర్ఘ సంఘర్షణ తర్వాత రాతి వాసన వేస్తున్న మట్టి రైతును మొలిపించడం కోసం

చినుకు....

నేలకు దూకుతుంది

చెరువు ఒడిని ఆకాశమంత నింపడానికి!

నాగరికతలు నీళ్లతోనే ప్రవహిస్తాయి

చరిత్రలు యేటి అలలే రాస్తాయి.

## 2

**పె**ద్దబ్బా....

ఈ పాడు వాన ఎప్పటికి కురుస్తాదోనని ఎందుకు ఎదురు చూస్తావు? మేఘాలన్నీ భళ్ళున విరిగి కరిగి నేల నేలంతా నీరై పాకే శబ్దం కోసం ఎంత కాలం నిరీక్షిస్తావు...?

## 3

**హి**రణ్యం...

హిరణ్య రాజ్యం...

హిరణ్యమంటే బంగారం ఇది బంగారం పండే నేల రత్నాలు రాశులు పోసి అమ్మిన వజ్రాల గడ్డ ఈ బంగారు నేలమీద జన్మిస్తే చాలు వెయ్యి జన్మల తపస్సు ఫలించేది. నిత్యం అవే సూర్యోదయాలూ... అవే సూర్యాస్తమయాలే... అయినా

ఇక్కడి రైతుల జీవితం నిత్య నూతనంగా.. కాంతిమంతంగా వెలిగేది. ఇక్కడి నేలంటే రైతుకు ప్రాణం. రైతంటే నేల తల్లికి ఇష్టం. ఇక్కడ పంచ భూతాలు పరవశించేవి.

ఆ నింగీ... నేలా... నిప్పు... గాలీ..... నీరూ... పరిమళించేవి.

రైతు కంట్లో కన్నీరు చిందితే రాజ్యానికి అరిష్టం.

రైతుకు రవ్వంత కష్టం కూడా రాకుండా చూసేవి.

రైతును గుండెలో పెట్టుకొని చూస్కొనేవి.

రైతును గుండెలో పెట్టుకొని చూస్కొ నేవి.

ఆ రోజుల్లో....

ఆ బంగారు కాలాల్లో

రైతు రాజుగా లోకాలు ఏలే కాలాల్లో...

మట్టిమిద్దె వసారాలో దూలానికి జొన్న కంకుల గుత్తి తగిలించి తను పండించిన పంట వైభవాన్ని ప్రదర్శించే గంభీర కాలాల్లో....

ఊరపిచ్చుకలు కిలకిలరావాల శబ్దం చేసుకుంటా వసారాలో కట్టిన జొన్నకంకుల్ని పొడుచుకొని తింటూ వుండే ప్రశస్తమైన శుభ ఘడియల్లో...

భూమి మీద ఆకాశానికి ప్రేమపండే తరుణాల్లో.....

మబ్బులన్నీ సలాం చేస్తూ నేల తల్లిని ప్రార్థించే సమయాల్లో...

విత్తనం పచ్చని విశ్వరూపం చూపిస్తూ ప్రకృతికి పందిరేసే వేళల్లో...

ఒక ప్రాచీన నాగరికతకు ప్రతీకలా....

శాఖోపశాఖలుగా వ్యాప్తమై... పరివ్యాప్తమై...

వొక హరిత లోకమై.. అణువంత విత్తనం విస్తరించి...

అరణ్యమై... మహారణ్యమై... బంగారం పండే నేలగా...

ఈ హిరణ్యరాజ్యాం ఎలా వుండేది..

నదీ నదాల్లో... కందకాల్లో...

కంచెల్లో.. కొండకోనల్లో... కీకారణ్యాల్లో....

జాజిపూల జలపాతాల్లో... హిరణ్య రాజ్య వీధుల్లో.. ప్రతి ప్రాతఃకాలం ఎరుపెక్కిన గుండెలతో ఆకాశం నుంచి అరుణోదయ ఆవిష్కారం.. వేయి వెలుగుల

జ్యోతిలా... విశ్వాత్మ విశ్వరూపం... చరాచర జగత్తు వేకువకాంతుల్ని వీక్షించే తరుణం... ఒక పురాతన పరిణామం!

ఇక్కడ ప్రవహించే నదికి పాడేందుకు వొక పాట వుంది. కొండకు, కోనకు చెప్పేంత చరిత్ర వుంది. వినిపించేంత కథ వుంది. దురదృష్టంకొద్దీ అవి మాట్లాడ లేవు. పాడలేవు. విన్పించలేవు. నేడు హిరణ్య రాజ్యం ఎలా మారింది..?

నెర్రెలు చీలిన నేల... కరువు విధ్వంసం...

మోడైన చెట్లు రాల్చే కన్నీళ్లు...

వట్టిపోయిన ఆకాశం...

ఎండిపోయిన నేల...

పిడచకట్టుక పోయిన గొంతులు... నేలలోతుల్లోకి ఎన్ని అడుగులు లోపలికెళ్ళినా నీటి జాడలేదు. నీటిజాలు లేదు. దాహం... దాహం... దాహం...

గొంతెత్తి ప్రార్థించినా... చేతులు జోడించి పూజించినా... అదంతా గొంతు తడవడానికే... నేలతల్లి గుండె తడవడానికే కదా! పడమటి దిక్కున వరద గూడు కోసం కళ్ళు చూసి చూసి విసిగిపోతా వుండాయి. భరోసా లేని బతుకయ్యి పోయింది.. ఎండిన బీళ్ళ మధ్య పచ్చటి ఇగుళ్ళ కోసం రైతులు ప్రాణాలు పణంగా పెడతావుండారు. వట్టిపోయిన బావులు.. బోర్లు.. ఎండిపోయిన చెరువులు.. కుంటలు.. వెరిసి నలుగురికీ పట్టెడన్నం పెట్టే అన్నదాత నోట్లో మట్టికొట్టాయి. మట్టిశాపం... రైతు బతుకులో అలజడి... తడి...

నీరై... నిశీధి కన్నీరై... నిబిడాంధకారపు హోరై.. నీరవ నిశ్చేష్టాదృష్ట నీహారికా ధారై...

కరిగి... కరిగి... అరిగి... అరిగి... నలిగి... రగిలి..

పగిలి.. గుండె పగిలి.. దోసిట్లో కన్నీటి ప్రవాహమై... ఒక దుఃఖ గీతమై.. విషాదశోకమై... ఆలపించే ఈ నేల ఘోష..!

హిరణ్య రాజ్యం... దీనికి మరో పేరే రేనాడు...

రేనాడు రాజ్యం... చరిత్ర పుటల్లో చెరగని కీర్తి శిఖరం... రేనాటి సీమ.. మబ్బుకరగని సీమ.. సేద్యం చట్టుబండలై ఇనుప గజ్జల తల్లి నాట్యం చేసే వట్టిళ్ళలోగిలి సీమ... నారు పోసినోడు నీరు పొయ్యలేని సీమ... కరువు సీమ... వ్యవసాయ కూలీలుగా కూడా బతకలేని దుర్భర దారిద్ర్యం మనుషుల్ని నగరాలకు, ఫ్యాక్టరీలకు తరిమేస్తుండే ఒకానొక హృదయ విదారక దృశ్యం. క్షణం తీరిక లేదు. దమ్మిడీ ఆదాయం లేదు. చాలీచాలని బతుకులు. ఇప్పటి నుంచి కాదు..

ఎప్పట్నుంచో.... వేలాది సంవత్సరాలు... లెక్కలేనన్ని తరాలు... కరికాల చోళుడికాలం... వాళ్ళతోనే వచ్చింది ఆ పేరు. అదే 'రేనాడు'. రేనాటి చోళులు నడిచిన నేల.... ఏలిన నేల... పాలించిన నేల... మూడు తాలూకాలు... కమలాపురం... ప్రొద్దుటూరు... జమ్మలమడుగు... కర్నూలులోని కోయిలకుంట్ల తాలూకాలోని కొన్ని భాగాలు... కలిపి ఏడువేల గ్రామాలుండే మండలం.. ఇన్నుంచి తూర్పుకు రాజంపేట తాలూకా పొత్తపడికాడికి. పడమట కర్నాటకలోని తుంకూరు జిల్లా పావుగడ తాలూకాలోని నిడిగల్లు, ఎరిగల్ వాడి వైపుకు...! ఇదంతా రేనాడు. దీనికి ఒకానొక రాజు కరికాల చోళుడు. రేనాటి చోళుడు – రాజులకే రాజు – రారాజు. వీరాధి వీరుడు. కొట్టురా తొడ, తిప్పరా మీసం. ఎండిపోతాండే పొలాలు... నీళ్ళ కోసం పడిచస్తాండే బీడు భూములు.. ఆకులు రాలిపోయి అల్లాడుతుండే చెట్లు... చేమలు.. గింజలు కూడా లేకుండా దుఖ్ఖించే రైతులు.. డొక్కలెండి పోతాండే జీవాలు.. భయంకర దృశ్యం! యాడ చూసినాడు...? ఏంజేసినాడు..? ఎంత పనికి పునుకున్నాడు... పైపైన పోతాండే కావేరి నదికి కళ్ళెం వేయాలని జూసినాడు. నదిని తిప్పుకుంటే నాగరికత నిర్మాణ మౌతుందని కల కన్నాడు, నీళ్ళకోసం పరితపించాడు. నీళ్ళు తిప్పుకుంటే రేనాడులో రత్నాలు పండుతాయి. వజ్రాలు మొలకెత్తుతాయి. హారాల లెఖ్ఖన గింజలు విరగకాస్తాయి. రైతుల కడుపులు నిండుతాయి. జీవాల డొక్కల్లో జీవం నిండుతాది. జనం కోసం.. జనంలో జీవంకోసం... జీవజలం కావాలి.. జలం... జలం.. సాగిపోతాండే కావేరిని మళ్ళించుకోవాలి. పైన పోతాండే జలమాతకు పగ్గాలేసి రేనాటి దిక్కుకు పారించుకోవాలి... పాలించుకోవాలి. సాగించుకోవాలి... సాగులు చేసుకోవాలి... ఎన్నెన్ని కలలుకన్నాడు. సాధ్యం కాలేదు. శత్రువైనా లొంగుతాడు గానీ నది లొంగుతుందా? అందుకే పెన్నమ్మ... పెన్నానదీ మాతను నమ్ముకున్నాడు. ఆ తల్లి స్వర్ణయుగం చూపించింది. కమలాపురం తాలూకా పెద్ద చప్పలి రాజధానిగా పారిపాలన సాగింది.

ఈ హిరణ్య ప్రాంతంలో రైతులు సింహాల్లాగా బతికినారు. రైతులంటే 'మేమే' అనేటట్లు మీసాలు తిప్పుకొని తిరిగినారు.

తొకను వీపుపైన చుట్టు తిప్పి ఎడమవైపు నిలబడిన అసమాన పౌరుష, పరాక్రమాలను చాటే సింహము రేనాటి చోళుల రాజలాంఛనమైంది.

వీరి మొదటి శాసనం కలమళ్ళ గ్రామంలో వేయించినారు. 'ఎరికల్ ముత్తురాజు' బిరుదముతో ధనుంజయ వర్మ వేయించిన మొదటి తెలుగు శాసనమిదే! ఇది ఆరవ శతాబ్దం నాటిది.

ప్రొద్దుటూరు దగ్గర పెన్నానది ఒడ్డున రామేశ్వర ఆలయాన్ని 'పోర్ముఖ రామ' బిరుదుతో పుణ్యకుమారుడు నిర్మించాడు.

అత్తిరాల దగ్గరి త్రేతేశ్వరాలయం కూడా రేనాటి చోళులే నిర్మించారు.

ఈ రేనాటి ప్రాంతాన్నే ప్రాచీన కాలంలో మహారాజవాడి, మార్జవాడి అని కూడా పిల్చినారు. జనాల్లో నిలబడిన పేరు మాత్రం 'హిరణ్య రాజ్యమే'.

***

ప్రియురాలు ముంతాజ్ కోసం పాలరాతి సమాధి కట్టించడానికి షాజహాన్ వుండాడు... చెట్టు నుంచి రాలిపడే ఆపిల్ కాయను చూడడానికి న్యూటన్ వుండాడు. రాజుగారి కిరీటం బరువును స్నానాల గదిలో కనుక్కోవడానికి ఆర్కిమెడిస్ వుండాడు... జిరాఫీ మెడ ఎందుకంతగా సాగిందో విశ్లేషించడానికి డార్విన్ వుండాడు... ఆడపిల్లలవైపే అబ్బాయిలందరూ ఆశగా ఎందుకలా చూస్తారో చెప్పడానికి ఫ్రాయిడ్ వుండాడు... బ్రిటిష్‌వారిని క్విట్ ఇండియా పేరుతో తరమడానికి మహాత్ముడుండాడు. వీళ్ళందరి గురించి మా కెందుకు...?

ముసిల్ది కట్టించిన సద్దిమూట భుజాన వేసుకొని చిరుగుల చొక్కా తొడుక్కొని జీవాల్ని తోలుకుంటూ ప్రతిరోజూ సూర్యోదయాన్ని చూడడం.. ఎండిపోయిన చెరువు గట్టున మోడువారిన వేపచెట్టు నీడలో ఎర్రకారంతో మధ్యాహ్నాన్ని కడుపు నింపుకోవడం... ఇలాగే మా నాన్న చేసేవాడు... ఇప్పుడు నేను చేస్తున్నాను. రేపు నా కొడుకు చేస్తాడు. మేమిలా అజ్ఞాతవాసంలోనే వుండిపోతాం... మమ్మల్ని ఏ కొలంబస్ కనిపెట్టలేడు.. మా కరువు చెరువును ఏ వాస్కోడిగామా గుర్తించలేడు..

ఇక్కడ మనిషొకటి తలిస్తే విధి మరొకటి తలుస్తుంటుంది.

అందుకే మా ఊర్ని ప్రపంచపటం నుంచే బహిష్కరించినట్టుంటాది...

ప్రపంచమంటే నగరాలు.. పట్టణాలు మాత్రమే కాదు. కొండల్లో.. లోయల్లో.. అడవుల్లో.. అనాగరికులు కూడా ఎంతో మంది వున్నారు. వాళ్ళ జీవితాలు ఎలా వున్నాయి?

ఒకపూట తిండి గింజలు కూడా దొరక్క ఆకలి చావులు చచ్చిన వాళ్ళు..

అప్పుల బాధలకు తాళలేక ఆత్మహత్యలు చేసుకున్నవాళ్ళు...

నేల తల్లిని నమ్ముకొని కరువు కుంపటి నెత్తికెత్తుకున్నవాళ్ళు...

పొట్ట గడుపుకోవడానికి పూనా వ్యభిచార గృహాలకు అమ్ముడైన అమ్మాయిలు...

కల్తీ విత్తనాల మోసం... గిట్టుబాటు ధర కూడా రాక నిరాశ... ఇలా ఎందరో జీవితాలు ఒక ఆట... ఎప్పుడు ముగిసిపోతుందో తెలియని ఈ నాటకం పేరే జీవితమా...!

మా జీవితాలు అపశ్రుతులు

మా జీవితాలు వక్రరేఖలు

మా జీవితాలు తీరని శాపాలు

ఎందుకో తెలుసా?

మేము ఆకాశం నుంచి చినుకుల కోసం ఎదురు చూసేవాళ్ళం!

ఇదిగో మా ఊర్లోకి వస్తున్నారా! అయితే పెన్నమ్మకు నిండుగా మదిలోనే నమస్కారాలు చేసుకొని నాతో రండి..

ఇలాగే... ఈ కాలిదోవ వెంబడే.. ఈయేటి గట్టుమీద వుండే శాసనం సూడండి..

ఏమని చెక్కినారు...? ఎండకు ఎండి... వానలకు తడిసి అక్షరాలు కన్పించడం లేదుకదూ...!

“ఈ యేరు సాగనియ్యక యవ్వండుఖిలం సేసును, ఈ ధర్మమునకు యవ్వరు తప్పినాను.. తమ తల్లితండ్రుల వారణాశిన కుతికలు కోసిన పాపాలపోదురు. గంగావతిలోను గంగెవును చంపిన పాపాన పోదురు. శణుక మాంసం సురశేవించిన పాపాన పోదురు. పంచమహాపాతక సంయుక్తుండగును”

ఇది శాసనం.

యేరును ఎవరూ అడ్డుకోకుండా రేనాటి రాజులు వేసిన శాసనమిది.

ఇప్పుడు యేరుని ఎవరూ అడ్డుకోలేరు. పెన్నమ్మ ఎండిపోయింది. మా ముఖాన కరువును కొట్టి తన దారిన తాను పోయింది. ఇప్పుడు నది లేదు... నదిలో తడిలేదు... శాసనం మాత్రం వుండాది, యేటి గట్టున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను చూస్తూ!

## 4

నడిరాత్రి ఉలిక్కిపడి కలవరంలోంచి మేల్కొని జూసుకుంటి. ఒళ్ళంతా చమటలు పట్టి వుండాయి. తెల్లారితే శ్రీరామనవమి. ఒంటిమిట్టకు పోవాల. పోయి గెల్సాల. గెల్సి సూపియ్యాల. అక్కడే కోదండరాముడు వుండాడు గుడిలో.

ఆ సామీ మహత్యం సూపీకపోతాడా.... నన్ను అప్పుల్లోంచి గడ్డకేయకపోతాడా... నా కుటుంబాన్ని కాపాడకపోతాడా... తుండుగుడ్డలో చమట తుడుసుకుంటా లేస్తి. గాట్లోకి పోయి ఎద్దుల్ని చూసుకుంటి.

మామూలుగైతే ఎప్పుడూ యింతగా దుఖ్ఖపడింది లేదు. కానీ నీలకంఠం గుర్తుకొస్తే రొంచెపు యాడలేని తనకలాటైతాది గుండెలో.

ఏంచేసి సచ్చేది?

గతిలేక ఊర్లో అప్పుజేసిన పాపానికి ఆ పాయికారి నాయాల్తో మాటలు పడాల్సివచ్చె ఎట్లైనా గానీ వాడి బాకీ తీర్చాల. దుడ్లమూటే వాడి ముఖానా యిసిరి కొట్టాల. తాకట్టులో వుండే భూమి యిడిపించుకోవాల. అయినా నేనేం జేసేది?

నమ్ముకున్న నేల నిట్టనిలువునా ముంచుతాదని ఎప్పుడు కలగంటి?

పోసిన గింజలు పోసినట్లు ఒట్టి పోతాంటే పచ్చని పైరు ఎట్లా లేస్తాది?

ఈ ఆకాశం రవ్వంతైనా జాలి జూపిస్తాంటే కదా! నాలుగు సినుకులు కురిపిస్తేనలభై పుట్ల ఒడ్లు రాశిపోసే నా కొడుకుని.

ఏదీ చినుకు రాలిందేది?

పెట్టిన పెట్టుబడి గూడా రాకుండా మానాల్ని, ప్రాణాల్ని కూడా పణంగా పెట్టి ఆడతాండమే ఈ జూదం, ఆ నేల తల్లికి తెల్సి సస్తాందా?

ఆ మోడాలకు అర్థమైతాందా?

ఎప్పుడూ మూగిమీదేసుకొని ఏం ఎరగనట్లు వుండడమే తప్ప దాన్లకేం తెలుసు?

మా యబ్బకాలంలో ఊర్లోనే పెద్ద రైతులం.

మా కింద ఎందర్నో బతికించేటోళ్ళం. సేయి సాచి అడిగినోళ్ళకు లేదనకుండా పుట్లు పుట్లు దానమిచ్చేటోళ్ళం.

పోయింది... పోయింది...

ఆ వైభోగమంతా పోయింది...

ఇదే ఈ నేలే.. ఈ భూమే... ఈ గడ్డనే...

మా జీవితాల్ని మింగింది.

ఎట్లా బతికినోళ్ళం...

ఎట్లా బతుకుతాండం...

ఈ దినం యింగోడి దగ్గరికి కూలీగా ఏంటికి పోవాల్సివస్తాంది?

వద్దు.. వద్దు... ఈ జీవితం వద్దు..

భయంతో.. చమట కారిపోతాంది... ఒంట్లో సన్నని అలజడి.. గెల్సాల.. గెల్సితీరాల...

ఎద్దులు బాగుండాయి.. నా జాతకమే బాగాలేదు..

దగ్గరకిపోయి ఎద్దుల్ని తడిమి సూసుకుంటి.

గుండెకేదో హాయి. రవ్వంత ప్రశాంతత.

పందెంలో ఓడిపోకుండా గెల్సాల.

గెల్సి నన్ను నా జీవితాన్ని నిలబెట్టాల.

ఎద్దులు మెడ విదిల్చాయి. గంటలు గుళ్ళో మోగినట్లు సవ్వడి జేసినాయి.

అయినా గుళ్ళో శ్రీరాములోరు వుండారు.

సామి గెలిపీక పోతాడా...

ఏం గెలిపిస్తాడో ఏమో...

ఊర్లో వాళ్ళు ఏందో అన్నారని మహా తల్లి సీతమ్మ గారినే అడవులకు పంపినోడు...

అయినా ఆయన్ను దేవుడనే అన్నారు కదా!

అవన్నీ నాకెందుకు? రేపు బండలాగుడు పోటీల్లో నా ఎద్దుల గెల్సాల.

అది సాలు సామీ!

నా కడుపుకు తిన్నా, తినకున్నా

ఎద్దుల్ని పోషించుకుంటా వుండాను. ఒక్కొక్క దానికి దిన్నం మూడు కేజీల ఉలవలు, పది కేజీల జొన్నలు, రెండు కేజీల రాగులు, ఆదివారాలప్పుడు మసాలపెట్టిన మాంసం ముద్దలు, కోడిగుడ్లు, నూగులపిండి పెట్టి పెంచుతాండను. రేత్తిరిపూట దిన్నం అరటిపండ్లు, తమలపాకులు కూడా.

ఎన్ని పెట్టినా ఎద్దులు పచ్చి జొన్నగడ్డి అంటే ఇష్టంగా తింటాయి.

బాగుండే రోజుల్లో బాగా పంటలు పండేటప్పుడే. వానలు సరిగ్గా కురిసే రోజుల్లో అన్నీ సమకూర్చి పెట్టెటోన్ని. ఇప్పుడు కూడా ఇట్నే సాకాలంటే నాకు యాడైతాది. దీన్ల పోషణకే సగం అప్పులైనాయి. మిగతా సగం భూమి తల్లి

మింగింది. పచ్చగడ్డి యాడలేస్తాది... జొన్నగడ్డి.. ఎట్టవస్తాది... యాన్నుంచి వస్తాది...

ఎద్దుల్ని నిమిరి చూసుకుంటి.

నా రెండు కళ్ళు – పంచప్రాణాలు – నా ఎద్దులు

పొలంలోకి దిగినాయంటే రోజుకు ఆరేడు ఎకరాలు సునాయాసంగా దున్నేస్తాయి. నాలుగు టన్నుల బరవైనా అవలీలగా లాగిపారేస్తాయి.

బండ లాగుడు పోటీల్లో ఎంతటి బరువైన రాతి దూలాన్ని అయినా ఈడ్సి నా పరువును నిలబెడతాయి.

ఆ నమ్మకం నాకుంది.

కాకపోతే నిన్న సాయంత్రం పొలంకాడ వలపట ఎద్దు వీపుమీద కాకి వాలి వుండడం జూస్తి. దగ్గరికి పోయి పరిశీలన జేస్తి. పుండు ఏందో లేసుంది. అప్పటి కప్పుడు యాపాకు నూరి పసురు చేసి పట్టించాను. అదే రొంత దిగాలుగుంది. అయినా పోతిరెడ్డిపల్లె కాన్నుంచి సదాశివారెడ్డి ఎద్దులుగాని రాకుంటే బాగుండు ననిపిస్తాంది. కాస్త అటిటైనా ఆ ఎద్దులురంగంలో నిలబడగలవు.అదే కొంచెం భయంగానూ వుంది. టంగుటూరు కాడ శ్రీహరజత్ ఖాదర్‌వలి ఉరుసునాడు జరిపిచ్చిన బండలాగుడు పోటీలు ఎట్టెట్టె జరిగినాయి... అనుకుంటే చాలు కాళ్ళు చేతులూ వణికిపోతాయి. చిట్టచివర్న ఆఖరిదశలో పోతిరెడ్డిపల్లె ఎద్దులు తగ్గినాయి కాబట్టి సరిపోయింది. లేకుంటే మొదటి బహుమతి నాకు ఎక్కడొచ్చివుండేది?

మళ్ళీ ఇప్పుడు అట్టాటి పరిస్థితే రాదు కదా! పైగా వలపట ఎద్దు అంత ఆరోగ్యంగానూ కన్పించడంలేదు. ఎద్దుపుండు గురించే ఆలోచిస్తుండాను. సూసి సూసి ఈ ఎద్దుల్ని అమ్ముకోవడం కూడా నాకిష్ట ముండదు. మా నాయన ఎంత కష్టపడి ఈ ఎద్దుల్ని కొన్నాడు. నేను పిల్లోడప్పుడు సేద్యం కోసం పులివెందుల సంతలో కొన్న ఎద్దులు.

మా నాయన రామిరెడ్డి

మీసాలు దువ్వుకుంటూ బతికినోడు.

రామిరెడ్డి పంచాయితీకి వచ్చినాడంటే ఎట్టాటి సమస్య అయినా పరిష్కారమై పోయేది.

సీతాపురం కాన్నుంచి దిగువ గుట్టపల్లె కాడికి, ముదిరెడ్డి పల్లెకాన్నుంచి గండ్లూరు కాడికి వుండే భూములన్నీ సాగు చేసుకొమ్మని ప్రజలకు దానమిచ్చిన ధర్మదాత. ఆయన ఇష్టపడి కొన్న ఎద్దులు. సేద్యం పనులన్నీ ఒంటి చేత్తో జరిగిపోయేవి. దాన్లమీద పెట్టిన శ్రద్ధ కారణంగా అవి బాగా పుంజుకున్నాయి. శరీరం పెరిగింది. కండలు తిరిగినాయి. పోటీలకు తయారైనాయి. అప్పట్నుంచి అటు పొలం పనులకు, ఇటు పోటీలకు ఈ ఎద్దులే ఉపయోగపడతాండయి. కార్తీక మాసంలో ప్రొద్దుటూరి దగ్గరి రామేశ్వరంలో మొదటిసారి బండలాగుడు పోటీల్లో నెగ్గినాయి. పదివేల నూటా పదార్లు గెల్సినాయి. అప్పట్నుంచి దీన్లను ప్రాణం లెఖ్ఖన చూసుకుంటూ వుంటిమి. వానలు పడక.. కరువు కమ్ముకున్నాక... భూములు మోసం జేయడం నేర్చుకున్నాక... పండిన గింజలకు కూడా గిట్టుబాటు ధర రాకుండా దళారులు మోస్తుండటం చూళ్లేక... వ్యవసాయం మానుకోలేక... అప్పులు తీర్చలేక.. నడి పొలంలో గన్నేరు కాయలు నూరుకొని తాగినాడు నాయన...

గన్నేరు కాయలకు ఏం తెలుసు? రామిరెడ్డి దాన గుణం. సేవాతత్పరత. బలి తీసుకున్నాయి! నాయన పోయినాక అప్పులోళ్ళు రాబందుల తీర్న వచ్చి వాలినారు. సూటిపోటి మాటలు పడలేక సత్రంకాడి భూమి తాకట్టు పెడితిమి. చాల్లేదు. కొర్రపాడు దగ్గర భూమి అమ్మితిమి. చాల్లేదు. కమలాపురం వెంకటరెడ్డి మామ ఇచ్చిన డబ్బూ మిగల్లేదు. మేం మాత్రం మిగిలినాం... ఎముకలగూళ్ళతో. అప్పుయింగా వుంది. నీలకంఠారెడ్డికి తీర్చాల్సిన బాకీ యింగా వుంది. ఇంటి చుట్టి కారం తిరుగుతాండడు. ఎట్లైనా బాకీ తీర్చాల. వాడి నోటికొచ్చినట్లు అంటాడు. ఈసారి బండలాగుడు పోటీల్లో వచ్చిన దుడ్లు వాడి కియ్యాల వడ్డీ కింద జమ చేసుకొమ్మని. సేద్యానికి చేసిన అప్పులు నాయన ప్రాణాన్ని గన్నేరు కాయలు మింగేటట్లు చేసినాయి. అమ్మ కాంతమ్మ, చెల్లెలు లక్ష్మి, నేనూ మిగిలాం. కూలికిపోతే కుండ కాలుతుంది. లేకుంటే ఎండ కాలుతుంది. కడుపు కాలుతుంది అనే పరిస్థితి వచ్చినప్పుడు కూడా అమ్మే మమ్మల్ని పెంచి పెద్ద జేసింది. చిన్నాయన ప్రతాపరెడ్డి మాకు అండగా నిలబడ్డాడు. ఇబ్బంది వచ్చిన ప్రతిసారీ 'నేనుండా లేరా... ఆ పని నేను చేస్తానని...' ముందుకొస్తాడు. చెల్లెలు లక్ష్మికి ఈ సంవత్సర మన్నా పెళ్ళి చేయాలి. యిప్పటికే దాని ఈడు పిల్లోళ్ళందరికి పెళ్ళిళ్ళు అయ్యి బిడ్డలు కూడా పుట్టి వుండారు.

నాయన సచ్చిపోయిన కాన్నుంచి ఇంట్లో ఒక పండగలేదు పబ్బం లేకుండా పోయింది.

అట్నే నెగ్గుకొస్తున్నాం ఇంటిని.. జీవితాన్ని!

నాయన ఏం జేసినాడు? ఎంత పని చేసినాడు? చూడు...

సేద్యం మోసం చేస్తే గన్నేరుకాయలు నూరుకొని తాగితే అప్పులు పోతాయా?

నువ్వు లేవు నాయనా... అప్పులు తీర్చిన కాడికి తీర్చినా... యింకా చెల్లి పెళ్ళి చేయాల్సి వుంది...

ఇదేనా నాయనా? రైతు భారతం... పైరుకు ప్రాణం పోయాల్సిన నువ్వు... ప్రాణం తీసుకోవడం ఏంది..?

రోజులెప్పుడూ ఒకేలా వుండవు కదూ నాయనా...

ఇలా నాలో నేనూ ఎన్నిసార్లు దుఖ్ఖించానో...!

గాట్లోని ఎద్దుల్ని మరోసారి తడిమి చూసుకుంటి. ఎత్తుగా బలంగా ఎంతో అందంగా కన్పిస్తాండయి. వలపట ఎద్దు రొంత మెత్తబడినట్లు వుండాది. కురుపుకు మళ్ళీ పసురు పట్టిస్తి. ఆడనే రొంచేపు కూర్చున్నాను, ఎద్దుల్ని సూసుకుంటా.

ప్రతాపరెడ్డి చిన్నాయన వచ్చినాడు.

"ఏరా.. పాపోడా... నిద్రపోలేదా? అడిగినాడు.

"లేదు... చిన్నాయన... పోవాలకదా ఒంటిమిట్టకు. ఎట్లైనా గానీ గెల్సాలా... చెబితి ఆయన కళ్ళదిక్కు జూస్తూ.

ఆయన కళ్ళు కూడా ఎర్రగానే వుండాయి.

అర్థమైంది. బండలాగుడు పోటీలో గురించే ఆయానా ఆలోచిస్తా నిద్రపోలేదని.

"గెల్సుతాయి లేరా... నాయనా... అట్టా యింగ అదే లోకంలో వుంటే ఎట్లా" – నా పక్కనే కూర్చుంటా అన్నాండు.

"ఏం జేసేది... చిన్నాయన... అంతా బాగానే వుంది కదా... అని అనుకుంటా వుంటినికదా. ఆ వలపట ఎద్దుకు కురుపు ఏదో లేసింది.. యాపాకు పసురు పట్టించిన... తీరా పోటీలో ఏదైనా ఇబ్బంది పెడతాదేమోననిపిస్తాంది... అదే దిగులు..." రోంత బాధగా అంటి.

చిన్నాయన కూడా లేసి వలపట ఎద్దుకు లేసిన కురుపును, దానికి పట్టించిన పసురును తడిమి చూసినాడు.

ఆయన ముఖంలో ఏదో అనుమానం.

నన్నుచూసి ఆ భావాన్ని బయటపడనీకుండా "అదేం కాదులేరా... దాని గురించి ఏం ఆలోచించాకు..." అన్నాడు బీడి ముట్టించుకుంటా.

"పోతిరెడ్డిపల్లె కాన్నుంచి సదాశివారెడ్డిగాడి ఎద్దులు పోటీకి వస్తాయంటావా?" అని అడిగితి.

"అదే నేనూ ఆలోచన చేస్తాండ. ఆ కొడుకు పోటీ అంటే యాడ విడిచి పెడతాడు. ఆ ఎద్దుల పియ్య తీస్తేనా! మంచి రోషగాడు. రానీ... ఎంతకాలం పోటీకొస్తాడో... యాదో ఒకనాడు వేటకొడవలితో నరికి పారేస్తా..." అన్నాడు కోపంగా చిన్నాయన.

"ఊరుకో... మనకెందుకు... గెల్చుకుంటే గెల్సుకుంటాడు.. నరుక్కోడాలు... నాశన మవ్వడాలు... మనకేంటికి?" అంటి, సముదాయిస్తా.

అయిపోయిన బీడిని కాలికిందేసి తొక్కి ఆర్పినాడు చిన్నాయన.

"బయలుదేరుదామా.... చిన్నాయన ఒంటిమిట్టకు. మనం ఆటికి పోయేసరికి తెల్లారుతాంది" అని అంటి పైకి లేస్తా.

అట్నేలేమని తలూపినాడు.

నేను ఎద్దుల దగ్గరికి బయలుదేరితి.

***

ఒంటిమిట్ట....

కోదండరాముడు.. ఎత్తైన ఆలయం.. చూసేంత ఎత్తుగా.... యాడ సూసినా రంగు కాయితాలు కట్టినారు. సందడి సందడిగా ఉంది..

ఏకశిలపై సీతారాముల విగ్రహాలు చెక్కిన పీఠం గర్భగుడిలో ఉంది.. అందుకే దీన్ని ఏకశిలా నగరమని కూడా పిలుస్తారు.

ముదు ఎత్తైన గోపురాలకు హనుమంతుని బొమ్మతో వుండే కాషాయరంగు జెండాలు.. ముప్పై రెండు శిలాస్తంభాలకు చుట్టిన రంగురంగుల కాయితాలు... ఈ గుడి ఇప్పటిది కాదు. విజయనగర రాజుల కాలం నాటిది. పొత్తపి చోళులు కూడా దీనికి విశాలమైన ఆవరణనాన్ని కట్టించినారు.

ఇక్కడున్న మూలవిరాట్ 'రఘునాయకుడు – శ్రీరాముడి' విగ్రహాన్ని జాంబవంతుడు ప్రతిష్టించాడు. పెద్ద చెరువు పక్కనే ఉంది. పెన్నానది ఈ ప్రాంతానికి ప్రధాన నీటి ఆధారంగా వుంటోంది. దత్త మండలాలను పాలించిన వీర బుక్కభూపాలుని కుమారుడైన రెండవ హరిహరరాయలు రాజ్యపాలనలో ఇది

తీర్చిదిద్దబడింది. చెరువు కట్ట వెంబడి హనుమంతుడి జెండాలు రెపరెపలాడ తాండయి. నిజంగా అయితే రాముడి కళ్ళ దగ్గరే హనుమంతుడి బొమ్మ వుంటాది. కానీ ఒంటిమిట్టలోని కోదండరాముడి గుడిలో హనుమంతుడి విగ్రహమే కన్పించదు. మరి ఈ జెండాలేందో అనుకుంటి. అయినా జనం ఈ సంగతిని పట్టించుకునే స్థితిలో యాదుండారు... యాడ... అదో... ఆడ... అక్కడ... మైదానం కాడ! అవును... అడనే కదా... బండలాగుడు పోటీలు. యాడాడనుచో జనం పుట్ట పగిలొచ్చిన చీమల మాదిరి నిండిపోయి వుండారు. జనం... జనం... జన సముద్రం...

చెట్లమీద... గోడమీదకెక్కి చూస్తాండరు....

నేనూ... చిన్నాయన... ఇద్దరమూ ఎద్దుల్ని తోలుకొని మైదానం మధ్యలో చేరుకుంటిమి.

అన్ని ఎద్దులు వచ్చిండాయి.

ఔ... దాన్లలో వుండాయి పోతిరెడ్డపల్లె ఎద్దులు కూడా. పగ్గాలు పట్టుకొని వుండే సదాశివారెడ్డి కళ్ళు ఎగరేసి నవ్వినాడు నన్ను జూసి.

నేనూ కళ్ళు ఎగరేసి నవ్విత్తి.

మా చిన్నాయన రోంత కోపంగా వాడికేసి చూసినాడు.

వాడు ముఖం తిప్పుకున్నాడు.

తప్పెట్లు మోగుతాండాయి.

కొమ్ములు ఊదుతాండరు. చిందులేస్తాండరు.

జనం గోలగోలగా ఈలలు వేస్తాండరు.

రంగులు ఎదజల్లుకుంటాండరు.

ముందుగా నీలిపల్లెకు చెందిన వెంకట్రాముడి ఎద్దులు దిగినాయి బరిలోకి. దాన్లకు సగంలోనే బరువైంది. తర్వాత తిమ్మాపురం నాగిరెడ్డి ఎద్దులు రంగంలోకి దిగినాయి. అవి కూడా సగంలోనే ఆగిపోయినాయి.

జనం అల్లరి ఎక్కువైంది.

నాటు సారా తాగిన ఉప్పలపాడు వీరయ్య ఎద్దులు కలివిడిగా కొంతసేపు ఊపుపైన లాగడం మొదలెట్టినాయి గానీ మధ్యలోనే దాన్లకు మైకం కమ్మింది. నిల్చిపోయినాయి. ఆ తర్వాత యర్రగుంట్ల జయరాముడి ఎద్దులు లెస్సగా వుండి

పుంజుకున్నాయి. పుంజుకొని... పుంజుకొని.. సగం దూరంలో గింజుకోవడం మొదలెట్టినాయి. తర్వాత తాడిపత్రి రమణారెడ్డి ఎద్దులు సిద్ధమైనాయి. పద్దైదు నిమిషాల్లో నాలుగు చుట్లు చుట్టుకొని బరువై కూలిపోయినాయి. అట్నే రాజంపేట సుబ్రమ్మ ఎద్దులు గూడా ఐదో చుట్టుకారంలో చతికిల బడినాయి. ఒక మిగిలింది నా ఎద్దులు. తర్వాత పోతిరెడ్డి పల్లె సదాశిరెడ్డి ఎద్దులు.

జనం కేరింతలేస్తాందరు.

పలకలు మోగుతాండయి. దూరంగా జనమెక్కి వుంటే చెట్టొకటి కొమ్మ విరిగి పడింది.

నిర్వాహకులు పోయి సర్ది వచ్చినారు.

పోటీ మళ్లీ మొదలైంది.

పోతిరెడ్డిపల్లె ఎద్దులు రోసంతో ముందుకు దూకినాయి. సదాశివరెడ్డి మీసాలు దువ్వినాడు. పద్దైదు నిమిషాల్లో ఎన్ని చుట్ట చుట్టకొస్తారో అని అందరూ ఆసక్తిగా చూస్తాండరు. బండకట్టినారు...

'మొదటి చుట్టు'.... రంగంలోకి దిగిన ఎద్దులు పూర్తి చేసినాయి. జనం ఈలలే స్తాండరు. రంగులు జల్లుకుంటుండారు.

'రెండవ చుట్టు... మూడవ చుట్టు'... కూడా పూర్తి చేసినాయి.

తప్పెట్లు మోగుతాండయి.

సై... సై... సై... ఎద్దులు రై.... రై... రై... అంటూ బండను లాగేస్తాండయి. అదే ఊపుతో 'నాలుగు... ఐదు.. ఆరు.. ఏడు' చుట్లు ఇంగ ఒక్క అడుగు కూడా దాన్లకు ముందుకు పడలేదు. ఆడ్నే కుప్పకూలినాయి.

పద్దైదు నిమిషాల సమయమూ పూర్తయ్యింది. నాకైతే ఊపిరాడడం లేదు. చిన్నాయన దిక్కు జూస్తి.

నా భుజం తట్టినాడు ధైర్యంగా!

ఎద్దుల్ని తోలుకొని మధ్యలోకి పాయినాడు.

సదాశివుడ్ని భూజాలమీద కూర్చోబెట్టుకొని ఎగురుతాండరు వాళ్ళ ఊరి జనం.

రంగులు జల్లుకుంటూ వుండారు.

మా ఊరిజనం కేకలేస్తాండరు.

తప్పెట్లు మోగిపోతాండయి. ఎద్దులు మెడ విదిల్చినాయి. గంటలు మోగినాయి. అచ్చం ఆ కోదండరాముని గుళ్లో మోగి నట్లే!

రై... రై... రై...

సై... సై... సై... ఎద్దులు లాగుతాండయి.

నేను రాయి తీర్న చూస్తోండిపోతి.

ఎద్దులు... పందెంతో... రోసంతో... పౌరుషంతో... 'మొదటి... రెండవ.. మూడవ... నాల్గవ చుట్లు' చుట్టుకున్నాయి. 'ఐదవ... ఆరవ.. చుట్లు' జరిగేటప్పుడు జనంలో ఉత్సాహం మరింత ఎక్కువైంది. నరాలన్నీ బిగుసకపోయి... గొంతు చించుకొని అరుస్తాండరు. ఏడవ చుట్టులోకి... తిరిగినాయి ఎద్దులు.

సై... సై... సై.. రై... రై... రై... వలపట ఎద్దు కురుపు నుంచి నెత్తురు కారుతోంది... అట్నే తోలుతాండడు చిన్నాయన. 'దేవుడా... గెల్సాలా... రాములోరు సామీ... నా ఎద్దులు గెల్సాలా.. గెల్సాలా.. ఆ నీలకంఠం నా కొడుకు బాకీ తీర్చాలా... గెల్సు సామీ... గెల్సు... మనసంతా అదే దిగులు.

వలపట ఎద్దు అట్నే యీడుస్తానే వుంది. నెత్తురు కారుతాంది.

పద్దైదు నిమిషాలు అయితాంది. ఎద్దులు ఎనిమిదో చుట్టుకారం పూర్తి జేసినాయి. పలకల శబ్దం ఆకాశాన్ని అంటుతాంది. మా ఊరిజనం... మా చిన్నాయన్ను భుజాన ఎత్తుకొని చిందేస్తిమి.

రంగులు జల్లుకుంటిమి.

పోతిరెడ్డి పల్లె సదాశివారెడ్డి తలొంచుకొని ఆన్నుంచి ఎద్దులు తోలుకొని పోయినాడు. నూట పద్దైదు అడుగుల దూరాన్ని ఎనిమిది చుట్లు చుట్టి పద్దైదు నిమిషాలకు పూర్తి చేసిన మా ఎద్దులకు మొదటి బహుమతి ప్రకటించినారు నిర్వాహకులు.... నన్నుపోయి తీసుకోమన్నాడు చిన్నాయన.

చిన్నాయన వలపట ఎద్దుకు ఆకుపసరు కట్టుకోవడానికి గుడ్డను తయారు చేసుకున్నాడు.

నేను పోయి వాళ్ళిచ్చిన బంగారు గొలుసు, పదివేల నూటపదార్లు తీసుకొచ్చినాను.

మా ఊరిజనం సంబరంగా చిందులేస్తాండరు. వలపట ఎద్దుకు కట్ట కట్టడం పూర్తి అయింది.

మైకులో రెండవ బహుమతి కింద పోతిరెడ్డి పల్లె పదాశివారెడ్డిని పిలుస్తాండరు గానీ దాన్ని తీసుకోవడానికి ఎవరూరాలేదు.

మేము ఆ శ్రీరాములోరి దర్శనాన్నిమళ్ళా యింగోపారి చేసుకొని ఆన్నుంచి ఊరికి బయలు దేరినాము.

వలపట ఎద్దు కుంటుతా నడుస్తాంది. ఆకు పసురు అయితే కట్టినామే గానీ నెత్తు రైతే కారతానే వున్నింది చిన్నగా.

చిన్నాయన నాటుసారా తాగినాడు. తూగుతా తూగుతా నడుస్తాండడు.

మా ఊరిజనంతో పాటుగా సంతోషంగా అడుగులు పడుతున్నాయి. అమ్మ చెల్లెలు గుర్తొచ్చినప్పుడల్లా ఒళ్ళంతా పులకించి పోతాంది

***

సాయంకాలానికంతా ఊరుకి చేరుకుంటిమి.

అమ్మా, చెల్లెలు ఎదురొచ్చినారు.

బిందెలతో నీళ్లు దారెంబడి పారినాయి. ఊరి జనం నీళ్లతో స్వాగతం పలికినారు.

ఇంటికాడికి పోయినాంక పసుపు కుంకాలతో హారతిచ్చినారు.

బంగారు గొలుసు తీసి చెల్లెలి చేతికిచ్చాను. సంతోషపడింది. అమ్మ మురిసి పోయింది.

“బంగారు గొలుసు యియ్యడం కాదు... చెల్లెలికి బంగారమట్ట మొగుడ్ని జూసి ఆ మూడు ముళ్లు కూడా ఆ చేత్తోనే కానీ నాయనా....” చెప్పింది అమ్మ ప్రేమగా.

“అట్నే లేమ్మ... వస్తాండే సంక్రాంతి నాటికంతా బంగారమట్ట మొగుడ్ని వెతికి రాజవైభవంగా పెళ్లి చేస్తాగానీ..” అని జెప్పితి నవ్వుతా.

“ఎప్పుడూ మీకు నాపెళ్లి గురించేనా...” అంటూ చెల్లెలు లక్ష్మి యింట్లోకి సిగ్గుపడతా పరిగెత్తింది.

అమ్మా, నేనూ నవ్వుకుంటా వంటిమి. ఇంతలో ఆ పక్క వసరాలో పండుకొని వుండే చిన్నాయన...

“ఔ... పాపోడా... అమ్మి పెళ్ళి సంకురాత్రికంతా జరిగిపోవాలా... నా సామిరంగా.. పెళ్ళికి పలకలు మోగాలు... నాటు సారాయి పారాల... నేను జెగ్గినక తొక్కాల... బై.... బై.... ఐదు ఆడలా..” పండుకొనే ఎగుర్తాండడు తాగిన మైకంతో.

"ఔ... యింగా రోంత తాగి రావాల్సింది.... ఆ ఎగరడం జూడు" పండుకొనే ఎగుర్తాండడు తాగిన మైకంతో.

"ఔ... యింగా రోంత తాగి రావాల్సింది... ఆ ఎగరడం జూడు" – లోపల్నుంచే ఎగతాళిగా అంటాంది లక్ష్మి.

"నువ్వొక్కడివే ఎగుర్తావా ఏంది సిన్నాయనా... నేనూ జగ్గనక తొక్కనా.. ఏంది..." అని దండానికి ఆరేసిన తుండుగుడ్డ నెత్తికి తలపాగాలాగా చుట్టుకొని అడుగులు వేయడం ప్రారంభించితి. మాయమ్మ నన్ను జూసి ముసిముసిగా నవ్వుతాంది లోపల్నుంచి. లక్ష్మి కూడా వచ్చింది.

"సరిపోయినారు... ఇద్దరూ నువ్వు నడియింట్లో ఎగురుకుంటా... సిన్నాయన పండుకొనే ఎగురుతా..." అనింది. నేను ఎగరడం యింగరోంగ ఎక్కువ జేస్తి. అమ్మతో పాటూ లక్ష్మి నవ్వడం మొదలు పెట్టింది.

"ఎగిరింది చాలుగానీ... పొండి అన్నం తిందురుగానీ" అమ్మ లోగాయింట్లోకి నడిచింది.

నేనూ లోపలికి నడిస్తి.

"ఏరా.. పాపోడా... తినను పోతాండవ! ఆ ఎద్దులకింత గడ్డన్న వేసిపో..." అన్నాడు సిన్నాయన వసారాలోంచే.

ఔ.... మర్చిపోయిన. నెత్తి గీరుకుంటాగాటి దిక్కుకుపోతి.

ఎద్దులకు గడ్డి ఏసి, వలపట ఎద్దుకుయింగరోంత ఆకు పసురు పూస్తి కురుపుకు. ఎద్దులు బాగా అలిసిపోయివుండాయి. రెండు బిందెలు నీళ్లుపోసి... యింగ యింట్లోకి బయలుదేరితి.

పల్లెంలో అప్పుడే సంగతి పెట్టివుంది. అమ్మ. ఎర్రకారం, మొట్టికాయల కూరాకు జేసింది.

"ఈ కూరాకేందో కనుక్కోన్న... నేను జేసింది" అంటా చెంబుతో నీళ్ళు తెచ్చిపెట్టింది లక్ష్మి.

నెత్తిన ఒక మొట్టికాయ చేతి వేళ్ళు మడిచి టఫ్‌మని యిచ్చినా – సరదాగా!

'దీన్నేమంటారు తల్లీ!' అని అడుగుతా. నెత్తి రుద్దుకుంటా అమ్మ దగ్గరికి పోయింది లక్ష్మి. నాకు నవ్వు ఆగలేదు.

"బాగా కుదిరిందా?" – అని అనింది అమ్మ కూడా, నాతో నవ్వుకలుపుతూ.

“తల్లీ... కొడుకులిద్దరూ ఒక్కటే” – అనింది బుంగమూతి పెట్టి అమ్మా భుజంమీద తల పెట్టుకుంటూ లక్ష్మి.

బయట ఎవరో వచ్చిన శబ్దమైంది. వసారాలోని చిన్నాయన లేసి జూసినాడు.

“రేయ్... పాపోడా.. నీలకంఠమయ్య వచ్చినాడు...” అన్నాడు.

అట్నే చేయి కడుక్కోని బయటికి పోతి. ఔ... నీలకంఠం వచ్చివుండాడు.

నీలకంఠం....

పెద్దిరెడ్డి నడిపి కొడుకు...

మా నాయన అప్పుజేసింది పెద్దరెడ్డి కాడ. నిజానికి పెద్దిరెడ్డికి యిచ్చిన భూమంతా మాదే. ‘ఏంలేదు సామీ... అని కాళ్ళా వేళ్ళా బడితే మా నాయన ఇచ్చింది.

అవన్నీ మర్చిపోయి – అప్పుడెప్పుడో యిచ్చిన ఇరవైవేల కోసం తిరుగుతా వుండాడు. నిజానికి మా నాయన ఊరికే యిచ్చిన భూమి విలువే లక్షల్లో వుంటాది. పెద్దిరెడ్డికి నిజానికి మమ్మల్ని ఆ డబ్బు అడగడం ఇష్టంలేదు. అయినా ఆ ముసిలోడి మాటలు ఆ ఇంట్లో ఎవరింటారు?

ఆయనకింత సంగటి పెట్టడమే కష్టమైపోతాంది వాళ్లకి. పెద్దరెడ్డి సంపాదించిందంతా మూడు భాగాల లెఖ్కన వేసుకొని అన్నదమ్ములు ముగ్గరూ పంచుకున్నారు.

పెద్దోడు పిచ్చిరెడ్డి. అదో – సీతాపురం కాడుండే రేగడి పల్లెలో పెళ్ళి చేసుకున్నాడు. ఎప్పుడూ ఆ దిగువ కొండకాడకూర్చోని పేకాట ఆడుకుంటా వుంటాడు. తండ్రి యిచ్చింది అయిపోయింది. యింగ మామగారు ఇస్తాండేదే ఖర్చు పెటుట్కుంటా బతుకుతా వుండాడు. ఇద్దరు బిడ్డలు. ఇద్దరూ ఆడ బిడ్డలే. ఆ దిగులు యిప్పుడు యింగ రోంత ఎక్కువైంది. అందుకే మధ్యాహ్నమప్పుడు కూడా ఇంటికి పోకుండా పేకాడతాంటడు.

యిక మూడోవాడు – సుబ్బారెడ్డి. పాటూరు మండలంలో పెళ్లి జేసుకున్నాడు. మామ చచ్చిపోతే ఆ ఊరికే ఇల్లరికం పోయి ఆస్తి పాస్తుల తన పేరుమీదకు సరిజేసుకున్నాడు. మొన్ననే పొలం గట్టుపై నుంచి కాలు జారితే చికిత్సకోసం మళ్ళీ ఊరికొచ్చివుండాడు.

ఇదిగో యిప్పుడు మా ఇంటి ముందు నిలబడి నీలకంఠం. పెద్దిరెడ్డికి నడిపి కొడుకు. లేని అలవాటు లేదు. అందుకే ఎవరూ పిల్లను కూడా యివ్వడానికి

ముందుకు రావడం లేదు. పొలం పనులకు పోయిన ఆడోళ్ళ చేయి పుట్టుకొని చాలాసార్లు తిట్లు తిన్నోడు. అప్పుడెప్పుడొ పెద్దిరెడ్డి యిచ్చిన అప్పుల్ని వసూలు చేసుకొని తినడం యిప్పుడు చేసుకుంటున్నాడు.

ఇంట్లోకొచ్చి జేజులోని పదివేల నూటపదార్లు తీసుకొని పోయి నీలకంఠం చేతిలో పెట్టినాను.

లెక్క పెట్టుకున్నాడు. "నూటాపదార్లు వడ్డీ కింద వుండని ఇరవై వేలలో పదివేలు అందినట్లు. యింగ పదివేలు ఎపుడిస్తావ్!" అని అడిగినాడు తడబడుతూ.

వాడినోట్లోంచి సారా వాసన గుప్పు మంది.

"సంక్రాంతి కంతా యిస్తా!" చెప్పినాను.

"యిస్తాంలే... ఏమన్నా ఊరొదిలి పోతాండమా... ఏంది?" – వసారాలోంచి గట్టిగా అన్నాడు చిన్నాయన.

"తాగి వుండాడా..?" అని అడిగినాడు చిన్నగా నీలకంఠం – లోపలికి జూస్తూ.

'ఔ...' నని తల ఊపితి.

త్వరత్వరగా అడుగులేసుకుంటా అన్నుంచి వెళ్ళిపోయినాడు నీలకంఠం.

నేను నువ్వుకుంటా లోపలికి వస్తి.

"ఏమంటాడు... వాడు మెట్టు దెబ్బలేమైనా కావాలంటంన్నాడా... ఏంది" అని అడిగినాడు చిన్నాయన.

"నీకు తాగింది యిప్పుడే దిగదుగానీ రోంత కడుపుకు తిండి వేసుకొని మళ్ళీ పడుకుందువుగానీ సిన్నాయనా..." అని అంటి.

"నాకు ఆకలిగా లేదుగానీ నువ్వ తినుపోరా..." అని అన్నాడు మైకంతోనే

"రా చిన్నాయనా రోంత సంగటి తిని మళ్ళీ పండుకుందువు గానీ.." లోపల్నుంచి వచ్చి భుజం పట్టి పైకిలేపింది లక్ష్మి.

చిన్నాయనా లేచినట్లే లేచి మళ్ళీ పండుకున్నాడు.

సాధ్యం కాక లక్ష్మి లోపలికి వచ్చేసింది.

అమ్మ ఆలోచనలో పడ్డట్టుంది.

"సంక్రాంతి కంతా వాడికి పదివేలు ఎట్లిస్తావురా... నిదానంగా ఇస్తామని చెప్పి వుంటే ఏం?" – అని అడిగింది అమ్మ.

"ఎట్లోగొట్ట ఇస్తాలేమ్మా... అన్నీ అప్పుడే ఎందుకు ఆలోచిస్తావ్!" అంటి రోంత కోపంగా.

"నీ ఇష్టం వచ్చినట్లు జెయ్..." అనింది అమ్మ.

"యిప్పుడేమైంది... యివ్వలేకపోతే... మన దగ్గర వున్నప్పుడే యిస్తామని చెప్తాను" – అని అన్నాను.

"ఆ మాటే చెప్పివుండాల్సింది నాయనా" – అనింది అమ్మ నచ్చ చెప్తున్నట్లు

"పోండనీలేమ్మా... అయిపోయింది గానీ..." అని లక్ష్మి జోక్యం చేసుకుంది.

"అన్నా... చెల్లెల్లు ఇద్దరూ ఎట్లైనా చేస్కోండి... నాకెందుకు గానీ" – అనింది అమ్మ పెదవి విరుస్తూ!

"మాయన్న అనుకుంటే సాధిస్తాడు.... నువ్వేం దిగులు పడకులేమ్మా" – అనింది లక్ష్మి అమ్మ మెడచుట్టు చేతులు వేసుకుంటూ.

"వాడేం సాధిస్తాడో గానీ నన్ను మాత్రం బాగానే సాధిస్తున్నాడు..." అనింది అమ్మ వెటకారంగా నా వైపు చూస్తూ.

నాకు నవ్వు ఆగలేదు.

లక్ష్మి నవ్వడం మొదలు పెట్టింది. మా ఇద్దరి నవ్వు జూసి అమ్మకు నవ్వొచ్చింది.

బయట వసారాలోంచి సిన్నాయన....

"నేనూ సాధిస్తా చూడు... బై.... బై... ఐదు.. జెగ్గినక... జెగ్గినక.... జెగ్గనక... జెగ్గనక... పలక దరుపు పడాల.... పడాల పడాల..." అంటాండడు తాగిన మైకంలో

మా ముగ్గురికి నవ్వు ఆగలేదు.

## 5

**తె**ల్లారింది.

ఎవరిదో ఆడ గొంతు వినపడతాంది. లేచి జూసిన. అమ్మతో మాట్లాడతాంది – రాజమ్మవ్వ. ఆ యవ్వది పక్కనుండే పల్లె గువ్వల చెరువు. చాలా మంచిది మా కుటుంబమంటే ఎంతో ఇష్టం. తాత చంద్రన్న. ఓకప్పుడు బాగా బతికినోళ్ళు. అంతా పోగొట్టుకుని పాల వ్యాపారం చేసుకుంటా బతుక్కుంటా వుండారు.

చంద్రన్న తాత వయస్సులో వుండేటప్పుడు మంచి వేటగాడు. గువ్వల చెరువు కాన్నుంచి పాల కొండల్లోకి నాటుతుపాకి పట్టి వేటకు పోయేవాడు. మా నాయనకు మంచి స్నేహితుడు. అప్పుడ పుడు మా అయ్యను కూడా అడవుల్లోకి పిల్సుకుపోయే వాడు. కుందేలు. కంజులు, పిట్టలు, అడవి పావురాళ్ళు, దుప్పులు వేటలో కొట్టుకొచ్చి విందు చేసుకొని తినేటోళ్ళు. వాళ్ళ సంబరం అంతా ఇంతా వుండేది కాదు. చంద్రన్న తాత ఎప్పుడు వేటకెళ్ళిన మా ఇంటికింత కూరాకు పంపేటోళ్ళు.

ఓసారి పల్లెలోకి ఎలుగుబంటి వస్తాందని ఊరి జనం బయపడతావుంటే రాత్రికి రాత్రి పథకం వేసుకొని అడవిలో బయలుదేరి పోయినాడు చంద్రన్న తాత. తీరానడి అడివిలోకి పోయినాక ఎలుగుబంటే ఆయన వెంటపడింది. చేతిలోని నాటుతుపాకి యాడనో పడిపోయింది. యింగేం చేస్తాడు... దానితో పోరాడినకాటికి పోరాటి అడవికి అగ్గిపెట్టి పారేశాడు. ఎలుగుబంటి గోళ్ళు వేసిన గాట్లు యిప్పటికీ ఆయన శరీరం మీద వుండాయి. మేము పిల్లోళ్ళప్పుడు పోరాడింటే అయిన గాయలని చెప్పేవాడు. ఇప్పుడనుకుంటే నవ్వువస్తాది. వయస్సు అయిపోయినాంక రాజమ్మవ్వనే సంసారాన్ని నడపకస్తాంది. బిడ్డలు లేని కుటుంబం నాలుగు ఆవు లుండాయి. దాన్లనే బిడ్ల లెక్కన చూసుకుంటావుండారు.

"ఏం అవ్వ... బాగుండావా...?" అని అడిగినా, రాజమ్మవ్వను పలకరిస్తూ.

"ఏం బాగోలే నాయనా.... సందెకాడ రావాల్సిన ఆవులు కొండనుంచే రాలేదు.. ఏనుగుల దిబ్బకాడుంటే పీరమ్మ మండపం దగ్గర వుండాయంటాండరు... యింగ నువ్వు బోయి తోలుకురావాల్సిందే" – బాధ్యత అప్పగిస్తా చెప్పింది.

"అయితే తప్పిపోయిన ఆవులు ఏనుగుల దిబ్బ కాడుండే పీరమ్మ మండపం కాడ వుండాయంటావా... అవ్వా!" – అని అడిగితి మంచం గుంజకు తగిలించిన చొక్కా తొడుక్కుంటా.

"ఔ... నాయనా... పొద్దు వస్తాంది... యింగైనా లేసి బయలుదేరు..." చెప్పింది ఆత్రంగా రాజమ్మవ్వ.

"నాకు ఏదైనా ప్రయోజనం వుండాల కదా!" అడిగితి కళ్ళు ఎగరేస్తూ.

"ప్రయోజనం ఏముంది.... మాకు ఏమైనా పిల్లాజల్లా... వున్నిందంతా మీకిచ్చి పోయేటోళ్లమే... ఆ ఆవులు కూడా నీకు కావాలంటే తెచ్చుకో... వద్దను కుంటే పండుకో మంచంలోనే" అనింది రాజమ్మవ్వ ఎగతాళిగా.

"భలే... చెప్పినావు లేవ్వా, పొద్దున్నే" అని అంటి నవ్వుకుంటా.

"రేయ్... త్వరగా పోయిరాపో.. ఆవులు ఆడన్న వుండాయో లేదో..." అనింది అమ్మ ఆదేశిస్తున్నట్లుగా.

ఏనుగుల దిబ్బ వైపుకు బయలుదేరితి. ఇసుకపల్లి దాటినాక ఆ ఏటిగడ్డన మేకలు కాసుకునే ఆంజనేయులు కనపడినాడు. దగ్గరికి పోయి కూర్చోని ఆవుల విషయం అడిగితి. "ఔ... పీరమ్మ మండపంకాడ వుండాయి" అని చెప్పినాడు – గొడ్డలి నూరుకుంటా!

ఆ గొడ్డలి అప్పటికే ఎంతో పదునుగా వుంది. దాన్ని యింగా పదును పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చిందో అడగాలనిపించింది. 'ఇంకా పదును పెడితే గొడ్డలి అరిగిపోయి పిడి మాత్రం మిగులుతాది' – అని అంటి ఎక్కిరిస్తూ.

"సరేలే... ఇదేం పదును... వాళ్ల గొడ్డళ్ళు చూస్తే యింకేమంటావో..." అని అన్నాడు ఆంజనేయులు.

"వాళ్లవంటే ఎవరివి?" అడిగితి తెలుసు కోవాలనే ఆత్రంతో.

"ముందు ఆవులకాడికి పోయి రాపో... తర్వాత చెప్తాను" అన్నాడు వాడు.

"చెప్పురా... సామీ..." అని బతిమాలినట్లు మళ్లీ అడిగినాను.

"పాలకొండల్లో ఎర్రచందనం సెట్లు, అదే... ఎర్ర కొయ్య లేదూ ఆ మాన్లు కొడితే మానుకు ఐదొందలు ఇస్తారు. ఇప్పుడు మనూర్లో కూలోళ్ళందరూ ఇదే చేస్తాండరు..." చిన్నగా చెప్పినాడు వాడు.

"నిజంగానా!" అడిగితి ఉత్సాహంగా.

"అమ్మ తోడు... సత్యం చెప్తాండ.. మాను నరికితే ఐదొందలు నీ జెబులో పడినట్లే... చేసుకునేటోడికి చేసుకునేంత" ఈసారి రోంత గట్టిగానే చెప్పినాడు వాడు.

"నేనూ... రావచ్చా!" – అడిగినాను.

"ఎందుకు రాకూడదు... నీ గొడ్డలి నువ్వు తెచ్చుకో... మాను కొట్టేది కష్టమైతే చెప్పు... దుంగల్ని సంచిలో పెట్టిస్తారు. రాయచోటికాన్నుంచి మదనపల్లెకు ఆన్నుంచి మదరాసోళ్లకు అందజేస్తే నీకు వేలల్లో లెక్క అందుతాది" – చెప్పినాడు ఆంజనేయులు బ్రహ్మరహస్యం.

నిజంగా ఆ క్షణం ఆంజనేయులు దేవుని లేక్కనే కన్పించినాడు. "పనిలోకి పిల్సుక పోతావా?" – అని అడిగితి.

"నువ్వు రావాల్నే గానీ ఈ రేత్తిరికే పిల్సుకపోతా" అని జెప్పినాడు.

"మాటికంతా మంచి గొడ్డలి తీసుకొని గువ్వల చెరువు కాడికి వస్తే ఆడుండే మోరీకాడ నేనుంటా. నిన్ను పన్లోకి పిల్సుకపోతాను" నాకు హామీ కూడా ఇచ్చినాడు వాడు.

ఆంజనేయులు ఇచ్చిన ఆనందంతో త్వర త్వరగా చిలమకూరు జేరుకొని ఆడ కొంతసేపు విశ్రాంతి తీసుకొని ఏనుగుల దిబ్బ ఎక్కితి. ఆడుండే 'పీరమ్మ మండపం' దగ్గరే నాలుగు ఆవులు దిగదాలగడ్డి మేస్తా వుండాయి.

దిగదాల... అదో పాత చెరువు నేలంతా తడితడిగా వుండాది. గడ్డి పచ్చగా మనిషెత్తు పెరిగి వుండాది. ఆవులు మేసేంత వుండాది మేత. అందుకే ఇవి ఆన్నుంచి యిక్కడికి వచ్చేసింది. నేను కూడా మూడు మోపుల గడ్డి కోసి ఒక్కో మోపు ఒక్కో ఆవుకు కట్టుకొని, ఇంకో మోపు నెత్తికి ఎత్తుకొని ఆన్నుంచి బయలు దేరినాను.

వచ్చేటప్పుడు ఇసుకపల్లె కాడ ఆంజనేయులు కోసం చూసినాను.

వాడు కన్పించలేదు.

నేను త్వరత్వరగా ఇంటిదారి పట్టినాను.

ఆవుల్ని చూడగానే రాజమ్మవ్వ సంతోష పడింది.

"మా నాయనే... ఎండకొస్తివి కదా కొడుకా..." అంటా గడ్డిమోపు దించుకొని పైటతో నుదుటి చమట తుడిసింది.

నాకైతే ఎప్పుడెప్పుడు రాత్రి అవుతుందా పనిలోకి జేరి మాను నరికి ఐదొందలు సంపాదించాలా... అనే వుండాది.

సంక్రాంతికంతా ఆ నీలకంఠానికి యివ్వాల్సిన పదివేలు వాడి ముఖానా కొట్టాల.

అమ్మకిచ్చిన మాట ప్రకారం చెల్లెలు లక్ష్మి పెళ్లి రంగరంగ వైభవంగా చేయాలి.

ఇట్లా ఆలోచనల్లో వుండగానే వర్షాల కోసం ఏట్లో కప్పదేవర చేయాలని రచ్చ బండ కాడ తీర్మానించినట్లు తెలిసింది. ఊర్లోని పెద్దోళ్ళంతా మధ్యాహ్నా వేళకంతా కప్పదేవర చేయడానికి సిద్ధమైపోయినారు.

***

"వానదేవా ఓ వానదేవా

కప్పుమ్మ నీళ్ళాడే కాలమెండిపాయె వానదేవా ఓ వానదేవా ఇగనన్న కురిపించు జగమేలు ఓ తండ్రి వానదేవా ఓ వాన దేవా...." అని పాటలు పాడు కుంటా పెద్దమ్మవ్వ మా ఇంటికాడికి వచ్చింది. మా అమ్మ, రాజమ్మవ్వ, లక్ష్మి అందరూ రచ్చ బండ కాడికి బయలుదేరిపోయినారు. ఇది ఆడోళ్ళు చేసే ఉత్సవం కాబట్టి నేను దూరంగా నిలబడి చూస్తు వుంటి. ఊర్లోని ఆడోళ్ళందరూ రచ్చబండ కాడికి వచ్చినారు. ఉత్సవానికి ఏర్పాట్లు మొదలై నాయి

ఒక గోండ్రు కప్పను తెచ్చినారు. ఇది ఎరిగెరిరి పడతాంది. అయినా దాన్ని బల వంతంగా దారంతో కట్టేసినారు. దానికి పసుపు పూసినారు. కుంకుమ జల్లినారు. పసుపులద్దిన గుడ్డలో చెట్టి, పొడవాటి రోకలికి నడుమన కట్టినారు. అదేమో లోపల తనకలాడతాంది. మొత్తుకుంటాంది. రోకలిని అటువైపు కొందరు, ఇటువైపు కొందరు పట్టుకొని మోసుకుంటా ఇలిల్లూ బయలుదేరినారు.

"పన్నెండు పరగణాలు వానదేవుడా

పంటల్లు పండాలి వానదేవుడా

పన్నెండు ధాన్యాలు వానదేవుడా

పంట చేలు పండాలి వానదేవుడా

మా కడుపు నిండాలి వానదేవుడా

పేదసాద బతకాలి వానదేవుడా

చేటంత మబ్బు పట్టి వానదేవుడా

చెరువంత నిండాలి వానదేవుడా

తూరుపున మొయిలేసి వానదేవుడా

తుళ్ళి తుళ్ళి కురవాలి వానదేవుడా

మూడు రోజుల యెండ వానదేవుడా

ముప్పై రోజుల ముసురు వానదేవుడా..." పాడతాంది పెద్దమమ్మ.

మసురు... యాడుంది.... యా పక్క కమ్ముకుంది...

ఏది... సినుకు ఏది... సుక్కన్న ముక్కన్న.... యాడుంది...

రవ్వంతైనా ముసురు కునింది యాడుంది...

మోడం మోసం నా కొడుకుది.... ఊరిస్తాది....

ఊగిస్తాది... ఉపాయం పన్ని ఉరుముకుంటాది...

మెరుపు తీర్న మెరిసి కురిపించినట్లు జడిపిస్తాది...

గబ్బు మోడం... గబ్బు మోడం... ఉండే టట్లే వుంటాది.

ముసురు ముసుగులో ఉరితాడు అవుతాది...

ముసురు... కమ్ముకోదు...

ఈ నేల మీద ముసురు కాదు... ఉసురు....

అవును ఉసురే... తీస్కో వానదేవడా... మా ఉసురు పోస్కో... మట్టితో ఎగజల్లుకో... తగిలిచ్చుకో... థూ<...!

నీ పాడె మీద పోసుకో.... ముసురు... ఉసురు వానదేవుడా... యాడుండావు సామీ... కాస్త ఉచ్చున్నా పోయ్యి... ఖ్యాకరిచ్చి ఇంత ఎంగిలన్నా యెయ్యి... సామీ!

ఆకాశంలోని అన్ని మోడాలు కుర్సలేవు. కొన్ని ఒట్టి కడుపుతో కొట్టుక పోతాంటయి. ఇంకొన్ని బంకమన్ను తీర్న అతక్క పోయింటాయి. కొన్నిన ఆన్నాన్నే తనకలాడ తాంటయి. అయినా ఏ మోడం నీడా నేల మీద పడదు.... సాలెగూళ్లలో చిక్కుకున్న పురుగుల మాదిరి నీడలన్నీ పెనగలాడ తాంటయి...

కప్పదేవర... దేవర సాగిపోతాంది... పెద్దమ్మవ్వ పాటలమీద పాటలెత్తుకొని పూనకం వచ్చి ఊగిపోతాంది... కప్పకావడి ఇంటింటికి తిరుగుతాంది... అందరూ ఎవరికి తోచిన కాడికి వారు గింజలు వేస్తాండరు జోలెలో.

సగందావలో రాజమ్మవ్వ ఎత్తుకొంది పాట...

"వానదేవుడా... వయ్యారి దేవుడా...

నీకు సిగ్గన్న లేదేమీ వానదేవుడా..

సిన్న సినుకన్న కుర్సవేమీ వానదేవుడా...

నువ్వెట్ట దేవుడైతివి వానదేవుడా...

మా కప్పమ్మ బాధనన్న సూడు దేవుడా...

మా కన్నీళ్లు తుడ్సవయ్య వానదేవుడా...

మాపంటల్ని పండనివ్వు వానదేవుడా...

మాబతుకుల్ని నిండనివ్వు వాన దేవుడా..."

ఆ అవ్వతో పాటుగా అందరూ అదే ఎత్తుకున్నారు.

ఇంటింటికి తిరిగి తిరుపమెత్తిన గింజలన్నీ పరమాన్నం చేసి చెరువుకాడికి వచ్చినారు. అక్కడ గట్టుమీద వానదేవుడికి నైవేద్యం పెట్టినారు. ఇంగ ఆటికి కూడా కప్పదేవర అయిపోలేదు. మోసుకొచ్చిన కప్ప కావడిలోని పసుపు గుడ్డను విప్పినారు. దాంట్లోని గొంద్ర కప్పను నీళ్లు లేని చెరువులోకి విడిచి పెట్టిన్నారు. దాని చుట్టూ గుంపుగా చుట్టుకున్నారు. నోటికొచ్చిన మాటలన్నీ పాటలుగా జేసుకొని తప్పట్లు తట్టుకుంటా –'లబలబమని' నోరు కొట్టూకుంటూ కేరింతలు కొడతాండరు ఆడోళ్లంతా. ఇదంతా నేనూ దూరం నుంచి చూస్తూ ఉండాను. కానీ నామనస్సంతా రాత్రి పాలకొండల్లో ఎర్రకొయ్య కొట్టడానికే ఉవ్విళ్లూరుతాంది.

చెరువుల్లో నీళ్లు ఎండిపోయినప్పుడు వర్షాలు పడనప్పుడు, నీళ్లులేని పరిస్థితులు ఏర్పడినప్పుడు కప్పకావిడి కట్టి కప్పదేవర చేస్తే వర్షాలు కురుస్తాయనేది ఒక నమ్మకం. ఆ నమ్మకంతోనే వీళ్లు ఇదంతా చేశారు.

ఆశ....

ఒకే ఒక్క ఆశ....

చినుకు కుర్సకపోతుందా అనే ఆశ....

చిరుగింజైనా మొలవకపోతుందా అన ఆశ....

బతుకులు బాగుపడకపోతాయా అనే

ఆకాశంకింద మనం వున్నామనే ఆశ...

మన కన్నీళ్లకు నీళ్లు కురుస్తాయనే ఆశ....

ఊర్లకు ఊర్లు రైతుల శ్వాస...

ఎవరికి తెలుసు మబ్బుల భాష...

కప్ప కావడి ఆశ... కప్ప దేవర ఆశ...

చివరికంతా నిరాశ...

మబ్బులు కమ్ముకోలేదు.

మోడాలు విచ్చుకోలేదు.

మోరుపులూ అల్లుకోలేదు.

ఉరుములు ఉడికించలేదు.

చినుకులూ కుర్సలేదు.

మొలకలూ మొలవలేదు.

ఏంలేదు... ఆశంతా నిరాశ

ఇంత కప్పదేవర జరిగినా వానలు పడలేదు. అందరూ దిగాలు పడ్డారు.

నేను పదునైన గొడ్డలి భుజాన వేసుకొని గువ్వల చెరువు వైపుకు అడుగు వేయడం మొదలు పెట్టాను.

# 6

**చీ**కటి దారి పట్టాను.

నడక సాగిపోతోంది. ఆకాశంలోని చుక్కలు మెరిసిపోతాండయి. కొండదారికి దగ్గరయ్యేకొద్దీ ఈదురుగాలి ఎక్కువైంది. కాలిబాట గుండా యింగరోంత వేగం పెంచి మోరి కాడికిపోతి. ఆడ్నే గొంతు కింద చేతులు పెట్టుకొని నా కోసం ఎదురుచూస్తా వుండాడు ఆంజనేయులు.

“గొడ్డలి తెచ్చుకున్నావా?” – అడిగినాడు వాడు. భుజానవుండే ఆయుధం జాపిస్తి – “పద... యిట్నే బిరబిర పైకెక్కి పోదాం.” అని పాలకొండల్లోకి గువ్వల చెరువు మీదుగా దారి పట్టినాడు.

నేనూ వాడి వెనకాలే నడుస్తాండ. వాడు అప్పుడప్పుడూ – బద్రం అనో, జాగ్రత్తనో, చూస్కోని ఎక్కు అనో అంటానే వుండాడు.

నేను నా పాటికి కొండ ఎక్కుతానే ఉండాను. రెండు గంటలు అట్నే పై కెక్కిన తర్వాత గొడ్డళ్ళ మాన్లను నరుకుతాండే శబ్దం వినపడసాగింది. కంపసెట్లు, ముళ్ళ పొదలు కాళ్ళకు గీసుకపోయాయి. అట్నే అడ్డం ఎక్కినాం. పైన నలుగురు ఎర్ర కొయ్య సెట్లు కొడతాండరు. ఆంజనేయుల్ని చూసి నవ్వినారు. నా దిక్కు అనుమానంగా జూసినారు. నాకు రోంత భయ వేసింది.

అయినా నా చేతిలోనూ గొడ్డలి వుంది కదా! వాళ్ళు కొట్టే సెట్ల పని ఆపి మా దగ్గరికి వచ్చినారు.

అందరం ఆడనే విశాలంగా వుండే బండ మీద కూర్చోంటిమి.

చల్లగాలి పెడతాంది. “ఒక మంచి సైజు ఎర్రకొయ్య కొడితే నీకు ఐదొందలు వస్తాది. ఎర్రకొయ్య అంత సులభంగా ఏమీ తెగదు. నీలాంటి మంచి యువ్వనంలో వుండే పిల్లాడు బాగా పనిజేసి కొడితే రెండు రోజులకు ఒక మాను చేసుకోవచ్చు

నికిష్టమైతే మాతో చేరు. లేకుంటే మానై. బయట యాడా మా గురించి చెప్పకు" – అన్నాడు ముఖానికి చేతి రుమాలు కట్టుకున్న మొదటి వ్యక్తి. మిగతా ముగ్గురు ఏమీ మాట్లాడలేదు గానీ ముఖానికి చేతి రుమాల కట్టుకునే వుండారు. ఆంజనేయులు నావైపు చూసినాడు – నా సమాధానం ఏమిటన్నట్లు. నేను గొడ్డలి తీసుకొని పైకి లేస్తి. నాతో పాటూ అందరూ లేసినారు. మా మధ్యయిక మాటల్లేవు. అడవంతా గొడ్డళ్ళశబ్దమే విన్పిస్తోంది. హే.... హే... హే...హే... దెబ్బమీద దెబ్బ సన్నని ఎర్రని కొయ్య ముక్కలు ఎరిరెగిరి పడతాండయి. రెండు, మూడు గంటలు ఆగకుండా కొట్టేసిరికి పిడికిళ్ళు బిగుసుకపోయాయి. రెక్కలు ముక్కలయ్యాయి. చేతి వేళ్ళు తీయడానికి కూడా రావడం లేదు. గస... గస... గస.. ఎగదోస్తాంది... గుండెల్లో! కండలు కరుగుతాయి. సగం మానుకొట్టడం పూర్తయ్యింది. యిక ఈ రోజుకు లాభం లేదు. గొడ్డలి పైకెత్తడానికి కూడా ఓపిక లేదు.

శరీరం సహకరించడం లేదు.

"అలవాటు లేని పనికదా. మొదట్లో రోంత కష్టంగానే వుంటాది. చెయ్యంగ చెయ్యంగ గొడ్డలి సేతికొస్తాది. పని అలవాటైతాది. అంతదాక గస ఎక్కువే వుంటాది" – చెప్పకస్తాండడు ఆంజనేయులు.

నాలో కసి పెరిగిపోతాంది.

అందరి సేతుల్లోని గొడ్డళ్ళు పని చేసుకొని పోతాండయి.

నేనేమో ఊరికే కూర్చిని చూస్తుండాను.

నిన్నటి నుచి కొడతాండే ఆంజనేయులు గాడి చెట్టు పూర్తయ్యింది.

ఎర్రకొయ్య ముక్కలు ఎనిమిది భాగాలు చేసినాడు.

నాకు చిర్రెత్తుకొచ్చింది.

ఆడుండే పెద్దబండని నేను యింతసేపు కొట్టిన సగం పూర్తయ్యిన ఎర్రకొయ్య చెట్టు పైకి దొర్లించినాను.

ఆ రాయి దొర్లుకుంటా పోతాంది...

పోతాంది... పోతాంది... వేగం పుంజుకుంది...

అట్నే... ఆ పక్కకే... ఎర్రకొయ్య మాను దిక్కుకే... పొతాంది... పొతాంది....

సరిగ్గా సగంలో నేను వదిలేసి వచ్చినచోట తగిలింది.

తగిలిన మరుక్షణం పెద్దశబ్దం చేసుకుంటా భళ్ళున మాను రెండు ముక్కలై కొండ కిందకి జారిపోయింది.

నాలో ఎందుకో కసి.

'బాగుంది... మిగతా సగం కొట్టే పని లేకుండా విరిగిపోయిందనుకున్నా మేమో... ఒక్కోసారి మాను మధ్యలోకి చీలిపోయే ప్రమాదం కూడా వుంది. అప్పుడు ఆ కొయ్య ఎందుకూ పనికిరాదు. తెలుసా?" – నిదానంగానే చెప్పాడు మొదటి వ్యక్తి.

నేను త్వరత్వరగా కిందకెళ్ళి మానుజూస్తి. సరిగ్గా సగానికే విరిగివుంది. హమ్మయ్య! అనిపించింది. అదే నిలువుగా చీలిపోయివుంటే యింతసేపు పడిన శ్రమ వృథా అయ్యేది.

చేతిలోని గొడ్డలి మరోసారి పైకి లేచింది ఆనందంతో.

మరో గంటలో విరిగిపడిన మామ పదిదుంగలుగా తయారైంది.

"డబ్బులు ఇప్పుడే కావాలా?" అడిగాడు మొదటి వ్యక్తి.

ఔనన్నట్లు తల ఆడించాను.

"మరి నీకూ..." అడిగాడు ఆ వ్యక్తే ఆంజనేయులు వైపు చూస్తూ.

ఔనన్నట్లు వాడూ తల ఆడించాడు.

ఇద్దరికి చెరి ఐదొందలు చేతిలోకి వచ్చాయి.

యింగ ఆన్నుంచి బయలుదేరాం. మళ్ళీ రేపు రాత్రి వస్తాం అని చెప్పి!

గువ్వల చెరువు మోరీ కాడికి వస్తానే ఎదురుగా వచ్చింది రాజమ్మవ్వ ఆవుల్ని తోలుకుంటా. వాళ్ళ ఊరు అదేకదా!

నాకు కాళ్ళూ చేతూలు ఆడలేదు.

ఏం చెప్పాలో తెలియలేదు.

మాటలు తడబడతావుండాయి.

సేతిలోని గొడ్డలి పక్కనుండే పొదలోకి విసిరేసినాను. ఆంజనేయులు నా దిక్కు భయంభయంగా చూస్తాండడు.

"ఏం నాయనా పాపోడా... ఈడవుండావు? ఏంటికొచ్చినావు? ఎప్పుడొచ్చినావు?"

ఆయవ్వ ప్రశలడుగుతానే వుంది.

నాకేం జవాబులు చెప్పాలో అర్థం కావడంలేదు.

ఆయవ్వ కళ్ళలోకి కూడా చూల్లేక ముఖం కిందకి దించేసుకుంటి.

"నువ్వు మాట్లాడరా" అంటి ఆంజనేయులు గాడి పిర్రను గిచ్చి

"ఆఁ... కు కు... కు... కుందేలు కోసం వచ్చినాం లేవ్వా..." అన్నాడు వాడు తడబడే మాటలతో వణికే కాళ్ళతో.

"ఓరి... నాయాల... కుందేలు కోసమా... ఆ మాట చెప్పివుంటే మీ చంద్రన్న తాతను కూడా వేటకు పంపిందు కదా!" అనింది ఆయవ్వ సంబరంగా.

ఆయవ్వ నవ్వుతాంటే నాకు నరాలు తెగి పోతాండేటట్లుంది.

"పాండి... యింగ ఈడనే కదూ మనిల్లు. యింత సంగటి తిని పోదురు గానీ" అనింది.

అవ్వ వెనకాలే బయలుదేరితిమి.

చంద్రన్న తాత నులకమంచం మీద కూర్చోని వుండాడు.

నన్ను చూస్తానే లేచి కౌగిలించుకున్నాడు.

"ఏరా... అబ్బీ... బాగుండావురా? నిన్న మీ అవ్వ వచ్చింటే నువ్వు ఈ రోజు వస్తాండవా? రా కూకో..." అని నులకమంచం పైన కంబళి పర్సినాడు.

"అబ్బి...కుందేలు వేటకొచ్చినాడంట"– చెప్పింది ముసిల్ది.

"వీడికి అన్నీ నా బుద్దులే... తాత పేరు నిలబెట్టురా పాపోడా..." అన్నాడు మీసం దువ్వుకుంటా చంద్రన్న తాత.

అడవిలో దిన్నం వేటకుపోయే ఈరన్న మామ దగ్గరికి పోయి కుందేలు యిప్పించు కొచ్చింది అవ్వ.

"యిప్పుడేంటికి లేవ్వా... ఇంటికి పోవాలగానీ' అని అంటి.

"పోదువులేరా.. అబ్బీ... నీ కోసమే కదా ముసిల్ది అడవి కుందేలు యిప్పి చ్చుకొచ్చింది" – అన్నాడు తాత.

మధ్యాహ్నం సంగటి, కుందేలు కూరాకు చేసింది అవ్వ.

ఆడనే తిని బయలుదేరినాం.

యాడజూసినా పంట పొలాలన్నీ ఎండిపోయి వుండాయి. నల్లరేగడి నేల కరువు కోరల్లో పడి సుక్క నీళ్ళు కూడా లేకుండా తడారిపోయి.... తడారిపోయి... ఎడారైపోతాంది!

***

"తాధిమి తకధిమి తోల్బొమ్మ... దీని తమాస సూడవె కీల్బొమ్మా...

దీని తమాస సూడవె మాయ బొమ్మ ఆటమ్మా పాటమ్మా

జగమంతా బొమ్మ లాటమ్మా తలాంగు తకధిమి తోల్బొమ్మా

తోం తకతై తకతై మాయబొమ్మ" –

చేతిలోని గుడ్డ బొమ్మతో లక్ష్మి "ఊర్లోని చిన్న పిల్లోళ్ళందర్ని కూర్చోబెట్టుకుని తమాషా ఏందో చేస్తాంది. ఇరుగు – పొరుగు నుండే అమ్మలక్కలంతా చుట్టూజేరి నవ్వుకుంటా వుండారు. 'బంగారు పాప కత చెప్పక్క' అడుగుతాండరు పిల్లలు.

నన్ను చూడగానే లక్ష్మి ముఖం తిప్పుకుంది.

"అదిగో వచ్చాడు రాక్షసుడు. వాడి భరతం పట్టాలి. మనమిప్పుడు.." అంటూ గుడ్డ బొమ్మతో నాపై దాడి కొచ్చింది లక్ష్మి.

అమ్మ నన్ను తిట్టడం మొదలు పెట్టింది. రాత్రంతా చెప్పా పెట్టాకుండా వెళ్ళిపోయినందుకు ఇద్దరికీ కోపం. అర్థమైంది.

చూద్దును కదా ఆంజనేయులు నా పక్కన లేడు. దార్లో మధ్యలోనే పారి పోయాడు. ఇదంతా చూస్తూ ఆమె కూడా నవ్వుతాంది. ఆమె.. ఆమె.. ఆమె... అమ్మ పక్కనే కూర్చోని వుంది.

ఆమెను గురించి సంగతులేవీ తెలీవు.

అయితే ఆమె గొంతు పరిచయం.

ఆమె... కాంచన.

ఒక బిడ్డ, మొగుడ్ని వదిలేసి వచ్చిందని అంటారు. చూస్తే అలాంటి రకం మనిషికాదని మాత్రం అర్థమవుతాది.

నిజంగానే ఆమె గొంతు కాంచనమే బంగారాన్ని రాగంతో.. సర్వంతో జతచేసి పల్లవింపజేస్తే ఆమె పాటవుతుంది అంతటి మహత్తు దాగుండేది ఆమె వెన్నెల పాటల్లో.

ప్రొద్దున్నంతా పొలం పనికి పోతాది. బిడ్డను విడిచి క్షణమైనా వుండేది కాదు. వేదాల్ని, చరిత్ర పుస్తకాల్ని బాగా తెలుసుకున్న మనిషి.

తన గురించిన వివరాలు కూడా ఎవరికీ చెప్పుకోదు. ఆమె పరిచయం అయినాక మరింత లోకం దగ్గరైంది నాకు. ఆమె సన్నిధిలో మనిషితనం తెలిసివచ్చేది. మానవత్వం గుండెల నిండా వుండేది. పండేది. ఆమె... కాంచన... కాంచన... వెన్నెల పాటల కెరటం... కాంచన...!

# 7

ప్రతిరాజూ

సాయం సంధ్య వేళ

పసిపిల్లను నిద్ర పుచ్చడానికి పుయ్యాల ఊపే తల్లిపాట వేపచెట్టు నుంచి వీచే చల్లటి గాలితో పాటూ నన్ను తాకుతుంది. పాత గాయాల్ని... జ్ఞాపకాల్ని తట్టి లేపుతుంది. ఆ రాగం... ఆ పాట... ఒక లయబద్ధమైన స్వరమై... ఆ పాట... ఒక లయబద్ధమైన స్వరమై... బాల్యానికి వరమై... ఒకచోట సన్నగా... మరోసారి గట్టిగా... మాటల పదాలన్నీ పాటరూపమై ఆమె నోటి నుంచి... కీచుగొంతు నుంచి కీకారణ్య జీవితాన్ని ఛేదించే లేలేత పాదాల అడుగుల తడి తపనల్ని గుర్తు చేస్తుంది... ఈ ఊరి చివర్నుంచి ఆ మొదలు వరకూ అందర్ని ఒకేసారి నిద్ర పుచ్చడానికి ఆమె పూనుకుందేమో అనిపించేది. ఆకాశం కూడా ఆమె పాటకు నేలపైకి దిగి వచ్చేది. నక్షత్రాలదారుల్లో వెండి మబ్బుల సవ్వడి విన్పించేది. ఆమె పాట శోకమో – శ్లోకమో అర్థమయ్యేది కాదు!

కానీ... ఆమె రాగం జీవితాన్ని ధ్వనించేది!

ఆమె పాట ప్రార్థనలా వుండేది. ఒక్కోసారి ఆ పాట ప్రళయంలా వుండేది

ఆమె వెన్నెల పాట విన్న ప్రతిసారీ మంచు కురిసినట్లో... మంటలు రేగినట్లో అర్థం కాని స్థితిలోకి నెట్టేసేది.

ఆమెను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు గుండె బరువెక్కేది.

ఆ రోజు ఎప్పటిలాగా ఆమె అందుకున్న ఒకానొక పాత వెన్నెలపాట వింటుండాను. "రాళ్ళు మాట్లాడే వేళ..." అని అందుకుంది. పాట సాగిపోతాంది ఒక ప్రవాహంలా! ఆగలేదు. నదుల్ని... దాటుకుంటూ సుడిగాలిలా సాగుతోంది. ఆమె పాటంతా అయిన తర్వాత తీరిగ్గా అడిగాను... 'నిజంగా... తర్వాత తీరిగ్గా అడిగాను... 'నిజంగా.. రాళ్ళు మాట్లాడే వేళ ఉందా?' అని. 'వుందని' – తల ఊపింది.

'ఎపుడు?' – ఆశ్చర్యంగా అడిగాను.

'నడిరాత్రి శూన్య ఘడియల్లో రాళ్ళు మాట్లాడుకుంటాయి. పాటలు పాడుకుంటాయి. ఏడుస్తాయి. మొత్తుకుంటాయి. రాయి జన్మనుంచి విముక్తం చేయాలని ఆ పరమాత్ముణ్ని ప్రార్థిస్తాయి. అప్పుడు రాళ్లకు బరువుండదు. పత్తి

సెందు తీర్న మెత్తగా వుంటాయి. అప్పుడే రాళ్లను యాటికైనా మార్చుకోవచ్చు. ఎంత ఎత్తుకైనా తీసుకపోవచ్చు..” చెప్తాంది – ఆమె గంభీరంగా!

ఆశ్చర్యపోయాను.

“నిజమా?” – మళ్లీ రెట్టించి అడిగాను.

“నిజమే” – చెప్పింది మరింత స్థిరంగా!

“అయితే రాళ్లగుట్ట ఎక్కి పరీక్షగా చూద్దామా?” అడిగితి.

“నీకు నమ్మకం లేకుంటే నడిరాత్రి శూన్య ఘడియల్లో ఆ రాళ్ల గుట్టపై పైకెక్కి చూడు” చెప్పింది జవాబుగా.

“నువ్వా నాతో రావా” ప్రశ్నించాను.

“నేను నాబిడ్డను వదిలి యాటికి రాను” చెప్పి అరుగు మీద నిద్రపోవడానికి సిద్ధపడింది వూయల్లోని బిడ్డను ఊపుతూ! నేనాడి నుంచి వచ్చేశాను.

***

ఒక్కొక్క ఘడియకు ఒక్కో పండురాల్చే కాలవృక్షం కతలు కాన్నుంచి అరవై ఎనిమిది మహా తీర్థాలను తిప్పుకొచ్చే మహా వృక్షాలకాడికి ఎన్నెన్నో కతల్ని తన వెన్నెల పాటల్లో చెప్పుకొచ్చేది.

ధనికులూ... పేదవాళ్లూ... బానిసలూ... బానిస యజమానులూ... ఇలా తయారుకాని కాలం ఒకటుండేది... ఆ కాలంలో ఎప్పుడు కావాలని రైతులు పిలిస్తే అప్పుడు పొలం ముంగిటి కొచ్చి వర్షాలు కురిపించి పోయే మేఘాలుండేవి. రైతంటే వాటికి ప్రాణం. రైతుకోసమే తమని పరమాత్ముడు పంపాడని మేఘాలు ప్రకటించేవి. రైతుకూ, మేఘాలకూ మధ్య ప్రేమాభిమానాలుండేవి.

ఊర్లన్ని ఏకమైవుండే కాలం. జనమంతా కలిసి మెలిసి వుండేకాలం ఏ కులమూ లేదు. ఏ మతమూ లేదు. ఎవరికీ భూమి సొంతం కాదు. అందరూ సమానం  అందుకే ఆ రోజుల్లో భూమి సస్యశ్యామలం. రైతులంతా కష్టించి భూమిని సాగులోకి తెచ్చుకొనేవారు.

ఒకరు ఎక్కువ కష్టం.

మరొకరు తక్కువ కష్టం పడేవాళ్లు కాదు. అందరిదీ సమాన శ్రమ. ఆ ఏకత్వం మేఘాలకు నచ్చేది. ఆ సంఘటితం నచ్చేది. అందుకే రివ్వున వచ్చేవి. పొలాలపైన మేఘాల పందిరి వేసేవి. గుత్తులు గుత్తులు మోడాలు అల్లుకొనేవి.

పాటలు పాడేవి. చిందులు వేసేవి. పంటకు ఏ ఘడియలో నీళ్లు అవసరమో ఆ క్షణమే వర్షాన్ని కురిపించేవి. బాధ్యతగా రైతు భాగ్యాన్ని చూసేవి. ఎక్కడా నేల మీద పంట ఎండిపోయేది కాదు. నీళ్లు లేవని బాధ పడేవాళ్లు వుండేవాళ్లు కాదు.

అందరూ సమానం – అందరం సమానంగా కష్టపడదాం– పండిన ధాన్యాన్ని సమానంగా పంచుకుందాం – అని జనమంతా ఒక్కటై బతికే బంగారుకాలం. అన్ని చేతులూ శ్రమించి నేలపై బంగారు పంటను పండించే పసిడికాలం... ఊర్లకు ఊర్లు కలిసి వుండిన కాలం... ఆకాశం కింద నేల తల్లి పచ్చని విశ్వరూపం దాల్చే కాలం...

ఏమైంది...

అట్లాటి కాలం ఎటుపోయింది?...

రైతు పిల్సినప్పుడు రెక్కలు కట్టుకొని వాలి వానల్ని కురిపించే మేఘాలెందుకు మనిషిమీద పంతం పట్టినాయి?

వుంది... దానికీ వుంది కత.... అంటూ కాంచన మరో వెన్నెలపాట అందుకునేది.

"మోదాల కాలాల్లో ఎన్నెలా
బంగారం పండేది వన్నెలా
బతుకు పచ్చంగా పూసేది ఎన్నెలా
ఊర్లన్ని ఒకటయి ఎన్నెలా
జనమంతా కలిసుండి ఎన్నెలా
రాజహంసల కాలం ఎన్నెలా
మల్లెమనసుల కాలం ఎన్నెలా
ఏమైంది ఎన్నెలా... ఏమైంది ఎన్నెలా...
బలవంతుడు పుట్టాడు. ఎన్నెలా
బలహీనుణ్ని తొక్కాడు ఎన్నెలా
నేనిక్కడ ఎన్నెలా – నువ్వక్కడ ఎన్నెలా
నాది ఇది ఎన్నెలా – నీది అది ఎన్నెలా
నువ్వు కష్టపడు ఎన్నెలా

నాకు తెచ్చిపెట్టు ఎన్నెలా

మేఘాలు బూసినాయి ఎన్నెలా

మేఘాలు వెనక్కి నడ్సినాయి ఎన్నెలా..”

కాంచన వెన్నెల పాట

ప్రవాహమై సాగిపోతాంది.

మనిషి గురించి తెలుస్తాంది. ఎలా వుండే మనిషి ఎలా తయారయ్యాడో తెలిసోస్తాంది.

మనిషి దర్శనం ఆవిష్కారమౌతాంది.

జనమంతా కలిసి కష్టపడి పండించిన ధాన్యం పంపకం దగ్గర మోసాలు చోటు చేసుకుంటూ వచ్చినాయి. తాను బలవంతునని తలచినోడు బలహీనుడి భాగాన్ని లాక్కోవడం మొదలు పెట్టినాడు. తిరగ బడి ఎదిరించిన వాడ్ని చిత్రహింసలు పెట్టడం నేర్చుకున్నాడు. బలహీనుల కడుపుకొట్టి వాళ్ల ధాన్యాన్ని దోచుకునే బలవంతులు ప్రతి ఊర్లోను తయారైనారు. ఇక ఊర్లకు ఊర్ల మధ్య సయోధ్య కూడా పోయింది. పోయింది... మనిషితనం పోవడం మొదలైయింది. ఉమ్మడి కష్టం పోయింది... బలహీనుల చేత నిర్భంధంగా పని చేయించుకునే కాలం పుట్టింది... బానిసల కాలం వచ్చింది... బానిస... బానిస... ఈ పదం వింటేనే గుండె వణుకుతాది. శరీరం పదురుతాది... బలహీనుడి బతుకు బానిస బతుకైంది... మోసం చేయడం నేర్చుకున్న ఆ బలవంతుడే ధనవంతుడైనాడు. ఆ ధనవంతుడే రాజ్యవంతుడైనాడు. బీదవాళ్లను గుడిసెల్లోకి నెట్టేసి ధనవంతుడు కొండబండల మీద నివాసాలను ఏర్పరచుకున్నాడు. తనకంటూ ఒక స్థానం నిర్దేశించుకున్నాడు.

చివరికి... చిట్ట చివరికి... యింతకాలం దేవుడ్ని చూసి భయపడమని చెప్పిన వాడు. తన దేవుడని ప్రకటించుకున్నాడు.

బీదవాళ్ల గుడిసెలు తిండిగింజల కోసం వెతుక్కుంటూ వుంటే అతగాడి స్థావరం ధాన్యగారంగా మారిపోయేది. బీదవాళ్లు ధాన్యం కోసం వాడి దగ్గర బానిస బతుకు బతకాల్సి వచ్చేది.

అలా... అలా...

పేదలు భూమిపైన తమకున్న హక్కును క్రమక్రమంగా కోల్పోయారు.

తమకు న్యాయవాటాగా రావాల్సిన ధాన్యాన్ని కూడా దయాదాక్షిణ్యాల మీద సంపాదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తిండిగింజల బాకీ పేరుతో పేదల్ని హింసించడం, వేధించడం మొదలైంది. యేళ్లకు యేళ్లు ఊడిగం చేసే బానిసల్లా పేదలు అణచబడ్డారు.

బీదల్ని, వారి కష్టాన్ని, వారి తిండిగింజల్ని, వారి భూముల్ని లొంగదీసుకుని భూస్వామిగా అవతామెత్తాడు బలవంతుడు. కొందరు లేనివాళ్లు. కొందరు ఉన్న వాళ్లు. రెండు వర్గాల సమాజం ఏర్పడింది.

తరచూ ఈ రెండు వర్గాల మధ్య పోరాటాలు, గొడవలూ, అల్లర్లు చోటు చేసుకుంటూ వచ్చాయి.

ఉన్నవాళ్లు లేనివాళ్లను అసహ్యించుకునే వాళ్లు. లేనివాళ్లు ఉన్న వాళ్లను ద్వేషించే వాళ్లు.

ఇలా... ఇలా... మనుషుల మధ్య దూరం పెరుగుతూ వచ్చింది.

ఇదంతా ఆకాశం చూస్తూనే వుంది.

మనిషిలో వస్తున్న ఈ మార్పును చూళ్లేక తనలో తాను గుంభనంగా దుః ఖించేది.

పేదల బాధల చూళ్లేకపోయింది. భూస్వాములకు బుద్ధి చెప్పడం కోసం, మళ్లీ మనిషిలో మంచితనాన్ని నింపడం కోసం ఆకాశం కూడా తన వైఖరి మార్చుకొంది.

ఇప్పుడెన్ని ప్రార్థనలు చేసినా మేఘాలు రావడం లేదు. రాజహంసలు ఆకాశంలో విహరించే కాలం పోయింది. ఘడియల్లో చినుకులు కురిపించే మోడాలు పోయాయి. మనిషిని అసహ్యించుకొని బంగారుకాలం వెళ్లిపోయింది...

ఆకాశంలో సూర్యుడు ఉదయించడం కోసం రాత్రంతా మనిషి దేవుడ్ని ప్రార్థించే ఒకానొక ప్రాచీన కాలం నుంచి ధనవంతుడికి నిత్యం పూజలు చేయడం. ... వాడి దగ్గరే బానిస బతుకు... వారి మోచేతి కింది నీళ్లు తాగుతూ... నీచంగా వాడి కాళ్ల కింద కుక్కిన పేనులా.. ఇలా మనిషి బతుకు తయారైంది!

ఈ అంతరార్థంతో ఒక్కోరోజు ఒక్కో వెన్నెల పాటను కాంచన విన్పించేది. ఊర్లోని జనమంతా ఆమె పాటల్ని ఆసక్తిగా వినేవాళ్లు.

ఆమె పాటలు విని ఆడోళ్లు దుఃఖించేటోళ్లు. ఆ బంగారమట్ట రోజులు ఎట్లా పోయినాయోనని విచారపడేటోళ్లు.

మగతోడు లేని కుటుంబమైనా కాంచనకు మా ఊర్లో మంచి గౌరవం యిచ్చేటోళ్ళు. ఆమె తన పంచప్రాణాల్ని బిడ్డమీదే పెట్టుకొని జీవించేది. అప్పుడప్పుడు వస్తే మా ఇంటికి మాత్రం వచ్చేది.

చిన్నాయన ఎద్దుల్ని తోలుకొని పొలం కాడికి పోయినాడని తెల్సింది. నేనూ పొలంకాడికి బయలుదేరాను.

***

వలపటి ఎద్దుకు పసురు పట్టిస్తాండడు చిన్నాయన.

కొంత దూరంలో ఉండగానే నన్ను జూసినాడు.

"ఏరా... పాపోడా రాత్రంతా యాటికి పోయినావు?

ఓ మాట చెప్పిపోయింటే ఏమి? "అని అడిగినాడు కోపంగా.

"గువ్వల చెరువు కాడుండే రాజమ్మవ్వగారింటికి పోయింటి చిన్నాయన" జవాబిస్తి చిన్నగా. రోంచేపు ఆ మాటా ఈ మాటా మాట్లాడుకున్న తర్వాత ఎద్దుల విషయం వచ్చింది.

"వలపట ఎద్దు మెత్తబడింది. ఏంజేద్దా మంటావు?"

అడిగినాడు సిన్నాయన నా అభిప్రాయం తెల్సుకోవడానికి.

"ఈ సేద్యాల్ని నమ్ముకొనే దానికంటే దీన్లను అమ్ముకోవడమే మంచిదని పిస్తాంది..." అంటి బాధగానే.

"నువ్వు అనేది భూమి గురించా... ఎద్దుల గురించా..." మళ్లీ అడిగినాడు చిన్నాయన.

"రెండిటి గురించి" – అరుగుమీద కూర్చుంటూ సమాధానమిస్తి.

"బాగుంది... నీమాట తీరు... అన్నీ అమ్ముకొని ఏం చేయాలా? ఎట్లా బతకాలో అది గూడా చెప్పు" – అన్నాడు నా పక్కనే ఆయనా కూర్చుంటూ.

"అదే ఆలోచిస్తావుండాను" అని జెప్తి.

"సరే ఆలోచించి నాకే చెప్పు. అంతదాక అమ్ముకోవాలనేది, గిమ్ముకోవాలనేది పెట్టకు. సంక్రాంతి తర్వాత అట్లాంటి ఆలోచన జేద్దువుగానీ..." అన్నాడు బీడీ ముట్టించుకుంటా చిన్నాయన.

నీలకంఠానికి కట్టాల్సిన పదివేలు, లక్ష్మికి చూడాల్సిన సంబంధాల గురించి కూడా మాట్లాడుకుంటిమి. వీరబల్లి దగ్గరుండే మాధవరెడ్డి వాళ్ళ సంబంధం బాగుంటాదని చెప్పినాడు సిన్నాయన. అట్టయితే రోంత త్వరగానే ఆ సంబంధం విషయం సూడమని జెప్పినాను. డబ్బు గురించి ఆలోచించకు. యడైనా అప్పు జేసైనా మన పనులు పూర్తి చేసుకుందాం అని కూడా అంటి.

ఇద్దరం ఎద్దుల్ని తోలుకొని ఇంటిదారి పడ్తిమి. పక్కూరికి పనివుండి పోతాండ మని రాత్రికి రానని జెప్పి ఆంజనేయులతో పాటూ గువ్వల చెరువుకు పయనమైతి. అది మొదలు నాల్గురోజులు ఇంటికి కూడా పోకుండా ఎర్రకొయ్యను కొట్టడంలోనే నిమగ్నమయ్యాను. పొద్దునా, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా గొడ్డలిపనే.

ఒక్కటే కసి – నీలకంఠం గాడికి అప్పు కట్టాల. లక్ష్మి పెళ్లి జెయ్యాల.

కండలు కరిగి చమటై పోతాండయి. బొట్లుబొట్లుగా తడిసిపోతాంది – వెచ్చగా శరీరం!

ఆంజనేయులు వాళ్ళింట్లోన్నుంచే దిన్నం సంగటి ముద్దలు తెచ్చిపెట్టినాడు.

రెండురోజులు ఎర్రకొయ్య దుంగల్ని మదరాసు దిక్కు పోతాండే రైలు బండిలోకి చేర్చడం కూడా జేసినాను. రైల్లో వచ్చే వాళ్ళ ఏజంట్ దాన్లను రహస్యంగా పెట్టుకొని తీసుకొని పోయేవాడు.

వారం రోజులు ఇంటిముఖం కూడా చూల్లేదు. ఎర్రకొయ్యల కష్టం… పోలీసులకు చిక్కితే జైలు బతుకే… రహస్యంగా జెయ్యాల.

వారానికి పడిన కష్టం పదివేలు చేతికి అందినాయి. నీలకంఠంగాడి బాకీ తీర్చి వేయవచ్చు. భోగిపండగ రోజుకంతా ఇస్తానని బదులు తీసుకున్నాడు ఆంజనేయులు.

సరేనని పదివేలూ ఇచ్చితి.

ఆరోజు ఆడవికి మదనపల్లి నుంచి ఎర్రకొయ్య ఏజెంటు కూడా వచ్చినాడు. వాడి పేరు –ఇస్మాయిల్. ఎత్తుగా వుండి, గుబురు గడ్డం పెంచుకొని వుండాడు. పైన పొడవాటి కుర్తా, నోట్లో ఎప్పుడూ సిగరెట్. ఒకటి అయిపోతే యింకొకంటి వెలిగిస్తావుండాడు. కోట్ల సంపాదించుకొన్నాడని ఆంజనేయులే చెప్పినాడు.

ఇస్మాయిల్ ఎర్రకొయ్య వ్యాపారం గురించి చెప్పడం మొదలు పెట్టినాడు – 'ఇది ఖరీదైన కొయ్య. ఈన్నుంచి మీరు దుంగల్ని కనుమలోపల్లి రైల్వేస్టేషన్‌కాడికి

తీసుకొస్తే మన ఏజెంటు రైళ్ళులో వస్తావుంటారు. గూడ్సుబోగీలు వస్తావుంటాయి. సరుకు వేసుకొని దాన్లలోకి దుంగల్ని చేర్చి కప్పేయ్యండి ఆ రైలు మదరాసు కొచ్చినాక దాన్లను బయటకు మేం తెచ్చుకుంటాం' అని వాడికి అలవాటైన యాపారం చెప్పినాడు.

సరేనని చెప్పి మేము ఇంటికి బయలు దేరినాం. ఇంటికి పోయినాముంటి అమ్మ తిడతానే వుంది. లక్ష్మి కూడా అలిగి మాట్లాడం లేదు. పక్కూరి ప్రసాదు పని మీద తిరప్తి పోవాల్సి వచ్చిందని చెప్పేసరికి రోంత కోపం తగ్గించుకున్నారు. కానీ సిన్నాయన మాత్రం నా మాటలు నమ్మినట్లు కనపడలేదు.

కాలం అట్నే గడిసిపోసాగింది.

***

"తుమ్మీద తుమ్మీద నల్ల తుమ్మీద తుమ్మీద కండ్లన్ని దూలాల మీద మాయన్న కండ్లన్ని మరదళ్లమీద మరదలికి లంచము ఏమిస్తివన్నా చీరిస్తివా – నారిస్తివా – చిరి గంధమిస్తివా

అలక నీల్లిస్తివా – ఆకు తోటిస్తివా –

పూసిన ఇల్లిస్తివా – పూల తోటిస్తివా...." అంటూ

పాటలు పాడుకుంటూ గొబ్బిళ్ళు తట్టుకునే ఆడపిల్లోందరూ వెంటబడినారు. ఈ సంక్రాంతి వస్తాందంటే ఇదే సావు. దుడ్లకోసం, నూకలకోసం యాడబడితే ఆడికి రావడం... వెంటబడడం... తిట్టుకుంటా వచ్చినాడు ఆంజనేయులు నాకాడికి.

"ఏం జరిగిందిరా?" – అని అడిగితి.

వాడ్ని నేను కూడా ఇబ్బంది పెడతా.

"ఊర్కో సామీ, వాళ్ళతో సచ్చీచెడి వస్తాంటే నీ పరాచికాలొకటి" – అన్నాడు ముఖం తిప్పుకుంటా.

నాకు నవ్వొచ్చింది.

"ఆడపిల్లోల్ల గొబ్బీలకు యిన్ని దుడ్లు అయినా యిచ్చినావా లేదా.." అన్నాను.

"పండుగపూట యివ్వకుంటే వాళ్ళు ఊరుకుంటారా... ఏంది?" – జవాబిచ్చాడు వాడు.

అవును... పండగ...

సంక్రాంతి పండగ.. కాంతి పండగ.. ఊరికి ఉషస్సుల సంబరాన్ని మోసుకొచ్చే పండగ.. ఊరు ఊరంతా అంబరాన్నితాకే సంబరమైతాంది... సూర్యభగవానుడు ఉత్తరాయణంలోకి అడుగుపెట్టే సమయం... ధనూరాశి నుండి మకరరాశిలోకి సంక్రమణం చేస్తాడు...

ఈ విధంగా ఒకరాశిలోంచి మరొక రాశిలోకి మారడాన్నే సంక్రమణం అంటారు... భోగి... సంక్రాంతి... కనుమ అని మూడు రోజుల పండుగ ఇది.

ఊరంతా ఉత్సవం తీరుగా తయారవుతాంది. యాడజూసిన సందడి సందడిగా వుండాది. ఇళ్ళకు తెల్లసున్నాలు కొట్టుకుంటాండరు. సుట్టు ప్రక్క ఊర్లల్లోని వాళ్ళ వాళ్ళందర్ని పిల్సుకున్నారు. పల్లెల్లో జీవాన్ని పోసే పండుగ సంక్రాంతి.

బాగా ధాన్యం పండితే ఎంత ఘనంగా జేసుకోవాల్సిన పండగ.

ధాన్యం... యాడ పండింది..?

కరువుకాటుకు పంట యాడ సేతికొచ్చింది...?

అయినా జనం పండుగ జేసుకుంటాండరు...

పంటలు లేకపోయిన పండుగ...

నీళ్ళు లేకపోయిన.... నిలువ నీడ లేక పోయినా పండగలొస్తానే వుంటాయి....

అప్పో... సోప్పో తెచ్చుకొని పండగలు జరుపుకోవడానికే జనం తయ్యారైతాండరు....

అలవాటు పడ్డారు....

కరువును భరిస్తున్నట్లే... కన్నీళ్ళను సహిస్తున్నట్లే!

తెల్లారితే భోగి పండుగ.

ఆంజనేయులు తన కాడుండే పదివేల రూపాయలు కూడా తెచ్చిచ్చినాడు. ఈ డబ్బు నీలకంఠానికి అప్పు కింద కట్టేయాలి. యిక కట్టాల్సిన అప్పులు ఏవీ వుండవు. పండుగ అయిపోయినాంక ఎద్దుల్ని అమ్మేయాలి. ఆ వచ్చిన డబ్బుకు జతగా మాధవరం కాడుండే బూమి కూడా అమ్మేసి లక్ష్మి పెళ్ళి ఘనంగా జేయాల. మంచి సంబంధం కుదిరితే ఎంత త్వరగా అయినా పెళ్ళి చేసేయ్యాలనే వుంది.

ఆలోచనలు ఇలా సాగుతూనే వుండాయి.

"ఆలోచించుకోలేన్నా... ఎట్టా కావాలనుకుంటే అట్టా అయితాది. ... తెల్లారే వస్తాను... భోగిపండుగ కదా.. ఆ రచ్చ బడకాడ మంట వేయాలి.. ఇంటి కాడ్నేవుండు వచ్చి లేపుతా!" – అని జెప్పి ఆంజనేయులు వెళ్ళిపోయినాడు.

నాకు ఆలోచనలు అట్నే వస్తాండయి. లక్ష్మి పెళ్ళిలోగా ఎర్రకొయ్య చెట్లు బాగా కొట్టి యింగా రోంత డబ్బు సంపాదించుకోవాల. కుదురితే ఎర్రకొయ్య దుంగల్ని మోసుకొని రహస్యంగా మద్రాసోళ్ళకు అందజేసే పని కూడా చేయాల. ఇట్లా ఆలోచిస్తానే నిద్రలోకి జారుకుంటి. పడుకోగానే కలలు కమ్ముకున్నాయి.

కలలు... కలలు... అలవికాని కలలు... అలల్లా... అలల మధ్య దాగిన వలల్లా... ఒడ్డునుకోసే కెరటాల్లా.... చీకటి కోణాల దారుల్లో ప్రాణ ప్రవాహాల ఘోష... ఏ అర్థాన్నో పలికించాలని రెప్పల రెక్కలు పదేపదే కొట్టుకమిట్టాడతాయి.... ఈ భూముల కలలన్నీ తడారిన ఎడారి గొంతులాగే వుంటాయి... నోళ్ళు విచ్చుకున్న ముళ్ళజెముళ్ళే అవుతాయి. కరవు రాగం పాడతాయి... బాధ పలికి నప్పుడు మాటలు కూడా కరువౌతాయి... కనురెప్పల్లోని బిందువులు అరచేతుల్ని తడిపినప్పుడు ఆ దృశ్యం... అచ్చం మా బీడు భూమిలాగే వుంటాది. నెర్రెలు విచ్చుకున్న నేలగానే కనపడతాది.

'ఛా... ఛా...' అర్థం పర్థం లేకుండా ఏవేవో నీడలు కలలు కలలుగా కనుపాపల లోతుల్లో దృశ్యాలై గుచ్చుకుంటాండయి.

నడిరాత్రి నిద్రలోంచే లేచి కూర్చొంటి. అందరూ నిద్రపోతావుండారు. లేచి కుండలోని మంచినీళ్ళు ముంచుకొని తాగివచ్చి మళ్ళీ పండుకుంటి.

# 8

**తె**ల్లారింది.

ఆంజనేయులు వచ్చాడు. ఊర్లో వాళ్ళు భోగిమంట రచ్చబండకాడ వేసినారు పోదాం... రమ్మనాడు.

ఇద్దరమూ కలిసి ఆడికి పోతిమి. మా వెనకాలే చిన్నాయనా వచ్చినాడు రచ్చబండ ప్రక్కన పెద్దమంట మండుకుంటా వుండాది. ఊరి జనమంతా ఆడ్నే వుండారు. కంపకట్టేలు, దంట్లు, పాత చాటలు, పొరకలు, గంపలు, బుట్టలు, తట్టలు అన్నీ మంటల్లో రగులుకుంటా వుండాయి. పిల్లోళ్ళందరూ 'భోగే.... భోగే... భోగే' అని అరుస్తావుండారు. అందరి ఇళ్ళల్లోని పాత చెత్తసామాన్లన్ని తెచ్చి మంటలోకి విసిరేస్తావుండారు.

మా ఇంటి ముందు లక్ష్మి, అమ్మ ఇద్దరూ కల్సి రంగురంగుల రథం ముగ్గు వేస్తావుండారు. అదే దావలోనే దూసుకొని వస్తాంది నీలకంఠంగాడి కోడె... దూరంగా... దాని కొమ్ములు కూడా పదునుదేలి వుండాయి. ఎఱ్ఱదుమ్ము రేపుకుంటా కొమ్ముల్ని విదిలించకుంటా రివ్వున పరిగెత్తుకొస్తాంది...

నేను భోగిమంటకాన్నుంచి దావలోకి పరిగెత్తడం జూసి నా వెనుకే మా సిన్నాయన కూడా లేచి వచ్చినాడు.

అమ్మా, లక్ష్మి ఇద్దరూ ఇంట్లోకి ఉరికినారు. ఆ కోడె నా వెంటపడింది. ఆ పక్క నుంచి సిన్నాయన పగ్గాన్ని లాగి పట్టుకొని యాపమానుకు బిగించి కట్టేసినాడు.

అయినా అది రోసంతో బుస పెడతానేవుంది. భోగిమంటకాడుండే జన మంతా కోడె సుట్టుకారం చుట్టకున్నారు.

నేనే సర్ది పంపిస్తి.

ఇంటిముందు వేస్తాండే రథం ముగ్గు చెరిగిపోయింది. రోంతసేపుకు నీలకంఠం వచ్చినాడు.

"ఎవఱ్ఱా నా కోడెను కట్టేసినోడు..." అని ఎగురుకుంటా వచ్చె.

"ఎవరైతే ఏం గానీ... ఊరిమీదకు ఇట్లా యిడిసిపెడితే ఎట్లా.... " హెచ్చరిస్తా చెప్పినాడు సిన్నాయన. జనమంతా మళ్ళీ గుమికూడినారు.

"నా కోడె కత నేను జూసుకుంటా... ముందు మీరు ఇయ్యాల్సిన అప్పు కట్టండి..." నిలదీసి అడిగినాడు నీలకంఠం.

సిన్నాయన నా దిక్కు జూసినాడు.

నేను వెంటనే ఇంట్లోకెళ్ళి పెట్టెలోని పదివేలు తెచ్చి నీలకంఠంకి యిచ్చాను పౌరుషంగా.

"ఇంగోసారి కోడె ఇట్లా ఊరిమీద పడితే అది మళ్ళీ నీ దగ్గరికి తిరిగి మాత్రం రాదు..." గదమాయించినాడు సిన్నాయన. నీలకంఠం ఆన్నుంచి తలొంచుకొని వెళ్ళిపోయినాడు. వాడి మనుషులు కోడెను విడిపించుకున్నారు. రచ్చబండ దగ్గర భోగి మంట మండుతానే వుంది. మాదిగోళ్ళ కొండయ్య ఇంతలో తప్పెట తీసుకొని వచ్చినాడు. మండే సెగకు పలకతిప్పుకొని దరువు కొట్టడం మొదలు పెట్టినాడు.

కొండయ్య... తప్పెట కొడితే సుట్టుపక్క పదారు పల్లెలకాడికి వినపడతాది. తప్పెట మోగుతానే వుంది.

అందరమూ ఆడ్నే సెగ దగ్గరే కూర్చొంటిమి. ఆ తప్పెట శబ్దానికి ఆంజనేయులు అడుగు వేయడానికి సిద్ధమయ్యాడు. నేను గట్టిగా ఈల వేస్తి. అది జూసి చుట్టుపక్క వుండే జనంలోని పిల్లోళ్ళు కూడా ఈలలు వేసిరి. కొండయ్య సెగకు తప్పెటతిప్పి కొడతాండడు. ఆంజనేయులు... 'ఐదు... ఐదు... జెగ్గినక.... జెగ్గినక' అని అడుగు వేస్తాండడు.

ఆంజనేయలతోపాటూ చిన్నాయన కూడా ఎగురడంతో జనమంతా సంబరంగా చూస్తాండిరి. చెరిగిపోయిన రథం ముగ్గును సరిచేసి వేస్తాంది లక్ష్మి. ఆడ్నే కాంచన వేయడానికి కూడా చెల్లికి సాయంగా రంగులు కలుపుతాంది. దూరంనుంచే నన్ను చూసింది. నేను నవ్వాను. తాను కూడా సన్నగా నవ్వింది. ఆంజనేయులు తలపాగా చుట్టుకొని చిందేస్తాండడు. కొండయ్య పలక జోరందు కుంది. రచ్చబండ రావిచెట్టు మీద వాలిన కోయిల కూడా 'కుహు కుహు' రాగాలతో పాటందుకుంది. ఆడనే అంతసేపట్నుంచి ఊర్కే కూకొనివుండే మల్లన్న పాటెత్తు కున్నాడు....

"పోతావు ఎఱ్రపిల్ల కట్టకిందకి

పోతావు ఎఱ్రపిల్ల గుట్టకిందకి.

బా రెడెత్తు గడ్డికోసి ఒత్తి ఒత్తి గంపకేసి

ఎత్తలేక ఎనక్కి పడితే

కపిలతోలె సిన్నవాడు – వాలికొద్ది కదిలివచ్చి నడుముపట్టి పైకిలేపి – వీపుతట్టి మన్నుతుడిసి

సందకాడ వామి దోడ్లో"

మల్లన్న పాడే పాటకు అడ్డం తగుల్తా ఆంజనేయులు అందుకున్నాడు... "బై... బై... వామిదొడ్లో... వామిదోడ్లో" అని ఎగుర్తా అడుగేస్తావుండాడు.

"వామిదోడ్లో... వామి దొడ్లో" అని జన మంతా గొంతు కలిపినారు, బండ మీద ఆ వారన కూర్చొన వుండే సీతారాముణ్ని చూస్తా. వాడు తల పట్టుకొని కూర్చున్నాడు. ఔనుమరి... దిన్నం సందెకాడ పాపమ్మతో ఆ దిగువన వుండే కల్లం కాడివామి దొడ్లో కల్సుకునేది వాడేకదా. నవ్వులే నవ్వులు. ఆడ్నే నవ్వుతానే కాల మంతా గడిచిపోయింది.

భోగి స్నానాలు అయ్యాయి. మధ్యాహ్నంపూట కొట్టాలపల్లె పెద్దరెడ్లు దానమిచ్చిన దేవరెద్దుల ప్రదర్శన జరిగింది. వాళ్ళు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి పేరుమీద రెండు ఎద్దులు ఇచ్చినారు. వాటిని గంగమ్మ దేవళంకాడుండే నరసింహులు మేపుతా వుండె. వాటిని గువ్వల చెరువు కాన్నుంచి వచ్చిన పన్నెండు దేవరెద్దులతో పాటుగా కలిపి ఊరేగింపు చేసినారు. ఎవరికి ఉండేకాడికి వాళ్ళు దానం ఇచ్చినారు దాన్లకు. గంగమ్మ దేవళం కాడనే దేవరెద్దుల్ని వరసగా నిలబెట్టి బసవన్న ప్రదర్శనలు కూడా చేయించినాడు నరసింహులు. ఆ ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. దేవరెద్దుల్ని చుట్టుపక్క పల్లెల్లో కూడా తిప్పుకొచ్చినారు. సాయంత్రం కావచ్చింది. ఆవు సాంగెం మొదలు పెట్టినారు. నరసింహులు దేవరెద్దుల్ని ఒక పక్కన కట్టేసినాడు. ఆవును మధ్యలోకి తెచ్చినాడు. దానికి పూజ చేసినారు ఆడోళ్ళు. హారతులిచ్చినారు. టెంకాయ తీర్థం చల్లినారు. పసుపు కుంకాలు దిద్దినారు. గంగిరెద్దుల్ని ఆడించుకునే రామాపురం వీరబద్రయ్య ఆవును ఇంటింటికి పోయి తిప్పుకొచ్చినాడు. అందరూ ఆ ఆవుకు హారతులిచ్చి పూజలు చేసినారు.

ఊరంతా తిప్పుకొని వచ్చినాక ఆ గంగమ్మ తల్లి ముందు నిలబెట్టినారు. అసలు కత యింగ ఆడ్నే వుంది.

ఆ ఆవు ఉచ్చలు సోసిందంటే వానలు పడ్తాయంట. లేకుంటే ఈ సంవత్సరం కూడా వర్షాలుండవు. వానలు పడ్తాయా.... లేదా... అని తెల్సుకోవడానికి ప్రతి సంవత్సరమూ మా ఊర్లో ఈ ఆవు సాంగెంచేసేటోళ్ళు. కొంతకాలంగా మానేసినారు ఎట్లా వానలు పడ్డం లేదులే అని!

ఇదిగో ఇప్పుడు పండగ పూటన్న చేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వుండారు. జనమంతా ఆసక్తిగా చూస్తాండరు. గంగమ్మ తల్లి ఎదురుగా నిలబెట్టిన ఆవు, బొమ్మతీర్న నిలబడి వుండాది.

అందరూ అది ఉచ్చలు పోస్తాదా... లేదా... అని ఉత్సాహంగా చూస్తాండరు. గంగిరెద్దుల వీరబద్రయ్య డోలు మోగుతానే వుంది. ఆవులో ఉలుకూ – పలుకూ లేదు. బెల్లం కొట్టిన రాయి తీర్న అది ఆడ్నే నిలబడిపోయి దిక్కులు చూస్తావుంది....

'యింగ లాభం లేదుగానీ... దీన్ని పక్కకు తీసుకొని పొండి' అన్నాడు నిరాశగా నరసింహులు. ఆవు ఉచ్చలు పోయలేదనే సంగతి అప్పుడే ఊరంతా పాకిపోయింది. ఊరేకాదు చుట్టుపక్క పల్లెలకు కూడా. ఉదయం నుంచి ఉత్సాహంగా కేరింతలు కొట్టిన జనం ఆవు ఉచ్చలు పోయలేదన్న సంగతి తెలుస్సుకున్నప్పటి నుంచి దిగాలుపడ్డారు. అందర్లోనూ బాధ.

ఈసారి కూడా వానలు రావా....

చినుకులు కుర్సవా...

మనకు కన్నీళ్ళు తప్ప... నీళ్ళు వుండవా....

అందర్లోనూ ఒకే దుఃఖరాగం...

ఎవరి పాటికి వాళ్ళు గంగమ్మ దేవతల కాన్నుంచి వెళ్ళిపోయినారు. ఆ దినమంతా భాదతోనే గడిచిపోయింది. తెల్లారింది. సంక్రాంతి పండుగ. అయినా చేసుకోవడానికి ఎవరికి మనస్సు ఒప్పుకోవడం లేదు.

చిన్నాయన మాత్రం ప్రొద్దున్నే లేచి ఎద్దుల్ని కడిగి శుభ్రం చేసినాడు. కొమ్ముల్ని జివిరి మెరిసే రంగుకాయితాలు అతికించినాడు. బులుగు నీళ్ళల్లో కలిపి ఎద్దుల శరీరానికి పూసినాడు. ఎద్దులు మెర్సిపోతా వుండాయి.

లక్ష్మి, అమ్మ ఎద్దుల కోసం ఉప్పుచెక్క దంచుతా వుండారు. మామిడి, మర్రి, భాగి, సుంకురేసుల, రేళ చెట్ల బెరడు చెక్కలు తెచ్చి దంచి ఉప్పురాళ్ళతో పాటుగా పశువులు ఆరోగ్యంగా వుంటాయని నమ్మకం.

సంక్రాంతి పండగంతా పల్లెలో పశువుల పండగే. కళకళలాడే సందడంతా పశువులదే. ఎడ్లపందాలు బండ్లపందాలు, కోడి పందాల, ముగ్గులు, గొబ్బీలు, హరిదాసు పాటలు... ఇంతులూ... పూబంతుల సందడితో వసుధ పులకిస్తుంది... ముత్యాల ముగ్గుల్లో గొబ్బెమ్మల కొత్త అందాలు... గాలి పటాల మెరుపులు... ధరణికి పండువెన్నెల తెస్తుంది.. పండగ పూట ఆనందవేళ బంతిపూలు కిలకిల నవ్వుతాయి...

అయినా ఇవన్నీ ఇప్పుడెక్కడుండాయి..? పల్లెల్లో పండగలు చేసుకునేటోళ్ళు యాడుండారు? అయినా పల్లెలు పచ్చగా యాడుండాయి? పల్లె పచ్చగా పండి ఎన్నాళ్లైంది... ఎన్నేళ్లైంది? కరువు పల్లెను కబళించిన తర్వాత దాన్నుంచి పండగ యాడ బయట పడింది? కరువు పంటను, రైతునే గాక మన పండగల్ని, వేడుకల్ని, ఆటల్ని, పాటల్ని మొత్తంగా సంస్కృతినే మింగింది. పనులన్నీ పూర్తయినాక మధ్యాహ్నమప్పుడు లక్ష్మి వచ్చి మాటలు పెట్టుకుంది. ఆ మాటా ఏ మాటా మాట్లాడుకున్నాక పొడుపుకత ఒకటి వేస్తాను విప్పమని చెప్పింది. 'సరే ప్రయత్నిస్తా లేమ్మా' అనంటి.

"ముక్కు మొగమూ లేని పక్షి, ముప్పయ్యారు గుడ్లు పెట్టె, డెబ్బయ్యారు సుట్లుదిరిగె, ఇరవయ్యారు పిల్లలు లేపే – దీని అర్థమేంది?" అని అడిగింది. కులాసాగా

నిజంగా నాకు జవాబు తెలుస్తే కదా

"జవాబు చెప్తాను గానీ... నాకు ఏంటి లాభం" అని అడిగినాను. పండక్కి అమ్మ జేసిన రవ్వలడ్డు తెచ్చిస్తానని చెప్పింది.

మనకు నేను జవాబు చెప్తాను... నాకేంటి లాభం" అడిగింది లక్ష్మి.

'మంచి మొగుణ్ని తెచ్చి పెళ్ళి చేస్తాను' అని చెప్పాను.

"అందుకే నీతో మాట్లాడను" అని లేచి వెళ్ళిపోయింది వసారాలోని అమ్మదగ్గరికి. నేను కూడా లక్ష్మి వెనుకనే వెళ్ళాను. లక్ష్మి నాకు వేసిన పొడుపు కతనే అమ్మనూ అడిగింది. అమ్మ కూడా తెలియదందీ.

"ఇద్దరికీ కడుపు నిండిందా? చెప్పండి" అని అడిగింది లక్ష్మి.

అలాగేనని అమ్మ, నేనూ ఇద్దరమూ ఒప్పుకున్నాం. "కుమ్మరి సారె" గట్టిగా అరిచింది లక్ష్మి.

"అబ్బా... మర్చిపోయానే" అనింది. అమ్మ.

"చూశారా... ఇద్దర్నీ నేనే ఓడించాను" గర్వంగా కళ్ళు ఎగరేస్తూ చూసింది లక్ష్మి.

నాకేం అన్పించలేదు.

ఇప్పుడు నాన్న కూడా మా మధ్య వుండి వున్నింటే ఎంత బాగుండోనని పించింది. రెండు కన్నీటి బొట్లు కనురెప్పల్లోనే తడిగా తగిలాయి.

"ఆ పక్క ఈ పక్క బండరాతి మిట్ట. నట్ట నడుమాన చిత్రాంగి యేరు. ఆ యేరు దాటాక సింగనమల కోన. ఆ కోన లోపల శివలింగ మండపం. ఆడుండే దేవుడికి పూలంటే ఇష్టం గన్నేరు పూలంటే ఆ శివుడికి ప్రాణం" – ఈ కత తెలుసునా మీకు? అని అడిగింది లక్ష్మి. తెలీదు అని చెప్పింది అమ్మ.

"ఇప్పుడొద్దు గానీ... తర్వాత చెబుదువులే... సిన్నాయన వస్తాండడు... రవ్వలడ్లు త్యాపో..." అని అమ్మ అనే సరికి లక్ష్మి ఇంట్లోకి పరుగు పెట్టింది.

వీరబల్లి సంబంధం గురించి చిన్నాయన అమ్మ దృష్టికి తెచ్చినాడు. ముందు అబ్బిని మీరిద్దరూ పోయి సూసిరాండి అని చెప్పింది అమ్మ.

ఇంట్లోంచి లక్ష్మి వస్తాంటే నేనే మాట మార్చి – "నీకు ఇట్లాటి పొడుపు కతలు, గన్నేరు పూల కతలు ఎట్లా తెలుస్తాంటయి? అని అడిగితి.

"కాంచనక్క అన్నీ చెప్తాది" అనింది లక్ష్మీ రవ్వలడ్డు సేతికిస్తా.

"బాగుండారు స్నేహతురాళ్లు ఒకరికొకరు" అని అంటి ఎగతాళిగా.

"అట్లైతే.... నువ్వెందుకు జెప్పించుకున్నావు? రాళ్లు కరిగే వేళ... పాట కత" – అని అడిగింది లక్ష్మీ.

"అవును మర్చేపోయాను తల్లీ... రాళ్లగుట్ట పైకెక్కి ఆ రాళ్లు కరిగే ఘడియల్లో దాన్ల కతేందో సూడాల" – అని అంటి. లక్ష్మి నవ్వడం మొదలు పెట్టింది. అందరూ నవ్వులు కలిపారు.

***

సాయంత్రం పూట ఆంజనేయులు వచ్చినాడు. ఎర్రకొయ్యల పనికి నాల్గురోజులు రానని జెప్పినాను. "వీరబల్లి పోతాండ లక్ష్మి సంబంధం విషయం మాట్లాడి రావాల. మొన్న కొట్టి వచ్చిన ఎర్రకొయ్యల దుంగలు కొన్ని ఆ దిగదాల కాలింకాయల సెట్ల పొదల్లో పెట్టి వచ్చినాను. దాన్లను కూడా వాళ్లకు అప్పగిచ్చి సొమ్ము తీసుకురమ్మని పురమాయించినాను. పెళ్లికి మదరాసు ఏజెంటుగానీ, ఇస్మాయిల్ గానీ ఏదైనా ఆర్థిక సహాయం చేస్తారేమో కనుక్కోమని కూడా చెప్పినాను. "సరే నేను మాట్లాడతా" నని జెప్పి ఆంజనేయులు వెళ్లి పోయినాడు.

నేను ఎద్దులకాడ పని చేస్తాండేటప్పుడు కాంచన వెన్నెలపాట మొదలు పెట్టింది. లీలగా ఆ పాట వినపడతాంది.

"రాళ్లు కరిగే వేళ వెన్నెలా
లోకాలు నిద్దరోతాయి ఎన్నెలా
ప్రకృతి పాలించేకాలం ఎన్నెలా
పస్తులు ఎవరుండిరి ఎన్నెలా
నక్షత్రాలు ఆకాశం ఎన్నెలా
పరిచిన పంచాంగం ఎన్నెలా
కుమ్మరి చక్రం పుట్టింది ఎన్నెలా
లోకమంతా కదిలింది ఎన్నెలా..."

– ఇలా సాగిపోతాంది ఆ పాట.

నా ఆలోచనల్లో నేనుండాను. వలపట ఎద్దుకైన కురుపు మానడం లేదు. ఆకు పసరు పని చేస్తాందో లేదో అర్థం కావడం లేదు. ఇంట్లో తింగి గింజలు అయిపోవచ్చినాయి. వడ్లమూట తీసుకొని రైస్‌మిల్‌కు పోయి ఆడించుకొని రావాల. ఆ రైస్‌మిల్ ఆడాలంటే కరెంటు వుండాల. అది ఎప్పుడుంటాదో ఎవరికి తెలుస్తాది...

గూట్లో తగిలించిన అద్దం పైన వాలిన పిచ్చుక తన ముఖం తాను చూసుకొని ముక్కుతో పొడుస్తాంది. టప్‌టప్ మంటాశబ్దం వస్తానేవుంది. లక్ష్మికి ఆ శబ్దమంటే విసుగు. అద్దంతో నిజానికి లక్ష్మికే ఎక్కువ అవసరం.

ఈ మాటే నేను అమ్మతో అంటే “ఆడ పిల్లలు అంతేలేరా....!” అని నన్ను మందలిస్తుంది.

నాకు అద్దంలో ముఖం చూసుకోవాలంటే భయమేస్తుంది. అంతరాత్మ కన్పిస్తేలోపలి మనిషి పలుకరిస్తే జవాబు ఇవ్వలేనితనమూ భయపెట్టువచ్చు. చర్మం అంతరాల లోతుల్లో ఎండుటాకుల ధ్వని భరించడం చాలా కష్టం.... అద్దంలో ముఖం చూస్కోవడం కంటే అద్దాల తలుపుల్లోని బొమ్మగానైనా వుండడం నయమనిపిస్తుంది.... కరగడం తెలియని మంచుగడ్డలాగా జీవితకాలాన్ని దువ్వు కోవాలి... ఇలా ఆలోచనల్లో వుండగానే అద్దం మీద వాలిన పిచ్చుక చేసే శబ్దం ఆగిపోయింది.

చూశాను. పిచ్చుకను తోలి అమ్మ అద్దాన్ని తిప్పించి పెట్టి వెళ్లిపోయింది.

అవును, ఇంకో శబ్దం కూడా ఆగిపోయింది. కాంచన పాటల శబ్దం...

ఏమైందో తెలియదు. బహుశా బిడ్డనిద్రపోలేదేమో!

కాంచన – రేణిగుంట దగ్గర వుండే సుబ్రమణ్యశాస్త్రి కూతురు. శాస్త్రిగారు మంచి వారు. సాయిబాబా గుడిలో వుంటారు. వేదవేదాంగాలు చదివినవారు. ఆయన కూతురు కావడమే కాంచన అదృష్టమని చెప్పాల. అల్లుడు సోమశేఖరం ఒక రోడ్డు ప్రమాదంలో చనిపోతే కూతురు మానసిక పరిస్థితి దెబ్బతినింది. ఆ ప్రాంతం నుంచి దూరంగా తీసుకెళ్లడం వల్ల కాంచన పరిస్థితిలో మార్పు రావచ్చునని చెప్పడంతో మా ఊరికి తీసుకొచ్చారు. కొంతకాలం బాగానే పట్టించు కొని చూశారు. ఒక్కగానొక్క కూతురి పరిస్థితి ఇలా తయారవ్వడం చూల్లేక వాళ్లు కూడా మంచాన పడ్డారు. కాంచన ఇప్పటికీ మానసికంగా సరిగ్గా వున్నట్లు కనపడదు. అందుకే ఆమె సంధ్య వేళ వెన్నెల పాటల్ని ఆలాపిస్తూ ఉంటూంది.

ఇంతలో అమ్మ పరుగు పరుగునా నా దగ్గరికి వచ్చింది.

ఒళ్లంతా చెమటలు పట్టివుండాయి.

“రేయ్... పాపోడా... రా... రా... నాయనా.... ఆ పిల్ల సచ్చిపోతాది... పొయ్యి కాపాడు... కాపాడు” గట్టిగా అరుస్తాంది. నాకేం అర్థం కాలేదు.

“ఏం జరిగింది... ఏం జరిగిందమ్మా!” అడిగా ఆత్రం కొద్ది.

“లక్ష్మికి ఏదైనా ప్రమాదమా.... యాడుంది” అడిగితి మళ్లీ నేనే.

“కాంచన... కాంచన....” అనుకుంటూ మళ్లీ అమ్మ బయటకు పరిగెత్తింది.

నేను అమ్మకంటే ముందు కాంచన ఇంటికాడికి ఉరికెత్తినాను.

బయట జనం చుట్టుకొని వుండారు. లక్ష్మీ కూడా ఆడ్నే వుంది.

ఆడుండే సీతమ్మవ్వ గట్టిగా అరుస్తాంది...

అందర్ని పక్కకు జరిపి లోపలికి జూస్తి....

“ఆ పాయికారి నా కొడుకు... బంగారమట్ట పిల్లను చెర్సినాడు కదరా... నాయనా!” – సీతమ్మవ్వ రెండు నేతుల్తో నెత్తికొట్టుకుంటూ ఏడుస్తాంది. లోపల... కాంచన... ఒంటిగా మూలన కూర్చుని ఏడుస్తాంది. రైక చినిగిపోయి.... పడిపడి ఏడుస్తాంది. చేతులకు, కాళ్లకు దోక్కపోయి నెత్తురొస్తాంది. నోట్లో కుక్కిన గుడ్డం... ఎంత పైశాచికత్వం...

ఒంటరిగా ఆడది వుందని తెలిస్తే ఇంతేనా... గదికేసిన తలుపు తెరుచుకొని. తాగిన మైకంతో పడ్తా లేస్తా బయటకొచ్చినాడు నీలకంఠం జనమంతా చుట్టుకొని వుండారు.

“పాడు నా కొడుకు... పండగపూట సెర్సి సచ్చినాడు... వీడి దూం తగల...” ఎవరో జనంలో తిడతాండరు. ఇంకొందరు ముఖాన ఎంగిన మూస్తాండరు.

బిగుసుకున్న పిడికిలితో నీలకంఠం కడపులో ఒక దెబ్బ పడింది. ‘అమ్మా?’ అంటా బయట అరుగుమీద పడినాడు మళ్ళీ పైకి లేపినాను. ఈసారి దెబ్బ ముఖానికి పడింది. పళ్ళల్లోంచి నెత్తురోస్తాంది. వాడు తాగిన మైకంలోనే ఉండాడు. ఈసారి ఎవరు కొట్టారో తెలీదు గానీ వాడి భుజం నుంచి కూడా రక్తమొగానీ అమ్మ వచ్చి నన్ను పట్టుకొంది “వద్దు నాయనా... యింగవాడ్ని యిడిసిపెట్టు” అని అడ్డుకుంటాంది.

అయినా వాడ్ని విడ్సి పెట్టాలనిపించ లేదు. బహుశా కాంచన మీద నాకున్న అభిమానం కావచ్చు. ఈసారి మళ్ళీ పైకి లేపాను.

కాదుపుకు రోంత కింద మర్మస్థానంలోనే ఒకే ఒక దెబ్బ పడింది.

"అమ్మా!" ప్రాణం పోయేంత బాధతో వాడు అరిచినాడు.

అరుగు మీదనే వాడ్ని పండుకోబెట్టినారు. నన్ను వాడికి దూరంగా లాక్కొని పోయినారు. ఎవరు చూసినా 'దారుణం.. దారుణం' అని అనుకుంటా కాంచన దగ్గరికి పోతావుండరు. పాపం.... కాంచన... ఓంటరిగా!

అనంతమైె ఆకాశానికి, విస్తారమైన సముద్రానికి మధ్య ఇంధ్ర ధనుస్సులా... ఒక మంచు కొండకు, ఒక మండేకొండకు మధ్య వంతెనలా... అలకు అలకు మధ్య అలజడిలోని ఆర్ద్రతలా... రెండు మహా సముద్రాల మధ్య నిర్మించిన వారధిలా... రెండు అగ్ని పర్వతాల మధ్య ప్రవహించే పవిత్రనదిలా ఉండే కాంచన...

వెన్నెల పాట కాంచన...

వెలుగుల పాట కాంచన...

"రాళ్ళు కరిగే వేళ" అంటా దిన్నం పాట లందుకునే కాంచన... నిస్సహాయంగా.. కన్నీటి ప్రవాహం మధ్యలో... గుండె పగిలేలా రోదిస్తూ... ఆ దృశ్యం చూల్లేకపోతున్నాను. ఆమె బిడ్డ ప్రశాంతంగా లక్ష్మి భుజం మీద తలపెట్టు కొని నిద్రపోతావుంది....

"రాళ్ళు కరిగే వేళ ఎన్నెలా

రాగల కోయిల ఎన్నెలా

మూగపోయింది ఎన్నెలా

సంకు రేత్తిరి నాడు ఎన్నెలా

ఊపిరి లేని నిశ్శబ్దం ఎన్నెలా

ఊరు వల్లకాడైంది ఎన్నెలా"

– అని ప్రకృతి పాడతా ఈదురుగాలి వీస్తోంది.

ఇవాళ రాత్రి

కన్నుల్లో కలలు లేవు

కన్నీళ్ళు తప్ప!

# 9

ఉదయాన్నే రచ్చబండ కాడ పంచాయితీ మొదలయ్యింది. గ్రామ పెద్ద పాండురంగారెడ్డి వచ్చి కూర్చొన్నాడు. కాంచన ఇంటికాడ్నే ఊయల కట్టే యాప సెట్టుకు రాత్రంతా కట్టేసిన నీలకంతాన్ని కూడా పంచాయితీకి తీసుకొచ్చినారు.

కాంచన మా ఇంట్లోనే వుండాది. "ఏరా... మీ నాయన ఎట్టా బతికినాడో నీకు తెల్సునా... అట్టాటి మహానుభావుడి కడుపున ఎట్టాటోడివి పుట్టినావురా... గబ్బు నాయాల... యాన్నుంచో మనూరికి వచ్చిన ఆడపిల్లకు దిన్నం సంగటి తింటా వుండావా... ఇప్పుడు ఆ పిల్ల బతుకు ఎట్టానో జెప్పు...." గ్రామపెద్ద నీలకంతాన్ని తిడతా వుండాడు.

"తాగిన మైకంలో చేసిన పొరపాటు పెద్దయ్య...." తలొంచుకొని చెప్పినాడు నీలకంఠం.

"కొడ్తా కొడకా... మెడ్తో... ఒక ఆడపిల్ల బతుకు పాడుచేసి... మళ్ళా మారు మాట్లాడతావా... తాగిన మెకంలో నీ తల్లినో, చెల్లినో పట్టుకుంటావా... చెప్పు... ఆ పిల్ల మీద నీకు ఎప్పుట్నుంచో గురివున్నట్లే ఉంది.... దిక్కులేని పిల్ల జోలికి పోను సిగ్గుందా లేదా...!"

గ్రామపెద్ద మళ్ళీ తిట్టినాడు.

నీలకంఠం తలొంచుకొని నిలబడి ఉండాడు.

"నేను ఈ పంచాయితీని బట్టి ఊరి బహిష్కరం కూడా చేయవచ్చు నీకు. కానీ నాకు మనసొప్పక ఒక తీర్పు ఇస్తాండ. ఆ పిల్లను నువ్వు పెళ్ళి చేస్కోవాల. ఆ పిల్లకు వుండే బిడ్డను కూడా నువ్వే సాకాల. నిన్ను పెళ్ళి చేస్కోవడం ఆ పిల్లకు ఇష్టం లేకపోతే లక్ష రూపాయలు డబ్బు చెల్లించాల. లేదా అంత ఖరీదు భూమినైనా రాసివ్వాల! ఇది నా తీర్పు. ఏమంటావు?" అని గదమాయించి అడిగినాడు నీలకంఠం వైపు కోపంగా చూస్తూ! 'అట్నే' అన్నట్లు తలూపినాడు నీలకంఠం. కాంచన అభిప్రాయం ఏమిటో కనుక్కోమని అమ్మకు చెప్పినాడు గ్రామపెద్ద. అమ్మ కాంచన దగ్గరికి పోయింది.

అమ్మతో పాటూ వెనుక నేను కూడా పోతి. కాంచన ఏడుస్తావుంది. అమ్మ జరిగిన పంచాయితీ తీర్పు అంతా చెప్పింది.

"నాకూ వాడితో పెళ్ళీ వద్దూ... వాడి డబ్బూ వద్దూ... నేను మా ఊరికి వెళ్ళిపోతాను"... అని బిడ్డను ఎత్తుకొని బయలుదేరబోయింది.

అమ్మ ఆపింది. జరిగిందేదో జరిగిపోయింది. "నీకూ ఒక మగతోడు వుంటే బాగుంటాది. పెళ్ళే చేస్కోమ్మా. వాడు ఈసారి పొరపాటు చేస్తే పంచాయితీ వాడ్ని బతకనివ్వదు. ఆలోచించు...."

నాక్కూడా అమ్మ నిర్ణయమే సరైందనిపించింది. పెద్దరెడ్డికి సుట్టుపక్క పల్లెల్లో క్కూడా మంచి పేరుంది. సమస్యంతా నీలకంఠం దగ్గరే ఉంది. వాడు తాగుబోతు. తాగిన మైకంలో కాంచనపైన ఏదైనా ప్రమాదం తలబెడతాడేమోనని నా అనుమానం.

కాంచన మౌనంగా తలొంచుకొని పైట కొంగుతో కన్నీళ్ళు తుడుచు కుంటోంది. "చెప్పమ్మా... నీ అభిప్రాయం ఏందో...." అడిగింది మళ్ళీ అమ్మ.

"మీ ఇష్టమమ్మా!" చెప్పింది.

అమ్మ ఆన్నుంచి పైకి లేచింది

ఇద్దరమూ పంచాయితీ కాడికి వచ్చినాం. సంగతి చెప్పింది అమ్మ. గ్రామపెద్ద కూడా సంతోషించినాడు.

"త్వరలోనే మూహూర్తం పెట్టిస్తా"నని చెప్పినాడు గ్రామపెద్ద.

నీలకంఠం సరేన్నాడు. పంచాయితీ పూర్తయ్యింది.

***

ఈ సంఘటనతో కనుమ పండుగవాతావరణం కూడా పల్లెలో కన్పించ కుండా పోయింది. కాంచన మా ఇంట్లోనే వుంటోంది. వీరబల్లి సంబంధం చూస్కోనిరాను చిన్నాయన పోయివుండాడు. అందరం ఆయన కోసమే ఎదురు చూస్తా వుండాము.

ఇంతలో నీలకంఠం తండ్రి పెద్దిరెడ్డి చిన్నగా నడుసుకుంటా ఇంట్లో కొచ్చినాడు. పెద్దాయన. మంచంవేసి కూర్చోబెట్టినాము. మంచినీళ్లు తాగినాడు. నాయన చనిపోయినాంక ఆయన రావడం ఇదే మొదటిసారి.

"వాడు నాకు పుట్టినందుకు బాధపడుతూ వుండాను. పరువంతా దీసినాడు. ఇట్టాటోడ్ని నేను పుట్టించినానుకుంటాంటేనే అసహ్యం వేస్తాంది. వాడు చేసిన పాయికారి పని చూడు... ఆ అమ్మాయిని చూసిపోదామని వస్తి!" – చెప్పినాడు వణుకుతావుండే స్వరంతో పెద్దరెడ్డి.

అమ్మపోయి కాంచనను తీసుకొచ్చి ఆయన ముందు నిల్చోపెట్టింది.

కాంచన పెద్దయన కాళ్ళకు నమస్కారం చేసింది.

"బంగారమట్ట అమ్మాయి. దేవుడు చూడు ఎట్టాటి రాత రాసినాడో. మనం ఎన్ని కలలు కని వీళ్ళను పుట్టిస్తామో వీళ్ళకు తెలుస్తాందా? నీలకంఠంగాడు ఎప్పుడూ తాగే వుంటాడు. వాడ్ని నువ్వే మనిషితీర్న జెయ్యాల. మనకు దేవుడిచ్చిన కాడికి అదే తిని బతుకుదాం..." చెప్పాడు పెద్దిరెడ్డి.

లోపల్నుంచి బిడ్డ ఏడుపు శబ్దం వినపడగానే కాంచన పరుగు పరుగున లోపలింట్లోకి నడిచింది. పెద్దిపెడ్డి తల పట్టుకొని కూర్చొన్నాడు.

"దీన్నే కదూ... విధి రాత అంటారు"– అన్నాడు అమ్మదిక్కు జూస్తూ.

అమ్మ మౌనంగా నిల్చొని వుంది.

"కులంగాని పిల్ల. ఒక బిడ్డకు తల్లి. నా ఇంటి కోడలవ్వాలని రాసిపెట్టి వుంటే ఎట్లా తప్పించుకుంటాం. ఎట్టా జరగాలని రాసి పెట్టి వుంటే అటే జరగనిలే... కాద నను కానీ ఒక్క మనవి... పెళ్ళి వేడుకగా జరపడం బాగుండదనిపిస్తాంది. ఆ అమ్మాయికి అన్యాయం చేయాలని కాదు. మంగళసూత్రం గుడికాడ కట్టిస్తా. కోడలిగా మనింటికి వస్తే చాలు... మీరేమంటారు?" అని అన్నాడు పెద్దిరెడ్డి

"మేము అనేది ఏముదయ్యా... ఆ అమ్మాయి ఇష్టం"– చెప్పింది అమ్మ.

"మీరు కూడా ఆలోచించండి. మీకు ఎట్లా న్యాయమనిపిస్తే అట్లే చేయండి. నాకు అన్పించినదేదో మీకు చెప్పిన. మీ ఇష్టం... ఆ పిల్ల ఇష్టం..." చెప్పి మళ్ళీ చిన్నగా బయలుదేరినాడు పెద్దిరెడ్డి.

'తోడు రమ్మంటావా అయ్యా...' అని అడిగితి.

'నా ఊర్లో నాకేం తోడురా... నేను పోతాలే' – నవ్వుతా చెప్పినాడు పెద్దిరెడ్డి.

సందుదాంక వదిలి వచ్చినాను.

లక్ష్మి ఎద్దులకు గడ్డి వేస్తాంది.

అమ్మ కాంచనతో మాట్లాడతాంది.

సిన్నాయన వచ్చినాడు.

వసారకాడ్నే కూర్చోబెట్టుకొని జరిగిన సంగతులన్నీ చెప్పినాను.

ఆయన గుండె బరువెక్కింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయి.

‘ఔరా... పాపోడా మిట్టసేనుకాడికి వస్తానే రాజీగాడు జరిగిన విషయాలన్నీ చెప్పినాడు. బాధపడినాను. ఇట్టా జరుగుతాదని ఎవరం అనుకుంటిమి...” సంచి ఆడ్నేపెట్టి ఇంట్లోకి నడ్సినాడు.

సిన్నాయన్ను చూస్తానే కాంచన ఏడుస్తాంది.

“మేమంతా వుండాంలేమ్మా... ఏం కాదు...” గట్టిగా ధైర్యం చెప్పినాడు సిన్నాయన.

అట్నే రోజులు గడిచిపోతావుండాయి.

ఒకరోజు ముహూర్తమేదో కుదిరింది. గ్రామపెద్ద, పెద్దిరెడ్డి, నీలకంఠం ముగ్గురూ కల్సి వచ్చినారు. గంగమ్మ గుడికాడ్నె మూడు ముళ్ళు వేయించినారు కాంచన మెడలో ఊర్లో ఎవరికీ తెలీకుండానే పెళ్ళి జరిపించేసినారు. బిడ్డను ఎత్తుకొని కాంచన పెద్దిరెడ్డి ఇంటికి వెళ్ళిపోయింది కోడలిగా!

***

కాంచన పోయిన తర్వాత–

అమెతోపాటు వెన్నెలపాట కూడా వెళ్ళి పోయింది. నీలకంఠంతో పెళ్ళి అయినాంక ఆమె గొంతు విప్పి మాట్లాడింది కూడా చాలా తక్కువ. ఎప్పుడూ నాలుగు గోడల మధ్యనే వుండేది. తాగుబోతు భర్తతో అలాగే నెట్టుకొచ్చేది. ఎప్పుడైనా పొరపాటున కన్పిస్తే చూపుల్తోనే మాట్లాడేది. కనురెప్పల మాటున దాచలేని భావాలెన్నో దాగి వున్నాయి చూపుల్లోనే. చూపులు కూడా నటిస్తాయి.... కొన్నిసార్లు చూస్తున్నట్లు... మరికొన్నిసార్లు చూసినాచూడనట్లు... చూసీ రాలిపోయినట్లు... వేచి విసిగిపోయినట్లు... చూడకుండా కనుపాపల్లో దాక్కోవడమై చూపులకు తెలుసు... చూపులు శూన్యాన్ని కూడా కొలుస్తాయి.

***

వీరబల్లి సంబంధం గురించి సిన్నాయన సంగతులన్నీ చెప్పినాడు అబ్బి మంచి పిల్లోడు పేరు క్రిష్ణారెడ్డి. తండ్రి మాధవరెడ్డి. ఊర్లో పలుకుబడి వుండేటోళ్ళు. ఇద్దరు ఆడపిల్లలు కూడా వుండారు. పెద్దోడు క్రిష్ణారెడ్డే. ఆడపిల్లలిద్దకీ పెళ్ళిళ్ళు అయినాయి. క్రిష్ణారెడ్డికి సంబంధాలు చూస్తా వుండారు తెల్సినోళ్ళ కాడ కూడా ఆ కుటుంబం గురించి విచారిస్తి. అందరూ మంచిగానే చెప్తాండరు. అయితే ఆ కుటుంబంమద ఒక మచ్చ వుండాది. క్రిష్ణారెడ్డి చిన్న చెల్లెలు ఆడయాడో పట్నంలో సదువుకునేటప్పుడు వురే కులానికి చెందిన డేవిడ్ అనేటోడ్ని ప్రేమించిందట. నీ

సదువు వద్దు... పాడూ వద్దు.. అని మాధవరెడ్డి బలవంతంగా ఆ పిల్లను సదువు మాన్పించినాడు. అయినా ఆ పిల్ల ఆ డేవిడ్‌గాడినే కలవరిస్తా వున్నింది. అట్నే జ్వరంతో నెలన్నర మంచంలోనూ పడింది. అయినా మాధవరెడ్డి ఒప్పుకోలేదు.

ప్రేమా... గీమా అని నా దగ్గర చెప్ప కండని తెగేసి చెప్పినాడు మాధవరెడ్డి. ఆ పిల్లకు ఎవర్తోనేనా పెళ్ళి చేస్తే యింగ ఆ డేవిడ్‌ను మర్చిపోతాదని అనుకున్నాడు. అదే తడవుగా కోడూరు ప్రభాకరరెడ్డి కొడుకు ఆనందరెడ్డికిచ్చి నిశ్చితార్థం జరిపించినాడు.

ఆనందరెడ్డి పేరుమీద కోడూర్లో ఆకుతోటలుండాయి. ఆదాయం వచ్చేవ్యాపారం. ఒక్కగానొక్క కొడుకు. అందుకే రోంత పథకం ప్రకారం ఆ పిల్ల మనసు మార్చి సంబంధం కుదుర్చినాడు. బంధువులు కూడా సంతోషించినారు. పెళ్లికి పత్రికలు పంచే కార్యక్రమం జరుగుతాంది. ఆ పిల్లకూడా పెండ్లి పత్రికలు పంచతావున్నింది. తన సదువుకునే కాలేజీలో కూడా పత్రికలు పంచిరాను పట్నానికి పోయింది. పోయిందేగానీ మళ్లీ తిరిగి రాలేదు. పత్రికలో వేయించిన ముహూర్తానికే అదేరోజు పట్నంలోని చర్చిలో డేవిడ్‌ని పెళ్ళి చేసుకొంది. పెండ్లి పత్రికలు పంచనుపోయి ఇష్టపడిన మనిషిని పెళ్ళి చేసుకునింది ఆ పిల్ల ఈ రకంగా!

మాధవరెడ్డి మండిపడినాడు. పరువంతా మంటగలిపిందని ఆ పిల్లను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టినాడు. ఆ రోజు నుంచి ఈ రోజువరకు ఆ పిల్లకు వీళ్ళ కుటుంబానికి మధ్య మాటలు కూడా లేదు. కానీ... ఆ పిల్ల అభిప్రాయమే నిజమయ్యింది. మొగుడు డేవిడ్ మంచి స్థితిలో వుండాడు. తనను నమ్మివచ్చిన పిల్లను పువ్వుల్లో పెట్టుకొని చూస్కొంటూ వుండాడు. మంచి అత్తా, మామ కూడా ఆ పిల్లలకు. ఆ పిల్ల చేసింది తప్పు ఏముంది?

అయినా పల్లెల్లో బతికిన మొరటు మనిషి మాధవరెడ్డికి అంత విశాల హృదయం యాన్నుంచి వస్తాది? ఈ కుటుంబం గురించి విచారిస్తాంటే ఈ విషయం చెప్పినారు అని సిన్నాయన చెప్పినాడు.

ఓ రోజు నేనూ, అమ్మ, సిన్నాయనా ముగ్గురమూ వీరబల్లికి పోయి క్రిష్ణారెడ్డిని చూసిరావాలని బయలుదేరినాం. ఇంటికాడ లక్ష్మికి తోడుగా గువ్వల చెరువుకాన్నించి రాజమ్మవ్వను పిలిపించినాం.

సగం దావలోకి పోయినాంక ఆంజనేయులు ఎదురొచ్చినాడు. బండలాగుడు పోటీలు జరుగుతాయని చెప్పాడు. మంచి వార్తనే విన్పించినాడు. సంతోషపడ్తిమి. కొంత పక్కకు తోడ్కొనిపోయినాడు. ఎర్రకొయ్య కొట్టేటోళ్ళను పోలీసులు వెతుకు

తుండారని చెప్పినాడు. జాగ్రత్తగా వుండ మని కూడా సలహా ఇచ్చినాడు. మొన్న రాత్రి అరణ్యంలో ఇస్మాయిల్‌తో మాట్లాడినాను. పెండ్లికి సాయం చేస్తాననే అన్నాడు. మరి నిజంగా చేస్తాడో... లేదో అని చెప్పినాడు ఆంజనేయులు.

ఎర్రకొయ్యను కొట్టేవాళ్ళకోసం పోలీసులు వెతుకుతా వుంతారని తెలియంగానే నాతో భయం పట్టుకుంది. అయినా ధైర్యంగానే వున్నట్లు కనపడతా ఆంజనేయుల్ని పంపించినాను.

వీరబల్లికి పోయినాంగానీ క్రిష్ణారెడ్డి ఇంటికాడ లేడు. సదువు పనిమీద పట్నానికి పోయినాడని చెప్పినారు. వాళ్ళ నాయన మాధవరెడ్డితో మాట్లాడినాం. ఇల్లు చూసినాం. పాతమిద్దె. ఒకప్పుడు బాగా బతికిన కుటుంబమని అర్థమైతాంది. మాధవరెడ్డి భార్య సుశీలమ్మ. మూగిమనిషి. మాటలు రావు. అయినా చేతులు తిప్పితిప్పి సైగలు చేస్తాది. ఆమె భాష ఇంట్లో అందరూ బాగానే అర్థం చేస్కుంటా వుండారు. మాధవరెడ్డికి వచ్చిన ఆస్తులన్నీ ఆమె ద్వారా వచ్చినవే. ఆస్తులకు ఆశపడే మూగి అయినా ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. మరి ఆమె భాషను లక్ష్మి అర్థం చేస్కోగలుగుతుందో... లేదో... అనిపించింది. మేమింట్లో వుండగానే పట్నానికి పోయిన క్రిష్ణారెడ్డి కూడా దిగినాడు. చూస్తిమి పిల్లోడ్ని. 'బాగానే వుండాడు' అనింది అమ్మ.

లక్ష్మిని చూడను వాళ్ళను కూడా రమ్మని చెప్పి ఆన్నుంచి బయలు దేరినాం.

***

పుష్పగిరిలో జరిగే బండలాగుడు పోటీలకు ఎద్దుల్ని సిద్ధం చేసుకుంటిమి. ఆంజనేయులు కూడా వస్తానని చెప్పినాడు. పుష్పగిరిలో శ్రీలక్ష్మి చెన్నకేశవ వైద్యనాథేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జరుపుతా వుండారు. అందుకోసమే ఆడ బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రేనాటి చోళుల కాలంలో కట్టిన ఆలయమే అక్కడుండేది.

తెల్లారింతర్వాత నేనూ, ఆంజనేయులూ ఇద్దరమూ పుష్పగిరికి బయలు దేరినాం.

సిన్నాయనకు జ్వరమొస్తాంటే నేనే వద్దని చెప్తి. ఆయనేమో 'ఏమైతాది... వస్తాననే' అన్నాడు అమ్మ కూడా వద్దని చెప్పడంతో బలవంతంగా ఇంటికాడ్నే నిలబడినాడు. సిన్నాయన తోడు లేకుండా బండలాగుడు పోటీలకు పోవడం ఇదే మొదటిసారి.

పుష్పగిరి....

పినాకిని తీరానుండే చిన్న గ్రామం.

దీన్ని 'పంచనది సంగమం' అని కూడా పిలుస్తారు. పాపాఘ్ని, కుందూ, వల్కల, మాండవ్య నదులన్నీ ఈ పెన్నా నదిలోనే సంగమిస్తాయి. ఈ నది మా ప్రాణం. మా జీవం. ఇది ఎండిపోతానే మా భూములకు జీవం పోయింది....

ఇక్కడే నది వుండేది.

వాగులు... వంకలు... నీటి సవ్వడులతో అలా అలా ముందుకు సాగుతూ...

గలగలా పారే పాటల దరువులా... పంట పొలాల్లో పల్లవించేది. పచ్చని విశ్వరూపం చూపించేది. అమ్మ... మన పెన్నమ్మ... పెన్నానది. బీడు భూములకు ప్రాణం పోసేది. రైతు జీవితాలతో మమేకం అయ్యేది. కష్టాల కన్నీళ్ళను తుడిచేది. రైతుల ఆశల.... ఆకాంక్షలు అన్నీ ఆ పినాకిని తల్లే.

ఏదీ... యాడుంది... ఎండిపోయి... కనుమరుగైంది!

పుష్పగిరికి చేరుకున్నాము. రంగరంగ వైభవంగా ఆలయాన్ని అలంకరించి వుండారు. చుట్టూ కొండలు, కోనలు, ప్రకృతి సౌందర్యం, ప్రశాంత వాతావర ణంలో చెన్నకేశవ స్వామి ఆలయం... ఎద్దుల్ని ఊర్లోనే కట్టేసి దైవదర్శనం చేసుకొని వచ్చినాం.

గుడినుంచి వస్తాంటే దావలో పోతిరెడ్డి పల్లె సదాశివారెడ్డి కన్పించినాడు. నవ్వుతా నేనే పలుకరించాను.

"పోటీకి వచ్చినావా...?" అడిగినాడు.

ఔనని అన్నాను.

నవ్వి ముందుకెళ్ళిపోయినాడు.

అక్కడే యేటి గట్టున కొద్దిసేపు తిరిగి పోటీలు జరిగే ప్రదేశానికి చేరుకున్నాం. చుట్టుపక్కవుండే పల్లెల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు.

ముందుగా ఉప్పలపాడు ఎద్దులు రంగంలోకి దిగినాయి. పదైదు నిమిషాలకు ఐదు రౌండ్లు వేసినాయి.

తర్వాత నందలూరు ఎద్దులు ముందుకొచ్చినాయి. అవి కూడా ఐదు రౌండ్లకే వెను తిరిగినాయి. వాటి తర్వాత పొద్దుటూరు సబ్బరాజు ఎద్దులు ఆరు రౌండ్లు వేసినాయి.

జనం వేసే ఈలలతో ఆ ప్రదేశమంతా దద్దరిల్లి పోతాంది.

ఇంతలో దైవదర్శనం చేసుకొని సదాశివరెడ్డి కూడా ఆడికి జేరుకున్నాడు.

తన ఎద్దుల్ని సిద్ధం జేసుకుంటా వుండాడు. తర్వాత నా ఎద్దుల వంతు వచ్చింది.

బండను లాగడం మొదలైంది. పరిస్థితి మధ్యలోనే అర్థమైంది. ఎద్దులు లాగలేక పోతావుండాయి. ఆంజనేయులు వలపట ఎద్దు దిక్కు నిలబడి కేకల వేస్తావుండాడు.

ఎద్దులు కష్టపడతావుండాయి.

లాభం లేదు... ఏడవ రౌండ్ అయితానే ఎద్దులు నిలబడి పోయినాయి.

సదాశివరెడ్డి నవ్వుతావుండాడు. తర్వాత తన ఎద్దులతో రంగంలోకి దిగినాడు చూస్తాండగానే బరువు కాకుండా ఐదు రౌండ్లు పూర్తయినాయి. అదే ఊపులో ఆరు... ఏడు... ఎనిమిది రౌండ్లు పూర్తి చేసినాయి. పోతిరెడ్డి పల్లె ఎద్దులు మొదటి స్థానంలో నెగ్గినట్లు నిర్వాహకులు ప్రకటించినారు. రెండవ స్థానంలో వచ్చినాయి నా ఎద్దులు. మొదటి స్థానం నుంచి రెండవ స్థానంలోకి పడిపోవడం ఇదే మొదటి సారి. అయినా వలపట ఎద్దుకు లేసిన కురుపు సలుపుతానే వుంది దానికి. ముందుకు కదలడమే కష్టంగా వుంది.

మొదటి బహుమతి కింద పదివేల నూట పదార్లు తీసుకొని మీసం తిప్పి నాడు. సదాశివారెడ్డి. జనం ఆనందంతో కేకలు వేస్తావుండారు. రెండవ బహుమతి కింద ఐదువేల నూటాపదార్లు ఇచ్చారు. ఆంజనేయులు పోయి తీసుకొని వచ్చినాడు. బయలుదేరబోతూ వుండగా సదాశివారెడ్డి మా ఎద్దుల దగ్గరికి వచ్చినాడు.

"మీ చిన్నాయన బాగుండాడా..." అని అడిగినాడు.

"లేదు... జ్వరం వస్తాంటే మేమే వచ్చినాం..." జవాబిచ్చాను.

"ఏంది... సంగతి" అడిగినాడు సదాశివారెడ్డి.

"ఎద్దుల్ని అమ్మాలనుకుంటా వుండాము. నువ్వు తీసుకుంటావేమో చెప్పు"– అని అడిగితి.

"నువ్వు చెప్పేది నిజమేనా?" – అనుమానంగా నా వైపు చూస్తా అన్నాడు.

"నిజమే.... ఇష్టమైతే చెప్పు" – మళ్ళీ అన్నాను.

"ఎంత కమ్ముతావు?"

రెండూ కలిపి అరవై వేలు" – చెప్పాను.

"మాట తప్పకూడదు..." – సూటిగా నా కళ్ళల్లోకి చూస్తా అడిగినాడు.

"చాతనైతే డబ్బులు పెట్టి ఆ మాటఅను" – సూటిగానే జవాబిచ్చాను.

"ఇదిగో పదివేలు... ఒప్పందం కింద దీన్ని వుంచు... నాల్గురోజుల్లో యాభై వేలు మీ ఊరికొచ్చి డబ్బిచ్చి తోలుకపోతాను. అని చెప్పి పందెంలో వాళ్ళు గెల్చిన ఆ డబ్బును నా చేతిలో పెట్టి వెళ్ళిపోయినాడు. ఆంజనేయులు నావైపు చూస్తావుండాడు – ఆశ్చర్యంగా!

అక్కడ్నుంచి బయలు దేరాం ఊరికి.

***

"మనసులేని మనుషుల కంటే మనసుండే మూగ జీవాలే మంచివిరా..." అమ్మ ఎద్దుల మీది అభిమానంతో అంటాంది.

"వుండనీలేమ్మా....! ఆ వలపట ఎద్దుకు కురుపు కూడా మానడం లేదు. ఎంతకాలమని చూడాలి. ఈ ఎద్దుల పోషణ సాధ్యం యాడ అయితాది? కనీసం మనం అమ్మేస్తే వాళ్ళు అయినా వీటి మంచి చెడు బాగా సూస్కుంటారు. ఈ డబ్బు వుంటే లక్ష్మి పెళ్లికి ఉపయోగపడ్తాది"... అరుగు మీద కూర్చోని నా మనసులోని మాట చెబ్తి.

ఇంతలో నీళ్ళకు పోయిన లక్ష్మి ఇంట్లోకి వచ్చింది. ఖాళీ బిందెలు... నీళ్ళు ఎక్కడా రావడం లేదు. రచ్చబండ దగ్గరుండే బోరు పని చేయడం మానేసింది. పైన సందుచివరుండే బోర్లోనూ నీళ్ళు లేవు.

నేనూ, చిన్నాయన చెరి రెండు బిందెలు తీసుకొని నీళ్ళ వేటకు బయలు దేరినాం. తిరగడమే తప్ప ఎక్కడా సుక్కనీళ్ల జాడ కన్పించలేదు.

ఎంత ఎండలొచ్చినా రచ్చబండ దగ్గరి బోర్లో నీళ్ళుండేవి. ఇప్పుడు అది కూడా ఎండిపోయింది. ఇంకేముంది... ఊరి బయటుండే గంగమ్మ దేవళం కాడుండే రాతి బావి దగ్గరికెళ్లి నీళ్ళు తెచ్చేసరికే బాగా అలసిపోయాం.

***

ఊర్లో తాగడానికి కూడా మంచి నీళ్ళులేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఊరిని ఆనుకొని ప్రవహించే అమ్మ... మన పెన్నమ్మ.... తల్లి వట్టిపోయింది. గలగలల సవ్వడి లేదు....

కలకలలాడే కాంతీ లేదు... మనిషిలోని కల్మషానికి జంకి ఆ తల్లి ఇసుక రేణువుల్లోకి యింకిపోయింది... పోయింది... తనతోపాటూ ఈ నేల నాగరికతనూ తన వెంట పెట్టుకొని పోయింది...

తల్లి పెన్నమ్మ... నదీమతల్లి... మాలో మమేకమైన నది... జీవనది కాక పోయినా మా జీవనం కోసం... మా జీవితాల్లో వెలుగుల్ని పూయించడంకోసం మా గడ్డను పునీతం చేస్తూ సాగేది. పడమర నుంచి తూర్పుకు... ఉపనదుల్ని, వాగుల్ని... వంకల్ని కలుపుకుంటూ ఒక ప్రవాహమై సాగేది.

కొండాపురం దగ్గరి ఇరుకైన గుట్టలను చీల్చుకొని గండికి చేరేది.. అన్నుంచి ప్రొద్దుటూరు, కమలాపురం, చెన్నూరు, కడప, సిద్ధవటం మీదుగా రైతుల గొంతుల్ని, భూముల్ని పండిస్తూ తడుపుతూ... సోమశిల చేరేది. ఆ పినాకిని తల్లి ఎండి పోయింది. మాకు ఏడుపును మిగిల్చి కరిగిపోయింది.

నందికొండకు ఉత్తరంగా – స్కందగిరి కొండల్లో పుట్టి గాలివీడు ఆది నిమ్మాయి పల్లెకాడ పెన్నమ్మలో కలిసే ఉపనది పాపాఘ్ని. ఏదీ ఆ తల్లీ ఎండి పోయింది.

నంది కొండల్లోనే పుట్టి ముచ్చుకోట కాడ పాలకొండల మధ్యనుంచి పార్నపల్లె లోయకు చేరి జమ్మల మడుగు దగ్గరి వెంకయ్య కాలువను తాకి గండ్లూరు దిగువన పెన్నమ్మతో చేతులు కలిపే చిత్రావతి తల్లీ ఏమైంది... రైతుమీద అలిగి ఇటు రావడమే మానుకుంది.

బుక్కాపురం ఎర్రమల కొండల్లో పుట్టి సగజారు పల్లెకు ఆగ్నేయ దిశలో పెన్నమ్మను చేరే కందూ కనుమరుగై మమ్మల్ని కష్టాల పాలు జేసింది. ఆ తల్లికి మా మీద దయయాడిది?

అదో నల్లమల కొండల్లో గిద్దలూరు కాడపుట్టి నల్లమల కొండల్లో గిద్దలూరు కాడపుట్టి తంబళ్ళ పల్లె కాన్నుంచి చెంగు చెంగున దూకుతా వచ్చి సిద్ధవటం కాడ పెన్నమ్మను చేరే సగిలేరు ఏమైంది? నిన్ను నమ్ముకొని బతికేటోళ్ళం కదా నదీ మతల్లి మా మీద నీకు కోపమెందుకో చెప్పు? నీ మనసులోని మర్మం ఏమిటో విప్పు!

కర్నాటకంలోని కోలారుకాడ పుట్టి రాయవరపు దిగువుండే పింఛాలో కల్సి అన్నుంచి చెయ్యేరుకు చేరే తల్లి బాహుదా ఎందుకు పగపట్టివి తల్లి... రైతు చేసిన నేరమేమి... రైతు చేసిన పాపమేమి?

కొండలు... గుట్టలు చీల్చుకొని వాగులు... వంకలు... ఉపనదులతో గలగలలు పారే ప్రవాహమయ్యే పెన్నమ్మ... నీ ఆనవాళ్ళు ఏవమ్మ? నీ అడుగు జాడలు ఏవమ్మ...

"ఊర్లూ... పల్లె... నీటికోసం అల్లాడి పోతావుండాయి. నమ్ముకున్న నది నట్టేట ముంచింది. నడియేట్లో ఎర్రమట్టి సుళ్ళు తిరుగుతావుండాది. సుడిగాలులు దుమ్ము కొట్టుకుంటా పైకి లేస్తాండయి. ఎండలు ముదిరేకొద్ది ఊర్లోని బావులు కూడా ఎండిపోవడం మొదలు పెట్టినాయి.

చినుకుల తడికోసం ఆకాశానికేసి చూసే వాళ్ళకు ఆకాశం అంతు కూడా దొరకడం లేదు. నల్లమబ్బు మోడాలు... పట్టిందీ లేదు. చినుకు కురిసిందీ లేదు. ఆకాశం ఒట్టిపోయింది. కానీ మా ఆశలే... శ్వాసగా మార్చి ఎదురుచూస్తావుండాము.

## 10

**చు**ట్టుపక్క నూట పదారు పల్లెలవాళ్లు వానల కోసం దేవర్లు చేయాలని నిర్ణయించినారు. నమ్ముకున్న నది మోసం చేశాక... నమ్ముకున్న ఆకాశం ముఖం తిప్పుకున్నాక... కుర్వాల్సిన నల్లమబ్బు మోడాలు రాజ్యమిడిసి పోయినాక... మనిషి దేవర్లు తప్ప ఏం చేయగలడు?

ఎన్ని కరువులొచ్చినా... ఎంత ఎండ కురిసినా గంగమ్మ తల్లి దేవళం కాడుండే రాతిబావిలో మాత్రం నీళ్ళు వుంటాండయి. యిప్పుడు సుట్టు పక్కల నూటాపదారు పల్లెలోళ్లకు ఆ బావినీళ్ళే దిక్కు అయ్యాయి. ఎంతెంత దూరం నుంచో ఆ బావికాడికొచ్చి నీళ్ళు తీసుకొని పోతావుండారు.

ఆ తల్లి ఆ గంగమ్మతల్లి దయ పెడతాంది. ఆ తల్లి దీవెనలతో, ఆ తల్లి మహిమతో, ఆ తల్లి శక్తితో నీళ్ళు రాతి బావిలో నిలబడి వుండాయి.

అందుకే ఆ గంగమ్మ తల్లికి దేవరచేయాల... నీళ్ళు... నీళ్ళు నీళ్ళు... గుక్కెడు నీళ్ళు... ఎంతకష్ట మొచ్చింది? గంగమ్మ తల్లీ కాపాడు.... నువ్వే కాపాడాలమ్మ తల్లీ... ఇదిగో చేస్తాండం దేవర.... దేవర... జనమంతా ఏకమైనారు. 'ముందు కడవ సాంగెం జరపాల... అప్పుడే ఆ తల్లి కనికరిస్తాది...." చెప్పినాడు నరసింహులు.

ఊర్లో దక్షిణం వైపునే వుండాది గంగమ్మ దేవళం. దానికి రోంత ఏటి గట్టున రాతి బావి ఉంది. అక్కడే కడవ సాంగెం చేయాలని నిర్ణయించినట్లు చుట్టు పక్క పల్లెల్లో దండోరా వేయించినారు.

ఎవరికీ పూనకం పూనలేదు.

నిలబెట్టిన ఆవు కూడా రోన్ని కూడా ఉచ్చలు పోయకుండా శిల లాగా అట్నే నిలబడి పోవడంతో జనమంతా నిరాశ పడినారు. ఇప్పుడు కడవ సాంగెం మీదనే అందరూ ఆశలు పెట్టుకొని వుండారు.

గంగమ్మ దేవళంలో కసువులు కొట్టినారు. పేడతో లోపల అలికినారు. ముగ్గులేసినారు. మామిడాకుల తోరణాలు కట్టినారు. గంగమ్మ తల్లికి కొత్త గాజులు తొడిగినారు. కళ్ళు, కోరలు వెండివి అనుర్చినారు. చుట్టూ యాపాకు పర్చినారు. ఆ తల్లి మెర్సిపోతాంది.

అలవి కాని జనం దేవళం చుట్టూ చేరినారు.

'గంగమ్మ తల్లి దేవర... గంగమ్మ తల్లి దేవర...

గరడ సేవల మీద గంగమ్మ దేవర...

కరుణించు మా తల్లి గంగమ్మ

కురిపించు మా తల్లి గంగమ్మ'

పలకలు మోగుతా వుండాయి. కొమ్ములు ఊదుతా వుండారు. జీవాలు తెగుతా వుండాయి. ఆ తల్లికి పూజలుచేస్తా వుండారు. పసుపు కుంకాలు జల్లుతా వుండారు. మాదిగోళ్ల తప్పెట్లు జెగ్గినక తొక్కుతాండయి. గరుడ సేవల మీద గంగమ్మ దేవర...

నరసింహులు మంత్రాలేవో గట్టిగా పలుకుతా దేవళంలోంచి బయటకు వచ్చినాడు. హారతి. ఇచ్చినాడు– ఆడ్నే నిలబడి ఉండే జనానికి. ఇంతలో ఎవరో కొత్త కుండ తీసుకొచ్చి నరసింహులుకు అందిచ్చినారు. దాని కంఠానికి వేప ఈనెలు కట్టినారు. ఆ ఉత్త ఖాళీ కుండను తీసుకొని నెత్తిన పెట్టుకొని గంగమ్మ దేవళం చుట్టూ మూడుసార్లు తిరిగి కుండకు పసుపు కుంకాలతో పూజలు చేసినాడు. మళ్లా తీసుకొని కుండ నెత్తిన పెట్టుకొని రాతి బావి కాడికి బయలుదేరినాడు నరసింహులు.

జనమంతా కూడా రాతిబావి కాడికి పరుగు పెట్టినారు.

కుండ నిండా తొనకకుండా నీళ్ళు తీసుకొని బయటికి వచ్చినాడు. దాన్ని మళ్లీ నెత్తిమీద పెట్టుకొని గంగమ్మ దేవళంచుట్టూ మూడుసార్లు తిరిగి ఆ తల్లి ఎదురుగా వేసిన ముగ్గు మధ్యన కుండను నిలబెట్టినాడు. బయట జోరుగా పలకలు మోగుతానే వుండాయి. జీవాల తలలు తెగి పడతానే వుండాయి.

ఆడోళ్లు కొంతమంది దాని చుట్టూ చేరి పాటలు ఎత్తుకున్నారు.

'గంగమ్మ తల్లి దేవర...

గరడ సేవల మీద గంగమ్మ తల్లి దేవర

వానల్ని కురిపించు గంగమ్మ తల్లి

కష్టాల్ని తొలగించు గంగమ్మ తల్లి....'

కీసు గొంతుతో వాళ్ళు పాడే పాటనే జనమందరూ అందుకొని పాడతాందరు. బోనాలు పట్టినోళ్లు ఆ మెతుకుల్ని గంగమ్మ కుంకంతో కలిపి ఎదజల్లుతాందరు... జంతువును నరికిన తర్వాత దాని ముంగాలును నరికి దాని నోట్లోనే అడ్డంగా పెట్టిన జీవాల తలలు దాని గంగమ్మ దేవళం ముందర కుప్పలు కుప్పలుగా వుండాయి.

జనమందరి దృష్టి గంగమ్మకు ఎదురుగా పెట్టిన కుండపైనే వుంది.

నేనూ, ఆంజనేయులూ, సిన్నాయనా అందరం ముందు నిలబడి ఉత్సాహం కొద్దీ చూస్తావుండాము.న

ఆడోళ్లు నిలబడిన దిక్కున కాంచన కూడా నిలబడి ఉంది.నన్ను చూసిందో... లేదో... మరి... చూసీ... చూడనట్లుందో...!

గంగమ్మ తల్లికి ఎదురుగా పెట్టిన కుండ చిన్నగా తిరగడం మొదలు పెట్టింది. దాంట్లోంచి ఆ కుదుపులకు ఎన్ని నీళ్ళు బయటకు పడిపోతాయో దాన్ని బట్టి ఎంత వర్షం కురుస్తాదో అంచనా వేస్తారు.

కుండ తిరగడం ఆగిపోయింది. నిండు కుండ నీళ్లు ఎట్లా తెచ్చినవి అట్లే వుండాయి.

నరసింహులు మంత్రాలు చదవడం ప్రారంభించాడు. ఒక చేత్తో కుంకుమ చల్లుతా మరో చేత్తో హారతిచ్చాడు గంగమ్మకు. కుండ తిరగడం మొదలు పెట్టింది. మళ్లీ అందర్లో ఆసక్తి పెరిగి పోతాంది. కుండ నుంచి నీళ్లు బయట పడలేదు. రొంత సేపటికి తిరగడం ఆగిపోయింది. నరసింహులు నుదుటికి చమటలు పట్టి వుండాయి.

'తల్లీ గంగమ్మ... కనికరించు తల్లీ...' జనంల్లోంచి ఎవరో గట్టిగా అర్సినారు.

నరసింహులు ఏదో పురమాయించినాడు. మేకపిల్లను దేవళంలోకి తెచ్చినారు. గంగమ్మకు పూజలు చేస్తానే వుండారు. మేకపిల్ల మెడకు యాపాకు కట్టి వుండారు. పసుపు కుంకాలతో గంగమ్మకు పూజ చేసిన కుంకం ఎదురుకొని పిడికిలికి తీసుకొని మేక పిల్లకు పట్టిచ్చినారు.

అది మొత్తుకుంటా వుండాది.

బయట కొమ్ములు, పలకలు మోగిపోతా వుండాయి. నరసింహులు మేకపిల్ల గొంతును నోటికి కర్సుకున్నాడు. అది మొత్తుకుంటాంది. అట్నే రొంతసేపు తనకలాడి..... తనకలాడి ప్రాణాలు విడిచింది.

నోటి నిండాకు రక్తంతో నర్సింహులు ఉగ్రుడై వుండాడు. స్పృహ తప్పి పడిపోతావుండాడు. అట్నే నిలదొక్కకొని మంత్రాలు సదువుతాండడు తడబడతానే.

కుండ మళ్లీ తిరగడం మొదలు పెట్టింది. నిండుకుండ ఎట్టుండేది అట్నే వుండాది. నీళ్ళు పడ్డం లేదు.

అందుర్లో నిరాశ, నిస్పృహ. విసుగు.

బయట ఎవరికో గంగమ్మ పూనింది. యాపాకు తీసుకొని కొట్టుకుంటాంది. గట్టిగా మొత్తుకుంటాంది. కేకలేస్తాంది.

నరసింహులు కూడా దేవళంలో పూజ ఆపి బయటికి వచ్చినాడు.

కుమ్మరపల్లె సుబ్బమ్మకు గంగమ్మ పూనింది.

"ఏం తల్లీ యింగా నువ్వు శాంతించ లేదా? ఏం జెయ్యాల తల్లీ... నీ బిడ్డలం సల్లంగా చూడాల్సింది నువ్వే తల్లీ... పంటలు ఎండిపోయినాయి. యాడేగానీ సుక్క నీళ్ళు కూడా లేకుండా పోతాండయి... జూడు తల్లీ ఈ వినాశనం..." గుండె బాదుకుంటా చెప్పినాడు నరసింహులు.

"వినాశనం... విలయం... ప్రళయం... వస్తాది... వస్తాది...ఎందుకు రాగూ దదు...? చెప్పండి... యాడుండాడు మనిషి...? కులాలు, మతాలు,కుతంత్రాలు, స్వార్థం, మోసాలు, పాపాలు ఎన్ని... ఎన్నెన్ని... మనిషి యాడుండాడు? సావండి.... పోండి, థూ తలిగించుకొని పోండి..." శపిస్తాంది ఉగ్రమై గంగమ్మ పూనిన తల్లి.

"తల్లీ... శాంతించు... నీ బిడ్డలం... పొరాపాట్లు జరిగివుంటాయి... మన్నించాల... శాంతించు..." అంటానే ఎందురుగా దున్నపోతును పెట్టి నరికించి నాడు నరసింహులు.

నెత్తురు దేవళం లోపలికి కూడా చిమ్మింది ఆ తల్లి పూనిక శాంతించి నట్లుంది.

దేవళంలో గంగమ్మకు ఎదురుగా పెట్టిన కుండలోని నీళ్లు కొన్ని ఎగిరి నేల మీద పడ్డాయి.

ఆ తల్లి పలుకుతాంది... మళ్లీ..

"లోకమంతా పచ్చగా వుండాలనేదే నేను కోరుకునేది. మీ మనుషుల మధ్య ఏర్పడే దూరం చూస్తే బాధ ఏస్తాంది? కల్సి వుండండి... మీరందరూ మనుషులుగా వుండండి... హృదయాలు పెట్టుకొని బతకండి... ప్రకృతి మీకు తోడుగా వుంటాది... మోడాలే వచ్చి మీరు పిల్సినప్పుడు వానల్ని కురిపించిపోయే రోజులు వచ్చేంత గొప్పగా జీవించండి... జీవించడి..." పూనకం పట్టిన సుబ్బమ్మ కుప్ప కూలిపోయింది.

దేవళంలో పెట్టిన కుండలోని నీళ్లు సగానికి పైగా నేల మీదకు ఎగిరి పడినాయి.

జనంలో సందడి... ఉత్సాహం... సంబరం... ఆనందం అంబరాన్ని తాకుతోంది.

"తెల్సుకుంటే సత్యమిది

తల్సుకుంటే సాధ్యమది" – చెప్పినాడు నర్సింహులు.

కొమ్ముల శబ్దాలు, తప్పెట పలకల మోగుతానే వుండాయి. చీకటైతాంటే ఎవరికి వాళ్ళు జనమంతా ఆన్నుంచి బయలుదేరినారు.

***

ఉదయం పోతిరెడ్డిపల్లె కాన్నుంచి సదాశివరెడ్డి యాభైవేలు డబ్బు తీసుకొని వచ్చినాడు. డబ్బులు సిన్నాయన చేతికి యిచ్చినాడు.

అమ్మ లోన ఇంట్లో ఏడుస్తాంది.

లక్ష్మి వసారాలో స్తంభానికి అనుకొని పైటకొంగుతో కన్నీళ్ళు తుడుసు కుంటాంది.

ఎద్దులు మా కుటుంబంలో భాగంగానే వుంటూ వచ్చినాయి. వాటికి ఏరోజు తక్కువ చేసింది లేదు. మాకు ఎన్ని బాధలున్నా... కష్టాలున్నా వాటిని నిర్లక్ష్యంగా వదిలేసింది కూడా ఎప్పుడూ లేదు.

అయినా ఏం జేసేది...

పచ్చగడ్డి యాడుంది? దాన్లకు ఆహారం యాడ్నుంచి తెచ్చిపెట్టాల...?

చిన్నాయన నన్నే పోయి గాట్లో కట్టేసిన ఎద్దుల్ని చూపించమన్నాడు... బాధగా.

దాన్లమీద పెంచుకున్న ఆప్యాయత అనురాగాలు నిజానికి నన్ను కూడా కట్టేస్తున్నాయి.

ఉండబట్టలేక ఏడ్చేశాను.

సదాశివరెడ్డి ఓదార్చాడు. "నువ్వు కూడా రావద్దులే... ఆన్నుంచి అట్నే నేనే తీసుకెళ్తా" అని చెప్పాడు.

కన్నీళ్ళు తుడుచుకొని గాటి కాడికి పోతి. ప్రేమగా ఎద్దులు నావైపు చూసిన చూపుకు ప్రాణం పోయినంత పని అయింది.

సదాశివరెడ్డి ఎద్దులకు కట్టిన తాడును పట్టుకోబోతే కొమ్ములు విసిరినాయి.

మళ్ళీ ఇంకోసారి ప్రయత్నం చేసినాడు. లాభం లేకపోయింది. వాళ్ళ మనుషులే రోంత మొరటుగా చర్నాకోలా తీసుకొనిగాల్లో విదిల్చేసరికే కొ్ంచెం దార్లోకి వచ్చినాయి.

నేనే వాటి దగ్గరికి వెళ్ళి తాడు విప్పి వాళ్ళ చేతికి యిచ్చినాను.

ఎద్దులు కదల్లేదు. ఆడ్నే నిలబడతాండయి. లాగబోతే కొమ్ము విసురుతావుండాయి.

నేనే వాటిని ఇంటికాన్నుంచి కాలిదాన వెంబడి గంగమ్మ దేవళం వరకు తీసుకొచ్చి అప్పగించి అక్కడ్నుంచి నేను వెనక్కి వచ్చేశాను.

ఈ సంఘటన జరిగిన తర్వాత రెండు రోజులవరకు లక్ష్మి నాతో ఒక్కమాట కూడా మాట్లాడకుండా అలిగింది.

నేను పలకరించినా మాటాడ్డంలేదు.

ఎద్దుల్ని అమ్మి తప్పు చేశానా? అన్పించింది.

ఇదే విషయాన్ని చిన్నాయన్ను అడిగితి.

"అయిపోయిన విషయం ఎందుకు... జరగాల్సింది చూడు" – అన్నాడు కొ్ంచెం చిరాకు పడుతూనే. చిన్నాయన ఇంకా ఎద్దులు పోయిన బాధలోనే వుండాడని అర్థమైంది.

***

ఆంజనేయులు వచ్చినాడు.

కొంతసేపు మాట్లాడిన తర్వాత మాటల మధ్యలో ఊర్లోన్నుంచి కువైట్ పోయిన ఖాదర్ బాష వచ్చినాడని చెప్తే వాడ్ని కల్సను వాళ్ళింటికి పోతిమి.

చిన్నపుడు ఇద్దరమూ సావాసగాళ్ళమే.

వాళ్ళమ్మ ప్రేమగా పలకరించి చెక్కకుర్చీ తెచ్చివేసింది. ఖాదర్‌బాష బాగా తయారైనాడు. మనిషి తెల్లగా, ఎత్తుగా, నున్నగున్నాడు.

కువైట్‌లో తన కతంత చెప్పుకొచ్చినాడు ఖాదర్.

"ఆడ నేను బేల్దారి పని చేస్తాండను. ఆజాద్ వీజామీద పోయింది. బాగానే గిట్టుబాటు అయితాంది. ఇంగ ఊర్లో వుండే అప్పుల్ని తీర్చుకోవాల" చెప్పినాడు.

ఖాదర్ వాళ్ళ తండ్రి అబ్దుల్ బాషా. ఆరుఎకరాల పొలం వుంటే నాలుగు ఎకరాలు బీడుగా వదిలేసినారు. రెండు ఎకరాల్లో పంట వేస్తే నాలుగేళ్లుగా దిగుబడులు రాకుండా పోయినాయి వాళ్ళకు, ఏంచేస్తారు?

పంటకొచ్చే తెగుళ్లకు, వ్యవసాయానికే బయట సంపాదించింది కూడా పెట్టాల్సివచ్చేది. ఈ కరువుకు బలికావడం కంటే ఆ కువైట్‌కు వలసపోవడమే మంచిదనుకున్నాడు ఖాదర్ బాష. వీసాకు ఎనభైవేలు, కువైట్ వెళ్లడానికి ఇరవై వేలు, పైఖర్చులకు ఇరవై వేలు, మొత్తం లక్షా ఇరవైవేలు ఖర్చు పెట్టుకొని రెండేళ్ల క్రింతం ఊరు వదిలిపోయాడు. వెళ్లిన ఆరు నెలలకే పూరి గుడిసె ఇల్లు కాస్తా మేడలాగా తయారైంది ఇక్కడ. చెల్లెలు ఫాతిమాకు కూడా మంచి సంబంధం చూసి ఘనంగానే పెళ్లి చేసినాడు.

"ఇంకా ఏందన్నా.... ఊరు విశేషాలు?" – అడిగినాడు ఖాదర్.

"ఏముంది... ఆ మధ్యన ఊర్లో గంగమ్మ దేవర జరిపినారు. ఆ తల్లి వానలు పడ్తాయని చెప్పిందేగానీ ఇంతవరకు చినుకు కుర్సలేదు..." అని చెప్తి.

"లక్ష్మికి పెళ్లి అయ్యిందా?" – అడిగినాడు ఖాదర్.

"ఇప్పుడు ఆ ప్రయత్నాల్లో ఉండాను" అన్నాను.

"త్వరగా కానీన్నా... నేను కూడా ఉండి చూసిపోతాను చెల్లి పెళ్లి..."– నా భుజంతడతా చెప్పినాడు ఖాదర్.

"పెళ్లెప్పుడు ఖాదర్..." అని అడిగినాడు ఆంజనేయులు కన్నుకొడ్తా.

“అక్కడే ఒకమ్మాయిని చూస్కున్నాను. శ్రీలంక అమ్మాయి. పేరు సెల్వి. తెలివితేటలు బాగా వుండే అమ్మాయి. ఇదో ఈ వేలికి వుండే బంగారు ఉంగరం ఆ అమ్మాయి ఇచ్చిందే...” చూపించి నాడు ఉంగరాన్ని ఖాదర్.

మెరుస్తాంది.

“ఎలావుంది...?” అడిగినాడు ఖాదర్.

“మేము వున్నవి అమ్ముకుంటావుండాం. నువ్వులేనివి సంపాదించుకుంటా వుండావు....” అన్నాడు నవ్వుతా ఆంజనేయులు.

“నువ్వు మారావు గానీ వీడు మార్లేదు... ఎప్పుడు మార్తాడో...” అన్నాడు ఖాదర్ సరదాగా!

“కువైట్‌కు ఒకసారి నేనూ పోయొస్తే ఎందుకు మారను.. ఏదో ఒక దేశం అమ్మాయితో బంగారు గండపెండరాలే చేయించుకొని మారివస్తా...” వెంటకారంగా అన్నాడు ఆంజనేయులు.

అట్లా మాట్లాడుకుంటానే నవ్వుల్లో మునిగిపోయాం.

***

వీరబల్లికి పోయి పెళ్లి సంబంధం వాళ్లను పిల్చుకొని రమ్మని చిన్నాయన్ను అమ్మ పంపించింది.

నేను పొలంకాడికి పోవడానికి బయలు దేరేటప్పుడు ఖాదర్, ఆంజనేయులు వచ్చినారు. పెద్దుళ్లపల్లె దగ్గరికి అవి ఏదో పక్షులు వస్తాయని వాటిని చూసి వద్దాం... అనే ప్రతిపాదన పెట్టినారు. నేను రావడం కుదర్దని చెప్పాలనే వుంది. కానీ ఎప్పుడో రెండేళ్ల తర్వాత వచ్చిన ఖాదర్ కోసం తోడుగా పోయి రావాలనే నిర్ణయించుకున్నాను.

పెద్దుళ్లపల్లెకు ప్రతి సంవత్సరం అరే బియా సైబీరియా ప్రాంతాలనుంచి ఎర్రకాళ్లకొంగలు వస్తాయి. ఈ పక్షలు వచ్చిన ఏడాది కరువుండదని, పంటలు సుభిక్షంగా పండుతాయని ఆడుండే గ్రామస్తులు నమ్ముతారు.

పల్లెకు పోగానే సత్రం దగ్గర సుంకేశులమ్మ టీ కొట్టులో వేడివేడిగా టీ తాగిన తర్వాత మనస్సు నిమ్మలపడింది. ఎండ తీవ్రంగా వుంది. పక్షుల సమాచారం అడిగినాడు ఆంజనేయులు ఆమెను. ఆమె గుబురు చెట్లవైపు చేయి చూపించింది.

“పక్షులుండాయా?” మళ్ళీ ప్రశ్నించాడు ఆంజనేయులు.

"వానలు యాడ పడినాయి... చెరువులో చుక్క నీళ్ళు లేవు... అందుకే వలసపక్షులు రాలేదు" – బాధగా చెప్పింది ఆమె.

నిజమే... చెట్ల మీద పక్షులు కట్టుకున్న గూళ్ళు బోసిపోయి వుండాయి. పచ్చని చెట్లు మోడుబారి వుండాయి. పక్షుల కిలకిలలతో అలరించే పెద్దుళ్లపెల్లె స్తబ్దంగావుంది. పల్లెతల్లి మూగబోయింది. వందలాది పక్షులు పల్లెలో విహరిస్తాంటే పల్లెంతా పరవశించేది. కరువు దెబ్బకు పక్షులు రావడం మానేశాయి.

అక్కడ కూర్చోని మాట్లాడతావుండగానే ఆ పల్లెలో పనిచేసే గ్రామ సేవకుడు రాజారత్నం వచ్చినాడు టీ కొట్టులోకి. మమ్మల్ని చూసి పరిచయం చేసుకున్నాడు. ఆయన మరిన్ని వివరాలు చెప్పినాడు పక్షుల గురించి! దుర్భిక్ష పరిస్థితుల కారణంగా జీవం పోసే చెరువే బీడు వారిందని, వలస పక్షులతో పల్లెకు ఆత్మీయ సంబంధం వుందని, రాని పక్షులకోసం పల్లెపల్లెంతా చెమ్మగిల్లిన కళ్లతో ఎదురు చూస్తావుండాదని చెప్పినాడు – విషాదంనిండిన గొంతుతో! అక్కడ్నుంచి బాధగా, భారంగా కదిలాం.

రాజారత్నమే మమ్మల్ని వెనక్కి పిల్సినాడు. "దీనికి ప్రక్కనే మాధవరం పోడు అనే గ్రామం వుంది అక్కడ కబోది పక్షులుంటాయి. వెళ్ళి చూసి రండి" – అని చెప్పినాడు.

ఖాదర్ ఉత్సాహంగా "అక్కడైనా పక్షులుంటాయి. పోయి చూసి వద్దాం!" అన్నాడు.

పోక తప్పింది కాదు.

మేము అడిగిన వెంటనే మాతో రావడానికి రాజారత్నం కూడా అంగీక రించాడు.

కొంత కష్టపడిన తర్వాత ఆ గ్రామం చేరుకున్నాం ఈ పక్షుల్ని మావుగువ్వలని పిలుస్తున్నారు.

"ఈ పక్షికి పగటిపూట కళ్ళు కనిపంచవు. రాత్రివేళలో మాత్రమే ఆహారం కోసం పోతుంది" అని రాజారత్నం చెప్పాడు.

"పక్షి జాతుల్లోనే విభిన్నమైంది ఈ పక్షి. ఈ కబోది పక్షులు నివాసం వుండే గ్రామం కరువు బారిన పడదనే విశ్వాసం..." అన్నాడు రాజారత్నం మళ్లీ.

"ఊర్లో నీళ్ళు పుష్కలంగా వున్నాయా..?" అడిగాను ఆత్రంగా.

రాజారత్నం నవ్వి ఊర్కున్నాడు.

మేము బయలుదేరాం అక్కడ్నుంచి!

***

ఉదయం నిద్రలేచి చూసేవరికి ఇంట్లో ఎదురుగా కాంచన...

చూసింది – మాట్లాడలేదు.

చూశాను – నేనూ మాట్లాడలేదు.

ఎందుకో – ఇద్దరికీ తెలియదు!

అమ్మ చెప్తాంది... "లెయ్‌రా... పాపోడా.. చిన్నాయన వీరబల్లి నుంచి పెల్లి సంబంధం వాళ్లను పిల్సుకొని వస్తాడు. ఏర్పాటు చూడు!"

"అవును... మర్చేపోయాను. లక్ష్మికీ పెళ్లి చూపులు కదా!"

కాంచన లక్ష్మిని ముస్తాబు చేస్తాంది.

లక్ష్మి నిజంగానే లక్ష్మీకళతో వెలిగిపోతాంది. అందాల భరిణే... గజ్జల గుర్రం... మా లక్ష్మి అచ్చం గుడిలోని లక్ష్మీదేవిలానే వుంది. నా దిష్టే తగిలేతట్టుంది.

మేము ఏర్పాట్లలో వుండగానే చిన్నాయన పెల్లి వాళ్లను పిల్చుకొచ్చినాడు.

అందరి పలకరింపులు అయినాయి.

కొద్దిసేపు తర్వాత లక్ష్మిని తీసుకొచ్చి పెళ్లి వాళ్ళముందు కూర్చోబెట్టింది కాంచన.

క్రిష్ణారెడ్డి లక్ష్మిని చూశాడు. ప్రశ్నలేవీ అడగలేదు.

పెళ్ళివాళ్ళకు కావలసిన ఏర్పాట్లన్నీ కాంచన లక్ష్మితో చేయించింది.

అమ్మయి నచ్చిందో... లేదో కనుక్కునే విషయం చిన్నాయనకే అప్పగించాను.

మాటల మధ్యలో మాధవరెడ్డిని చిన్నాయన అడిగాడు దానికి ఆయన ఊరికి పోయిన తర్వాత కబురు పెడతామని చెప్పాడు.

కానీ క్రిష్ణారెడ్డి కల్గజేసుకొని 'అమ్మాయి నాకు నచ్చింది. నా అభిప్రాయం ఇది. ఇక్కడే చెప్తున్నాను'. అని అన్నాడు.

నాకు కొంత ధైర్యం వచ్చింది ఈ విషయం నేనే అమ్మకు వెంటనే పోయి చెప్పాను. ఎంతోగానో సంతోషించింది.

లక్ష్మి సిగ్గుపడి కాంచన వెనుక్కు వెళ్ళిదాక్కుంది.

***

‘ఈ పిల్లకి అప్పుడే పెళ్ళి కళ వచ్చింది’ అనింది కాంచన. ‘నువ్వు కూడా ఏంటక్కా!’ – వెనుక నుంచే నడుంగిచ్చింది సిగ్గు పడుతూ లక్ష్మి.

“కాబోయే మొగుడితో ఏకాంతంగా మాట్లాడాలని వుందేమో చెప్పు... మాట్లాడిస్తాను” – అంది కాంచన కళ్ళు ఎగరేస్తూ!

“నీకు ఆయన నచ్చాడు... ఆయనకు నువ్వు నచ్చావు కదా. మాట్లాడుకుంటే తప్పేంలేదు... అయితే పోట్లాడుకోకండి”– చెప్పింది కాంచన సరదాగా.

“మాట్లాడకోవడమైన... పోట్లాడుకోవడమైన అన్నీ పెళ్ళి తర్వాత” – జవాబిచ్చింది లక్ష్మి.

అక్కడే వున్న నేను–

“నా చెల్లెలు... నాలాగే ఆలోచిస్తాది” అన్నాను కాంచన వైపు చూస్తూ.

కాంచన మూతి తిప్పి నవ్వింది.

ఇంతలో చిన్నాయన పిలిస్తే నేను బయటికెళ్ళాను “బయలు దేరుతాం! అంటున్నారు వీళ్లు” అన్నాడు.

“అమ్మాయి నచ్చింది అన్నారు కదా. ఆ... కట్నాలు, లాంఛనాల విషయం కూడా మాట్లాడావా...” అన్నాను.

“అమ్మను కూడా పిల్సు. ఆ విషయాలు కూడా మాట్లాడుకుందాం” అన్నాడు చిన్నాయన అమ్మ వచ్చింతర్వాత ముగ్గురమూ మాధవరెడ్డి దగ్గరే కూర్చొని వీటి ప్రస్తావన తీసుకొచ్చాం.

“మీ కుటుంబం గురించి నాకు తెలుసు. రామిరెడ్డి ఊర్లో ఎట్లా బతికేటోడో కూడా తెలుసుకుంటి. పెళ్ళి మా వీరబల్లిలోనే ఇంటి కాడ పెట్టుకుంటాం. కనీసం రెండు లక్షలైనా మీ నుంచి ఇవ్వండి. బంగారం మీ ఇష్టం...” చెప్పినాడు కుదురుగా మాధవరెడ్డి.

“ఇప్పటికిప్పుడు రెండు లక్షలైతే మా దగ్గర లేవు. తెలుసు కదా.. పంటలు ఈ కరువుకు యాడ పండుతాండయి? అయినా ఎట్లానో గట్టా ఇవ్వడానికి ప్రయత్నిస్తాం. పెళ్ళికి మూహుర్తాలు మీరే పెట్టించి కబురు చేయండి...” చెప్పినాడు చిన్నాయన.

“అలాగే... వెళ్ళొస్తాం!” చెప్పి బయలుదేరినాడు మాధవరెడ్డి. పక్క గదిలోంచి క్రిష్ణారెడ్డి, వాళ్ళమ్మ, వాళ్ళ బంధువులు కూడా మాధవరెడ్డి వెనకాలే కదిలినారు. వాళ్ళందరూ వెళ్ళిపోయిన తర్వాత కాంచన కూడా వెళ్ళడానికి సిద్ధమయ్యింది.

వండిన వంటలు ఒక కవరులో పెట్టి ఇచ్చింది అమ్మ. “అప్పుడప్పుడైనా సాయంత్రం పూట మా ఇంటికి వస్తావుండు లక్ష్మీ” – అని చెప్పి కాంచన కదిలింది.

“ఉన్నట్లుండి రెండు లక్షలంటే ఎట్లా వస్తాయి?” అమ్మ బాధపడ్తా వుండాది.

“డబ్బులు ఏముంది... మంచి సంబంధం వచ్చింది... కష్టమో... నష్టమో... మన తిప్పలు మనం పడి పిల్లపెళ్ళి ఘనంగా చేయాల” – అన్నాడు చిన్నాయన.

“పోనీ ఎక్కడైనా భూమి అమ్మేద్దామనుకుంటే ఈ కరువు కాలాల్లో ఎవరు కొంటారు?” అని చిన్నాయనే మళ్ళీ ఆలోచన చేస్తా అన్నాడు.

“నా దగ్గరుండే కొంత బంగారం అమ్మండి. ఎద్దులు అమ్మింతర్వాత వచ్చిన అరవై వేలకు దీన్ని కలిపి మొత్తం సరిపోతాదేమో చూడండి” – సలహా ఇచ్చింది అమ్మ.

“ఇంత కరువు కాలంలోనూ రెండు లక్షలు అడిగితే యాడ తెచ్చి ఇస్తారంట... ఈ పెళ్ళి నేను చేసుకోను” కోపంగా వచ్చి అనింది లక్ష్మి.

“చిన్న పిల్లవు... నీకెందుకు మా విషయాలు. లోపలి కెళ్ళు మేం పెళ్ళిచేస్తాం. చేస్కో, అంతే!” చెప్పింది గద మాయిస్తూ అమ్మ. తలొంచుకొని లోపలకెళ్ళింది లక్ష్మి.

“ఎక్కడైనా అప్పు తీసుకొని ముందు పెళ్ళి జరిపిద్దాం. తర్వాత మన కష్టమేదో మనం పడి వడ్డీతో సహా అప్పు తీర్చుకుందాం” నా అభిప్రాయం చెప్పాను.

“డబ్బుల విషయం గురించి ఇంగ ఆలోచించిది చాలు. ఏదో ఒకటి చేద్దాంలే...” అని చెప్పి చిన్నాయన బయటికెళ్లాడు.

నేను కూడా లక్ష్మిని ఓదార్చడం కోసం లేచి ఇంటోకి నడిచాను.

“వాళ్ళు డబ్బు మనుషులైతే వాళ్ళింటికి నేను కోడలుగా వెళ్లనన్నా...” అనింది లక్ష్మి కన్నీళ్ళతో.

“ఊరుకో... ఏడ్సడం ఎందుకు? మనల్ని డబ్బు అడిగింది మాధవరెడ్డే కదా. క్రిష్ణారెడ్డి మంచోడు. నువ్వంటే ఇష్టమని అక్కడే చెప్పినాడు కదా!” అన్నాను తన మనసు మారుస్తూ.

బయట వాకిట్లో ఎవరో వచ్చిన అలికిడి అయింది. తొంగి చూశాను. ఆంజనేయులు నన్ను పిలుస్తా వుండాడు. బయటకు నడిచాను.

***

పెళ్ళి సంబంధం వాళ్లు అడిగిన రెండు లక్షల కట్నం గురించిన విషయం ఆంజనేయులకు చెప్పాను. "ఎర్రకొయ్య పనికి పోవాలంటే పోలీసుల భయం వుండాది. ఎట్లైనా గానీ ఈ రెండు, మూడు వారాలు సరిగ్గా పని చేయగలిగితే కొంతవరకైనా మనం డబ్బు సంపాదించుకోవచ్చు. ఏమంటావు?" అన్నాడు ఆంజనేయులు. ఇట్లా మాట్లాడుకుంటా గంగమ్మ దేవళం దగ్గరికి చేరుకున్నాము.

అక్కడ సరిగ్గా రాతిబావి కాడ జనం. జనం... బిందెలు తీసుకొని గుంపులు గుంపులుగా తోసుకుంటా, కొట్టుకుంటా, తిట్టుకుంటా బావిలోని నీళ్ళకోసం వందల మంది జనం... ఎగబడతా వుండారు. ఆ దృశ్యం చూసిన తర్వాత గుండె కరిగింది. నీళ్ళ కోసం జనం పరితపిస్తా వుండారు. నూటాపదారు పల్లెలకు ఒకేఒక్క బావి. ఆ గంగమ్మ తల్లికి దయ యాడ కల్గుతాంది. "చూడన్నా ఉదయ మెప్పుడో వచ్చినాం. ఆ పల్లెల్లూ, ఈ పల్లెల్లూ దొబ్బుకుంటా పట్టుకుంటా వుండారే గానీ మాకు ఒక బింద్రైనా నీళ్ళు ఇస్తాండరా...?" పాపం ఎవరో ఒక ఆడమనిషి వచ్చి అడిగింది. నా మాట కాదనకుండా అంత జనంలోను ఆంజనేయులు తోసుకుంటా పోయి నీళ్లు తెచ్చిచ్చినాడు.

"కనీసం ఈ ఒక్క బావిలోనైనా ఈ మాత్రం నీళ్ళు వుండాయంటే అది కూడా ఆ గంగమ్మ తల్లి పుణ్యమే..." జనంలో ఎవరో అంటాండరు. నీళ్ళకొచ్చిన పల్లెపిల్లోళ్ళందరూ యేటి గట్టున ఇసుకలో కూర్చోని ఆటలాడుకుంటా వుండారు. పాటలు పాడుకుంటా వుండారు.

"చెమ్మ చెక్క చెమ్మ చెక్క
చేరడేసి మొగ్గా
అట్లు బోయంగ – ఇట్లు రాయంగ
రత్నాల చెమ్మచెక్క – రంగు లేయంగ
ముత్యాల చెమ్మ చెక్క – ముగ్గులేయంగ
సుబ్బరాయుని పెండ్లి సూసివత్తారండి
చెంద్రాయుని పెండ్లి చేసి వత్తాం రండి
ఈనే పుల్లలు పట్టకరారా – కుందేలిగా
ఆకు వక్కలు పట్టకరారా – కుందేలిగా"

పిల్లలు ఆటలు చూసి నవ్వుకుంటా వుండగానే దేవళం కాడికి నరసింహులు వచ్చినాడు. తలుపులు తెరచి శుభ్రం చేసినాడు. అక్కడే నీళ్లకొచ్చిన ఆడోళ్ళతో

కసువులు కొట్టించినాడు. ముగ్గులేయించినాడు. నన్ను చూసింతర్వాత నవ్వుకుంటా వచ్చి బావికాడ్నే అరుగుమీద కూర్చొన్నాడు.

మర్నాడు గంగమ్మ తల్లికి రోకలిసాంగెం ఏర్పాటు చేస్తాండేటట్లు చెప్పినాడు.

"రోకలి సాంగెమా?" – ఆశ్చర్యంగా అడిగినాడు ఆంజనేయులు.

"అవును... దీని వలన ఎంత కాలంలో మనకు వానలు కురస్తాయో, అసలుకురిసే ఉద్దేశ్యం దాన్లకు వుందో లేదో తెలుస్తాది"– అని చెప్పినాడు నర్సింహులు.

ఈ రోజు తప్పకుండా దేవళం కాడికి వస్తామని చెప్పినాం.

"రాతి బావిలో కూడా నీళ్ళు తగ్గిపోతా వుండాయని... ఇంకొన్ని రోజులు వానలు కుర్సకపోతే జనం పరిస్థితి ఏమౌతాదో..." నని ఆందోళన పడ్తావుండాడు నర్సింహులు.

రాతిబావికాడ నీళ్ల కోసం యుద్ధమే జరుగుతున్నట్లుండాది.

ఈ హిరణ్య నేలపై ధాతు కరువు... గంజి కరువు.. డొక్కల కరువు తర్వాత మళ్లీ ముంచుకొస్తున్న ప్రమాదం ఏదో కన్పిస్తున్నట్లే వుండాది.

ఇదంతా ఒక భయంకర సంఘర్షణగానే అన్పిస్తోంది...

నర్సింహులుకు చెప్పి ఆన్నుంచి బయలుదేరాం.

## 11

**చీ**కటైతాంది.

"గువ్వల చెరువు ఎర్ర కొయ్యల దగ్గరికి పోదామా... వద్దా..." అడిగినాడు ఆంజనేయులు.

"సరే... లక్ష్మి పెళ్లికి డబ్బులకు ఇబ్బందిగానే వుంది కదా! పదా పోదాం" అంటి.

పోలీసుల సంగతి అనుకుంటే కాళ్లూ చేతులూ వణుకుతా వుండాయి.

దిగదాల వుండే కాలిదావ గుండా రహస్యంగా పోతావుండాం. మిట్టమీద ఏదైన అలికిడి అయితే చాలు భయమేస్తా వుండాది. రెండు... మూడు గంటలు పడ్తా లేస్తా పాలకొండల రాళ్ళలో నడ్సిన తర్వాత ఆ స్థావరం కాడికి చేరుకున్నాం.

నడి అరణ్యంలో కీచురాళ్లు మొత్తుకుంటా వుండాయి. గాలికి ఆకులు ఊగినా దిక్కులు చూస్తా వుండాము. ఎర్ర చందనం చెట్లనుంచి వచ్చే చల్లటి గాలికి శరీరం పరవశిస్తా వుంది... ఎర్ర బంగారంగా గుర్తింపు పొందిన ఎర్రకొయ్యకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ వుంది. లక్షల్లో ధర పలుకుతాంది. రాతి నేలలు వుండే కొండ ప్రాంతాల్లో, గులకరాళ్ల నేలల్లో ఈ చెట్లు లేస్తాయి. ఇది ఈ గడ్డ మీద తప్ప ఈ భూమ్మీద ఇంకెక్కడా కన్పించదు. దీన్లకు ఇంకో ప్రత్యేకత ఏంటంటే ఈ ఎర్రకొయ్యను ఏళ్ల తరబడి నిల్వ ఉంచినా వీటికి చదలు పట్టదు. మట్టిలో పూడ్చి పెట్టినా ఈ కొయ్య నాణ్యతలో మార్పుండదు. అందుకే ఈ ఎర్రకొయ్యకు లక్షల్లో వ్యాపారం జరిగేది. ఆ మధ్యన ఎర్ర కొయ్యల పనికొచ్చినప్పుడు ఈ సంగతులన్నీ ఇస్మాయిల్ చెప్పినాడు.

"రేపట్నుంచి ఎర్ర కొయ్యల పని వారం రోజులవరకు మానేద్దాం. అడవిలోకి ఎవరూ రావద్దు. పోలీసులు తిరుగుతావుండారు. పట్టుకుంటే పి.డి యాక్ట్ కింద పెట్టి జైల్లో వేస్తారు. పైగా ఇప్పుడొచ్చిన ఫారెస్ట్ డి.ఎఫ్.ఒ. మన మాట వినడం లేదు" – చిత్తూరు యాసలో చెప్పినాడు ముఖానికి చేతి రుమాలు కట్టుకుని ఉండే వ్యక్తి.

"ఈసారి మళ్లీ పని మొదలు పెట్టినా అది ఈ గువ్వల చెరువ కాడ కాకుండా భైరవగుట్ట దగ్గర వుంటాది. ఇక్కడ దొరికే ఎర్రకొయ్య క్వాలిటీ తక్కువ వుందంటా వుండారు జపాన్ వాళ్ళు" – చెప్పినాడు మళ్లీ అతనే.

"అవును భైరవగుట్ట అయితేనే మంచిది. దానికి చుట్టు పక్కన చాలా దూరం వరకూ ఊర్లు లేవు. మన కిబ్బంది వుండదు" – చెప్పినాడు కొయ్య కొట్టడానికి వచ్చిన మరో వ్యక్తి.

"ఈ రోజుకైతే ఏం పనిలేదు. ఆ పొదల్లో కొట్టి వేసిన ఎర్రకొయ్య దుంగలు ఇక్కడ్నుంచి ఆ కట్టకిందకి చేర్చుకుందాం. ఆ దావగుండా తెల్లారేటప్పుడు చీనీకాయల లారీ పోతాది. ఆ కాయల కింద వేసుకొని తరలించవచ్చు" చెప్పినాడు మరోవ్యక్తి.

అందరం ఎర్రకొయ్య దుంగల్ని మోసేపనిలోకి దిగినాం.

భయం భయంగా వుండాది.

ఏ నిమిషంలో పోలీసులు వచ్చి పడ్తారో తెలీదు.

"ఏం భయపడ్తా వుండావా?" – అని అడిగినాడు ముఖానికి చేతిగుడ్డ కట్టుకొని వుండే వ్యక్తి. నిశ్శబ్దంగా వుంది.

నేను మోసే దుంగలోంచి "ఆ కొయ్యతీసి పక్కన పెట్టు" అని ఆ మనిషే అన్నాడు.

"ఎందుకు?" ప్రశ్నించాను.

"దాన్ని కోడూరు కాడుండే నా మిత్రుడు సైదాచారికి ఇస్తే మంచి దేవుడి బొమ్మ చెక్కిస్తాడు"

"అక్కడ ఎర్రకొయ్య బొమ్మలోళ్ళు వుండారా?"

"చాలా మంది... బొమ్మలు చేసుకొనే బతకుతారు. వాళ్ళూ భయం భయంగానే బతుకుతా వుండారు"

"ఎందుకని?"

"ఈ పోలీసోళ్ళు వాళ్ళమీద కూడా పడ్తా వుంటారు. మేము స్మగ్లర్లం కాదు. అడవి మీద ఆధారపడి బతుకు వెళ్ళదీసుకొస్తుండే మామూలు మనుషులం అని మొత్తుకుంటూ వున్నా వింటుంటే కదా! ఏవో నాలుగు కొయ్యలు తెచ్చుకొని నాలుగు బొమ్మలు చేసుకొని బతుకీడుస్తాం అని అంటున్నా వినకుండా దిన్నం పోయి వేధిస్తా వుండారు" చెప్తున్నాడు ఆ వ్యక్తి.

"మేము కూడా బొమ్మలు చేయించుకొవచ్చా" అసక్తిగా అడిగినాడు ఆంజనేయులు.

"సైదాబారి బయటికొస్తే అందరమూ ఒక్కో బొమ్మ చేయించుకోవచ్చు" సమాధా నమిచ్చాడు.

"బయటికి రావడం ఏమిటి?" అడిగాను అర్థంకాక.

"అవును పోలీసోళ్ళు మూసేశారు సైదాచారిని. కడపజైల్లో వేశారు"– చెప్పాడు.

"..... అయ్యో ఎంతపని జరిగింది" ఆవేదన పడ్తా అన్నాడు ఆంజనేయులు.

"తరాలనుంచి వస్తాండే ఎర్రకొయ్య బొమ్మల కళను పూర్తిగా నమ్ముకోనూ లేక వదులుకోనూ లేక వాళ్ళూ బాధపడ్తావుండారు" భజం మీద మోసే దుంగల్ని కింద పెడుతూ అన్నాడు ఆ వ్యక్తి.

కోడూరు లక్ష్మిగారిపల్లె ఎర్రకొయ్య బొమ్మలోళ్ళ గురించి మాట్లాడుకుంటూనే దుంగల్ని కట్టకిందకి చేర్చినాం.

కొది సేపటికి దూరంగా ఏదో వాహనం వస్తున్న శబ్దం... ఏమై వుంటుంది..? పోలీసు జీవు శబ్దంలా వున్నట్లుంది..." అనుమానంగానూ, భయంగానూ అన్నాడు ఆంజనేయులు.

అంతే...!

అక్కడున్న అందరం ఒక్క ఉదుటున భయంతో దిక్కుకొకరంగా పరిగెత్తాం.

చెట్ల మధ్యనుంచి, పొదల మధ్యనుంచి వచ్చే వాహనాన్ని పరిశీలనగా చూస్తాంటి. నాతోపాటే పరిగెత్తుతూ వచ్చిన ఆంజనేయులు గసతో ఆయాస పడ్తా వుండాడు.

ఆ వాహసం దగ్గరగా వస్తోంది.

అది జీపు కాదు... లారీ!

పోలీసోళ్ళదో... ఫారోస్టోళ్లోదో... కాదు.

చీనీకాయలతో వస్తాండే లారీ.

వచ్చింది... దగ్గరగా... ఆ చెట్ల కాడికే...

కొద్ది సేపటికి ఆగిన లారీ దగ్గరికి ఆ పక్క రాళ్ళ దాపున దాక్కొని వుండిన మా మనిషి పోయి మాట్లాడినాడు.

వెనుకవైపు డోర్ తెరుచుకుంది.

పరిగెత్తిన అందరం అక్కడికి చేరుకున్నాం.

త్వరత్వరగా శక్తి కొద్ది ఎర్రకొయ్య దుంగలు లారీలోకి చేర్చాము. దుంగలన్నీ వరసగా ముందువైపు పేర్చుకున్న తర్వాత వాటిమీద అనుమానం రాకుండా చీనీకాయలు పర్చినారు. మళ్ళీ దానిమీద కూడా ప్లాస్టిక్ కవరు కప్పినారు.

"చెక్‌పోస్టు కాడ జాగ్రత్త!" చెప్పినాడు మా మనిషి.

డ్రైవరు అట్నే లేమని తల ఊపినాడు. లారీ కదిలింది.

ముఖానికి చేతిగుడ్డ కట్టుకున్న మా మనిషితో డబ్బుల విషయం మాట్లాడి నాను.

"ఇస్మాయిల్ రాగానే చెప్పి ఇప్పిస్తా"నని చెప్పినాడు. సరేననిచెప్పి వచ్చేశాం.

లారీ శబ్దం విన్నప్పుడు పరిగెత్తిన దృశ్యమే గుర్తుకొస్తాంది.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరిగెత్తాం. అదే పోలీసు జీపు అయివుంటే పరిస్థితి ఎలా వుండేది?

“ఇంకెప్పుడూ ఈ ఎర్రకొయ్య కొట్టేపనికిరాను” అని చెప్పేశాను ఆంజనేయుల్తో.

***

ఊర్లో మరో రైతును కరువు బలి తీసుకుంది. రామప్పనాయుడు పొలంలో పురుగులకు కొట్టాల్సిన మందును కడుపుకుతాగినాడు. ఊరంతా దుఃఖంలో నిండి వుండాది. ఎక్కడ చూసినా రామప్పనాయుడి మాటే మాట్లాడుకుంటా వుండారు.

ఆదర్శ రైతుగా రెండుసార్లు గవర్నమెంటోళ్ళు రామప్పనాయుడికి సన్మానం కూడా చేసినారు. అట్టాటి రైతే ప్రాణాలు తీసుకున్నాడు. భార్య పార్వతమ్మ పడిపడి ఏడుస్తాంది.

ఆత్మహత్యకు కారణం ఏముంది?

నేలతల్లి మోసం చేసింది. పెట్టుబడి కోసం చేసిన అప్పులు పురుగుమందు డబ్బా అయినాయి. అప్పులు ఇచ్చినవాళ్ళు ఒత్తిడి తెచ్చినారు.

భార్య, ఇద్దరు అమ్మాయిలు.. నాయుడు పోవడంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది.

నాలుగున్నర ఎకరాల పొలం వుంది. సొంతంగా కష్టించి పొలంలోనే సాగునీటి కోసం బావిని తవ్వాడు. రెండు రోజులు నీళ్ళుండినాయి. ఆ తర్వాత మళ్ళీ మాములే. వర్షాభావంతో బావి ఎండిపోయింది. పార్వతమ్మకు జబ్బు చేసింది. నాయుడ్ని ఇది మరింత కృంగదీసింది. కరువుతో కటుంబ పోషణ బరువైంది.

బ్యాంకులు అప్పుడెప్పుడో ఇచ్చిన లక్ష రూపాయలు అప్పుకట్టాల్సి వుండాది. బయట మరో యాభైవేలు అప్పు చేసి నాడు. పొలంలో మూడు బోర్లు వేయించి నాడు. రెండు బోర్లు నోట్లో దుమ్ము కొట్టినాయి. ఒక బోరుల్లో మాత్రం కొన్ని నీళ్ళు పడినాయి. మొన్న ముదిరిన ఎండలకు అది కూడా ఖాళీ అయింది.

నాయుడుకు అప్పులోళ్ళ బాధ ఎక్కువైంది. దిన్నం ఒకడొచ్చి అప్పు కట్టాలని వేధించడం ఆయనకు దిక్కుదోచని పరస్థితిని తెచ్చిపెట్టింది.

నేలతల్లిని నమ్ముకొని లక్షలాది రూపాయలు వ్యయంచేసి పంటలు సాగుచేనాడు. వర్షాభావం, కరువుతో పంటలు పండకపోవడం, సాగుకోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి మోయలేని భారంగా మారడంతో వాటిని తీర్చే మార్గం కూడా లేకుండా పోవడంతో నాయుడు పొద్దున్నే పొలం కాడికి పోయి ఆడ్నే పురుగుల మందు తాగినాడు.

ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడ్తావుండే పార్వతమ్మ పొలం అమ్మి అప్పులు కట్టమని కూడా చెప్పిందట...

ఉన్న పొలం అమ్ముదామన్నా కొనేవారు ఎక్కడ?

నాయుడు వెళ్లిపోయినాడు గానీ ఆ కుటుంబం పరిస్థితి ఏమిటో ఎవరు పట్టించుకుంటారు? అప్పులు తీర్చే బాధ్యతకుతోడు కుటుంబ పోషణ భారం కూడా ఆ రైతు భార్యాపిల్లలపైనే పడింది. ఆ కుటుంబాన్ని చూస్తే గుండె తరుక్కుపోతుంది.

కర్మకాండ జరిగిపోయిన నాల్గవ రోజుకు బ్యాంకు నుంచి నోటీసు ఒకటి పార్వతమ్మకు అందింది. అది పొలం మీద నాయుడు తీసుకున్న లక్షరూపాయలు చెల్లించాల్సిందిగా వచ్చిన కాయితం.

ఈ రోజే బ్యాంకుకు పోయి తన భర్త నాయుడు పేరుమీద ఉన్న అప్పును తను పేరు పైకి మార్చుకొని వచ్చింది. ఆ రెండురోజులైతే ఊర్లో అప్పులిచ్చినోళ్లు ఊర్కున్నారేమోగానీ ఆ తరువాత పార్వతమ్మను కూడా పీడించడమే మొదలు పెట్టినారు. ఆ తల్లి కంటినిండా నిద్రపోయింది లేదు. కడుపు నిండా తినింది లేదు. అట్నే తన ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటా వస్తాంది.

అన్నదాత బతుకులో కరువు రేపిన అలజడికి మౌనసాక్షిగా మిగిలింది నాయుడు జీవితం.

అనారోగ్యంతో బాధపడ్తావుండే పార్వతమ్మ అందుకే ఒక ఆలోచన చేసింది. ఈ అప్పులన్నీ చెల్లించాలంటే ఇప్పుడు తను చేయగల పని ఒక్కటేనని... పూనా సావిత్రిని పిలిపించింది.

పూనా సావిత్రి అంటే ఖరీదైన దేహవ్యాపారానికి పెట్టింది పేరు. చుట్టుపక్కల ఊర్లోల్లోంచి అందమైన ఆడపిల్లలను పూనాకు పంపడం అక్కడ వ్యాపారం చేయడం... ఇలా లక్షాధికారిగా మారింది ఆమె.

“ఈ నేలకు కరువు కొత్తకాదు. వ్యభిచారం ఆడోళ్లకు కొత్తకాదు. ఇక్కడ ఆకలిచావలకు సచ్చేదానికంటే ఆడికి పోయి తను బతికి, ఇక్కడ తనవాళ్లను బతికించుకునే పనే మేలు. అయినా అరిగిపోయేది వుందా... తరిగిపోయేదుందా...?” అని అంటాది పూనా సావిత్రి, లోక జ్ఞానమంతా తనకే తెలుసు అన్నట్లు.

పూనాలోని తన వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఎదగడానికి సుగాలీ అమ్మాయిలకు ఎక్కువగా ఎరవేస్తావుంటాది. కానీ ఇప్పుడు పార్వతమ్మ బతకలేనితనంతో తన పెద్దకూతురు పూర్ణిమను పూనా సావిత్రి చేతిలో పెట్టడానికి నిశ్చయించుకుంది.

సాగునీటి ఊసేలేని రాయచోటి, సుండుపల్లి, చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లె ప్రాంతాలనుంచి ఎంతోమంది అమ్మాయిలను పూనా ప్రాంతానికి పంపింది పూనా సావిత్రి. ఈ లైంగిక వ్యాపారం అందరికీ చేతినిండా పని కల్పిస్తాంది. అటు పోలీసులకు కూడా పూనాలో అందాల్సిన ఆదాయం అందిస్తుంది. 'ఎప్పుడంటే అప్పుడు అమ్మాయి' అనే వ్యాపారం జోరుగా సాగిస్తోంది.

పూర్ణిమను తనతో పాటుగా తీసుకపోతున్నందుకు పార్వతమ్మకు అడ్వాన్సుగా నలభైవేలు కూడా ఇచ్చింది సావిత్రి.

ఏడాదిలోగా బ్యాంకుకు కట్టాల్సిన లక్ష రూపాయల అప్పును కూడా తానేతీర్చివేస్తాననే హామీ కూడా ఇచ్చింది.

పూర్ణిమ... సావిత్రితో పాటూ పూనాకు ప్రయాణమయ్యింది.

ఊరుకాని ఊరులో మనసు, శరీరం కూడా వారిదికాని లోకంలోకి తన బంగారు కలల్ని ఇక్కడి నేల తల్లికి అంకితం చేసి... డెబ్బై శాతం కరువు ప్రాంతాల్లోని అమ్మాయిలు తెలిసీ తెలిసీదిగే ఊబిలోకే పూర్ణిమ కూడా నడిచింది.

***

వీరబల్లినుంచి మాధవరెడ్డి మామ వచ్చినాడని సిన్నాయన చెప్పినాడు.

రచ్చబండ కాన్నుంచి లేచి ఇంటికి పోతి. కుశల ప్రశ్నలైనాయి.

రెండు రోజుల్లో మంచి ముహూర్తం వుందని, మళ్లీ క్రిష్ణారెడ్డి పట్నంలో పని వెతుక్కోను పోవాల్సివుందని కాబట్టి ఇంత ముందుగా పెళ్లి పెట్టుకుంటాండమని చెప్పినాడు.

"రెండు రోజుల్లో పెళ్లి అంటే కష్టం కదా..?" అని ఆశ్చర్యంగా అంటి.

అమ్మ కూడా అదే అంది.

"మీరు పెళ్లి కూతుర్ని చేసుకొని అమ్మిని తీసుకొని వస్తే సరిపోతాది. కరువు కాలం కదా అని బంధువులను కూడా ఎవర్నీ పిలవడం లేదు" చెప్పినాడు మాధవరెడ్డి మామ.

"సరే" అనక తప్పలేదు మాకు.

ఇంట్లో వుండే డబ్బుకు బయట చిన్నాయన తెచ్చిన డబ్బు మొత్తం కలిసి లక్ష రూపాయలు ఇచ్చినాం. పెళ్లి ఖర్చులకి వాడుకోండి...

మిగతా లక్ష పెళ్లిలో ఇస్తాం అని చెప్పినాం.

"అట్నే లెమ్మని" – లక్షరూపాయలు తీసుకొని వెళ్లిపోయినాడు మామ.

లక్ష్మి పెళ్లి విషయం ముఖ్యమైన వాళ్లకు మాత్రం చెప్పినాము. పిండివంటలు తయారు చేయించినాము. కొత్తబట్టలు తీసుకొచ్చినాం.

భూమిని తాకట్టులో పెట్టి బ్యాంకు నుంచి లక్షరూపాయలు అప్పు తీసుకున్నాం. పనులన్నీ చకచక జరిగిపోయినాయి.

నిజానికి ఈ పెళ్లి ఆ ఊర్లోనే జరిగి వుండాల్సింది. ఇక్కడ గత పదేళ్లుగా ఘనంగా ఒక్క పెళ్లి కూడా జరగలేదు. అందరినీ పిలిచి భోజనం పెట్టే స్తోమత లేక ఏ గుళ్లోనో ఆ మూడు ముళ్లు వేయించడమో, దూరంగా ఎక్కడైనా తమకు తోచిన వాళ్ల ఇళ్లలోనే పెళ్లిళ్లు ఏర్పాటు చేసుకోవడమో జరుగుతాంది. నీళ్లులేని చోట ఎవ్వరిమైనా ఏం చేయగటం?

కొంతమంది తెల్సినవాళ్లు మాత్రం లక్ష్మి పెళ్లికి మాతో కదిలారు. కాంచన, ఖాదర్, ఆంజనేయులు, చంద్రన్న తాత, రాజమ్మవ్వ... ఇంకొందరు మిత్రులు మా కుటుంబంతో కల్సి పెళ్లికి సిద్ధమయ్యారు.

నాలుగు ఎడ్డబండ్ల మీద వీరబల్లికి ప్రయాణమయ్యాం. చివరి బండిలో రాజమ్మవ్వ కూర్చునివుంది. ఆయవ్వ పాటలు బాగా పాడుతుంది. బండ్లు కొండదారి పట్టింతర్వాత ఆయవ్వ గట్టిగా గొంతెత్తింది.

"మల్లెలు మల్లెలు మా విరజాజులు సొగసుకు చామంతి, రోజా పుష్పములు

అత్తరు పన్నీరు అమర్చియున్నదిరా చెలియా...

నీకొరకై కాచియున్నదిరా పెండ్లికుమారా

నలుగుకు రారా శ్రీ కృష్ణకుమారా..."

పాటలతోనే మా ప్రయాణం గడిచిపోయింది. కాంచన తన వెన్నెల పాట పాడుతుందేమోనని చూశాను. కానీ నా ఆశ నిరాశే అయింది. బండ్లు వీరబల్లి చేరినాయి. తెల్లారింది.

పెళ్లికూతురు ముస్తాబుతో లక్ష్మి అందంగా ఉంది. నలుగుపెట్టి హారతి ఇచ్చిం తర్వాత మండపంలోకి పూజారి పెళ్లికూతుర్ని తీసుకురమ్మన్నాడు.

తర్వాత పెళ్లికొడుకును కూర్చోబెట్టారు. మంగళ సూత్రధారణ కూడా పూర్తయ్యింది. దంపతులకు నలుగులు పెట్టి తాంబూలాలు ఇచ్చారు. ఇంట్లోకి మొదటిసారి తీసుకపోయేటప్పుడు పసుపునీళ్లతో పాటు ఎర్రనీళ్లు కలిపి కర్పూరం వెలిగించి దిష్టి తీసారు. జయమంగళం శుభమంగళం పాటలు పాడారు.

పెళ్లి సంతోషంగా జరిగింది.

జరిగిన లోటు ఏదైనా వుంది.. అంటే నాన్న మామధ్య లేకపోవడమే! ఆ విషయం తలచుకోగానే గుండె బరువెక్కింది.

# 12

**అ**డ్డుగోడల్ని బద్దలు కొట్టకొని మనిషిగా బయటపడడం అంటే మాటలు కాదు... ఒక్కోసారి అంతఃకరణాన ఏ మూలనో దాగిన రహస్య హృదయాంతర విషాదం అగ్నిగుండమై... ద్వేషాగ్ని జ్వాలల్ని ప్రజ్వరిల్లిస్తుంటే ప్రచండ ప్రళయ ఝుంఝూమారుతాల్ని బయటకు తెలియకుండా గుప్పిట బిగించి కప్పుకోవడమూ అందరికీ సాధ్యమయ్యే సాహసం కాదు... దానికి దేహ పంజరం కావాలి... ఆత్మ అనే అల్మరా వుండాలి... ఏడేడు సముద్రాలకావల ఎత్తైన మర్రిచెట్టు తొర్రలోని పచ్చని చిలుకలో పదిలంగా మాంత్రికుడి ప్రాణం దాచినట్లు నిన్ను నీలో నిగూఢంగా వుంచగల పంజరం కావాలి....

నిన్ను నువ్వు పరమాణువులోని బ్రహ్మాండ విస్ఫోటశక్తితో నిర్మించిన యుద్ధనౌకను చేసుకోగలగాలి...

ఇసుకటెడారుల్లోనూ... ఇనుపగుళ్ళవర్షాల్లోనూ... యుద్ధక్షేత్రాల్లోనూ... పోరాడే దుర్భేద్యమైన శతఘ్నిలా నిర్మాణం కావాలి...

కన్నీటి కావ్యం అధ్యాయాలనిండా ఎంతకీ అర్థంకాని అభ్యాసాలే... అంతు చిక్కని అక్షరాల ఆర్తనాదాలే... అరణ్యాల దారిలో ఒంటరిగా వదిలేస్తాయి... అయినా పక్షిలా ఎగిరిపోవడానికి నేనేం పావురాన్ని కాను... పాడబడ్డగూడును!

***

నాన్న... రామిరెడ్డి...

పొలంలో తెల్లారిందగ్గరినుంచి రాత్రి పొద్దుపోయేదాకా సేద్యం... సేద్యం... అంటానే గడుపుతావున్నాడు. చిన్నప్పుడు ఆడుకుంటా ఆడుకుంటా నాన్న దగ్గరికెళ్ళి ప్రేమగా ఆయన ఎత్తుకోగానే బుగ్గమీద ముద్దు పెట్టుకోవాలని వుండేది... కానీ చమట వాసన!

'నాన్న... నీ దగ్గర చమట వాసనొస్తుంది!'... అని గోముగా అంటే,

'అది ఈ నేలతల్లి ఇచ్చిందిరా.. ఇంత కష్టపడితేగానీ మన కడుపులు నిండవ'ని ఆయన చెప్పేటప్పుడు కళ్ళల్లో వెలుగుతో కూడిన బాధ కన్పించేదికదా!

అమ్మ కోసం... నా కోసం... లక్ష్మీ కోసం...

ముగ్గరి కోసం ఒక్కడు శ్రమపడే వాడు....

పండక్కి అందరికీ కొత్తబట్టలు కొనేవాడు. తనని తాను మరిచిపోయేవాడు. మైనం వొత్తిలాగా తాను కరిగిపోతూ ఆ వెలుగులో మమ్మల్ని పెంచాడు. 'మీరందరూ కొత్త గుడ్డలేసుకుంటే నేను వేసుకున్నట్లే కదా'- అని సంబరపడేవాడు... చూడు నాన్నా చెల్లిలక్ష్మి పెళ్ళి చేశాను. నువ్వు కూడా మా మధ్య వున్నింటే ఎంత బాగుండు నాన్న...!

మనస్సంతా నాన్న జ్ఞాపకాలే.

***

ఆకాశం నుంచి చినుకులు కుర్సడం లేదు. పాతాళం నుంచి గంగ పొంగటం లేదు. కన్నీరు పాత కాదు... కరువు కొత్త కాదు....

ఇదిగో ఈ వ్యాపారాలే కొత్త.

ఎర్రకొయ్యల్ని అమ్ముకోవడం...

పూనాకు అమ్మాయిల్ని పంపడం...

ఇప్పుడు ఇసుక వ్యాపారం...! కనుగొనబడిన కొత్తదారులు!

రండి... ఇలా... నాతో ఈ యేటి గట్టున సిన్నగా సాగుదాం... ఇక్కడ ఈ బండరాతి పక్కనుండే కాలిదావగుండా కిందకిదిగండి... ఇది ఒకప్పుడు బాగా బతికిన యేరు... ఎన్నెన్నో ఊర్లూ... యేర్లూ.. కొండలు.. కోనలు... వాగులు... వంకలు దాటుకుంటూ ప్రవహించిన జలగీతం... ఒక నాగరికతను పూయించిన సుజలధార... చరిత్రకు ప్రాణం పోసిన సువర్ణధార... నురగలు గ్రక్కుతూ... పరవళ్ళు తొక్కుతూ పరిమళించిన పెన్నా నదీమతల్లి... ఎండి పోయిన తర్వాత.... ఇసుకతోనే వ్యాపారం చేయడానికి మనిషి సిద్ధపడ్డాడు.

ఆ నదీమతల్లి గర్భాన్ని తవ్వి పోస్తాండరు. ఇసుక వ్యాపారం లాభసాటిగా మారింది. పెన్నమ్మను లాభసాటిగా మారింది. పెన్నమ్మను ట్రాక్టర్లతో అమ్ముకుంటావుండారు. ఒక నాగరికతను తరలించేస్తున్నారు.

ఎన్నెన్ని చూస్తున్నాం... కాలంకింద నలిగిన జ్ఞాపకాలను, మాసిపోని మనసు గాయాలను, కూలిపోయిన స్వేచ్ఛా శిఖరాలను, మారిపోయే మనిషి రూపాలను, పెరిగిపోతున్న పాపం నీడలను, రగిలిపోయిన బంధం భస్మాలను, చెరిగిపోయే దారుల గమ్యాలను, చెదలుపట్టిన స్మృతుల రేఖలను... ఎన్నెన్నీ... అడుగడుగునా అల్లిన పాము పడగల వలల్ని... కాటేసే కాలనాగుల విసపుకోరల్ని... ఆకాశాన్ని అందుకోవాలని ఆరాటపడిన రెక్కలు లేని పక్షుల్ని... ఎత్తుల్లా మొల్చుకొచ్చి కంకుల్లా రాలిపోయిన నినాదాల్ని... మోడులుగా మిగిలిన బీడు భూముల కరువు దృశ్యాల్ని... తెల్లబడ్డ తలల తపస్సుల్ని... తల్లడిల్లిన తల్లి తపనల్ని... తన్నుకపోయిన మట్టిపొరల్ని.... తరలిపోతున్న ఇసుక అరల్ని....

ఇసుక వ్యాపారంలో రెండు చేతులా సంపాదించుకున్నాడు నీలకంఠం. నాలుగు ట్రాక్టర్లు... పట్నానికి ఇసుకను తరలించడంలో ఎప్పుడూ నిండుగా వుంటాయి... ట్రిప్పుకు మూడొందల లెఖ్కన తెల్లవార్లూ తిరుగుతా వుండాయి. నీలకంఠాన్ని చూసి... అతడు సంపాదిస్తున్న సంపదనుచూసి... మానేపల్లి శ్రీనివాసులు కూడా ట్రాక్టరు పెట్టి పెన్నానదిలోని ఇసుకను పట్నానికి తరలించేపని మొదలు పెట్టినాడు.

నదిలో ఇసుక ఎంతవుంటే అంతగా భూగర్భ జలాలను నిల్వవుంచుకునే సామర్థ్యం దానికుంటుంది. దాన్ని ఎవరు గుర్తించినారు? ఎవరి లాభం వాళ్ళు చూస్కున్నారు.

ట్రాక్టర్ల శబ్దాలమధ్య ఊరు.... దాని ఉక్కు పాదాలకింద నది విలవిల లాడుతూ నలిగిపోసాగాయి.

ఊర్లోని చెత్తాచెదారం కూడా నదిలోకి చేరింది. కొద్దిరోజులకే నది సాగే యేర్లో కుప్పలు, తెప్పలుగా చెత్త పేరుకొని దిబ్బతీర్న తయారైంది.

పెన్నమ్మ పరిస్థితి దయనీయమైంది. ఈ చుట్టప్రక్కల ప్రాంతాల్లో వ్యవసాయానికి పెన్నమ్మ అండగా నిలిచింది.

నేడు అంతరించిపోతుంది.

ఇప్పుడు నదిలేదు...

నదిలో తడిలేదు..

రైతు గాజుకళ్ళలో కన్నీళ్లూ లేవు...

ఇంట్లో తిండిగింజల్లేవు...

కల్లంలో మేపు లేదు...

గాటికాడ ఎద్దుల్లేవు...

మనిషిలోనూ మనిషి లేడు...!

***

ఊళ్లోకి మట్కా ఆట వచ్చింది. కొత్తగా వచ్చింది కాబట్టి జనానికి వింత. ఆడిచూద్దాం మన తలరాత ఎట్టుందో అనుకుంటా ఒక్కొక్కరూ వచ్చి డబ్బుకట్టడం... ఎదురుచూస్తా వుండడం జరుగుతోంది... ఆశల్లో విహరించి... విహరించి కలల్లో లక్షాధికారులగానో... కోట్లాధి పతులుగానో మునిగి తేలుతాండరు. కలలన్నీ కరిగిపోయినాక చూసుకుంటే వీళ్ళకు మిగిలేది అప్పుల తిప్పలే... సందుకొక మట్కా చీటీలు రాసిచ్చే బీటర్లు తయారైనారు.

ఆంజనేయులు కూడా మట్కా ఆటలో పండిపోయినాడు. తెల్లారితే ఏ నెంబరు వస్తాదో చార్టుపరిచి వెతుకుతా వుంటాడు. నవ్వు వేసిన నెంబరుకు గానీ మట్కా తగిలితే రూపాయికి ఎనభైరూపాయలు ఇస్తారు. కొత్త కొత్త పదాలు... నోరుగానీ తిరక్కున్నా జనం మాట్లాడవుండారు. ఓపెన్, క్లోజ్, బ్రాకెట్ ఈ పదాల్నే మాట్లాడతాండడు ఆంజనేయులు నోరు తెరిస్తే. నాకేం అర్థంకాక ఆంజనేయుల్ని కూర్చోబెట్టుకొని ఓ రోజు అడిగితి. తెల్లముఖం వేసినాడు.

నాకు ఈ ఆట గురించి తెల్సుకోవాలని వుంది అనంటి.

"సరే సాయంత్రం కాడ... తాడిపత్రి కాన్నుంచి మా గురువు పడగలయ్య వస్తాడు. వాడైతే నువ్వు ఏమడిగినా చెప్తాడు...." అని తప్పించుకుంటా జవాబిచ్చినాడు.

సాయంత్రం అయితే ఆ పడగలయ్య వచ్చినాడేగానీ వాడు ఇంకేవో పదాలు మాట్లాడతా వుండాడు. రతన్ అంటాడు, డేమిలన్ తెలుసా అంటాడు. నైట్ మిలన్ అని కళ్ళు ఎగరేస్తాడు.

ఎవరికి అర్థమై సస్తాది?

"సున్నా నుంచి తొంభై తొమ్మిది అంకెల వరకుగల నంబర్లపై పందెం కాస్తారు. డబ్బులు తెచ్చే నెంబరు మాత్రం ఒకటే వుంటాది" అని చెప్పినాడు నాకు అర్థమైయ్యేటట్లు ఖాదర్ వచ్చి.

కొంత అర్థం అయ్యింది. ఈమధ్య ఖాదర్ కూడా చీట్లురాసే బీటర్ పనిలో కూర్చుంటా వుండాడని తెల్సింది.

అందుకే అదే అన్నాను... "కువైట్ డబ్బంతా మట్కాకు పెట్టేవు!"అని ఖాదర్ నవ్వి ఊర్కున్నాడు.

తర్వాత ఖాదరే ఈ మట్కాకు సంబంధించిన వివరాలు ఇంకొన్ని చెప్పినాడు.

"ఓపెన్ అంటే ముందు తీసే మొదటి నెంబర్. గంటసేపు తర్వాత క్లోజ్‌లో రెండో నెంబర్ తీస్తారు. ఈ రెండు నెంబర్లు వస్తే బ్రాకెట్ అవుతాది. ఏ నెంబర్ వచ్చినా డబ్బులొస్తాయి" అని చెప్పినాడు.

ఈ మట్కా మాయాజూదంలా కన్పిస్తాంది.

పాపం ఉదయమంతా కూలీనాలీ చేసుకొని బతికేటోళ్ళు రూపాయలు, రూపాయలు సంపాదించుకొని వచ్చి ఈ బీటర్లకు కట్టడం నేర్చుకున్నారు. ఈ డబ్బంతా తీసుకొని ఆ రతన్‌గాడు ఎవడో కోటీశ్వరుడై పోతాండనిపించింది.

చీట్లు రాసిచ్చే ఖాదర్‌కు, ఆంజనేయులకు కమీషన్ ముడుతోంది.

కానీ పచ్చని సంసారాల్లో ఈ మట్కాచిచ్చు పెడతాంది.

కొత్తగా బద్వేలుకాడ పెళ్ళి చేసుకొని వచ్చిన తిరుమలయ్య పెళ్ళాం నగలమ్మి మాట్కా ఆడినాడు. ఏ నెంబరుకూ తగలలేదు.

నెలకే పెళ్ళి పెటాకులైంది.

సాయంత్రానికంతా ఏదో ఒక నెంబరుకు డబ్బు కట్టడం... రాత్రంతా తగిలే నెంబర్ల కోసం ఎదురు చూడ్డం ఊర్లో జనానికి శివరాత్రికి జాగారం చేసినంత పవిత్రంగా వుంటోంది.

కార్తీక పున్నమి పండక్కు వీరబల్లి నుంచి లక్ష్మి వచ్చింది. వచ్చినప్పటి నుంచి ఇల్లంతా సందడి సందడిగా వుండాది. లక్ష్మి రాకతో ఇంటికి కొత్త వెలుగు వచ్చి నట్లుండాది. అదే మాట సిన్నాయన కూడా అన్నాడు.

ఇంటి ముందు పెద్ద ముగ్గు వేసింది. సందెకాడ ముగ్గులో దీపాలన్నీ పెట్టింది. పల్లె జనమంతా మాములుగైతే బాగా వేడుకలు జరుపుకునే వాళ్ళే. ఇప్పుడు కాలం బాగాలేదు కాబట్టి ఎవరూ పూనుకోవడం లేదు.

మాటల మధ్యలో నాకో సంబంధం చూసినట్లు చెప్పింది. అమ్మాయిని చూడను వీరబల్లికి రమ్మని కూడా చెప్పింది.

"ఎక్కడ కుదుర్తాంది... బయట పొలం పనులు చూస్కోనే సరిపోతాంది" అని అన్నాను.

"అవన్నీ చెప్పొద్దు... నేను చెప్పినట్లు విను... నాతో పాటూ వీరబల్లికి రావాల్సిందే" పట్టు బడుతున్నట్లు చెప్పింది.

ఇలా మాట్లాడుకుంటాండగానే చిన్నాయన అన్నాడు– "బ్యాంకోళ్ళు ఏందో కాగింత పంపినారు. మనం తీసుకున్నలోను కంతు కట్టాలే అనుకుంటాను" అని.

ఔ.... బ్యాంకులోను కట్టాల్సి ఉంది కదా! గుర్తుకొచ్చింది.

"పెళ్ళికిచ్చిన బంగారు నగల్ని ఇస్తాను తీసుకొని అమ్మి లోను కట్టేయండి" లక్ష్మి అమ్మకు చెప్పింది.

"అట్లాటి ఆలోచనలు చేయొద్దు. నీకు అత్తగారింటి కాడ విలువుండదు" అని లక్ష్మిని మందలించింది అమ్మ.

"పట్నంలో మీ ఆయన మంచి ఉద్యోగంలో స్థిరపడిన తర్వాత అప్పుడు మాకు ఎదైనా సాయం చేద్దువులేమ్మా...." అన్నాను లక్ష్మి నెత్తిమీద మొట్టుతూ...

"లక్ష్మీ బాగుండావా..." అంటూ లోపలికి వచ్చింది కాంచన.

చాలా రోజుల తర్వాత ఇదే కాంచనను చూడడం.

మనిషి చాలా సన్నబడింది. పాపను నడిపించుకుంటూ వచ్చింది.

లక్ష్మీ పాపను ఎత్తుకొని ముద్దాడింది – "కాంచనక్క మనిషివి నల్లబడినావు. సన్నగైనావు. ఎందుకు దిగులు? ఆరోగ్యం బాగుందా?" లక్ష్మీ ప్రశ్నల వర్షం కురిపించింఇ. "ఆరోగ్యం బాగానే ఉంది. బాగోలేనిది తలరాతే..." అమ్మపక్కన కూర్చుంటూ అనింది కాంచన. లక్ష్మి నిశ్శబ్దమైంది.

"ఎప్పుడు వెళ్తున్నావు... పట్నానికి, మీ ఆయన దగ్గరికి..." కాంచన లక్ష్మీవైపు చూస్తూ అడిగింది.

"ఈవారంలో వెళ్ళిపోతాను. అక్కడే మా ఆయనకు మంచి ఫ్యాక్టరీలో పని దొరికిందట... నేను వెళ్ళిన తర్వాత కబురు పెడ్తాను. నువ్వు కూడా ఓసారి రావాలి" అంటూ కాంచన పక్కనే కూర్చొంది లక్ష్మి.

మాళ్ళు మాట్లాడుకుంటా వుంటే నేను బయటకు నడిచాను. నాతోపాటు బయటకు కాంచన కూతురు వచ్చింది అడుగులో అడుగు వేసుకుంటా. ఎత్తుకొని ముద్దాడాను. నా భుజమంతా తడిపేసింది.

# 13

**ఊ**ర్లోకి రచ్చబండ దగ్గరికి పోలీసుజీపు వచ్చింది.

వాళ్ళు ఎందుకోసం వచ్చారో తెలీదుగానీ ఆ సమాచారం తెలుసుకొని అసలైన మనుషులంతా ఎవరి దారికొద్ది వాళ్ళు పరారైనారు.

పూనా సావిత్రి దొడ్డిదారి గూండా బయటపడి ఎగువ పల్లె దిక్కు నెత్తికి ముసుగేసుకొని పారిపోయింది.

దిన్నం ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక రవాణా చేసి లెఖ్క సంపాదించను మరిగిన నీలకంఠం అప్పటికప్పుడు యేటి దిక్కు నడ్సినాడు.

మట్కా చీటీలు రాసే ఖాదర్‌గాడు, వాడి స్నేహితులు ఊరు యిడ్సి పోయినారు బిరబిర.

పట్నం నుంచి నకిలీ విత్తనాలు తెచ్చి తక్కువ డబ్బుకు ఇక్కడ రైతులకు అమ్మే కోటయ్య....

ఆక్రమంగా చౌటిపల్లి దిక్కు భూముల్ని ఆక్రమించుకున్న పుల్లారెడ్డి... అధిక వడ్డీలకు రైతులకు అప్పులిచ్చి పీడించే మునిసుందరం...

కవ్వం కోన కాడ నాటుసారా కాంచే సుంకన్న

ఎర్రకొయ్య కొట్టను అడవికి పోయేటోళ్ళు... అందరూ... ఎక్కడి దొంగలు అక్కడే... గప్‌చిప్ అయినారు.

ఊర్లోకి పోలీసు జీపైతే వచ్చింది గానీ దాని రాకతో యింతమంది ఊరుయిడ్సి పరుగులు పెట్టాల్సి వస్తాదని ఎవరూ అనుకోలా.

ఈ సంగతులన్నీ నాకు ఆంజనేయులే చెప్పినాడు. అట్టా జీపు రాగానే వాడు పరుగు పరుగున నాకాడికి వచ్చినాడు సంగతులన్నీ తెల్సుకొని. ఇదో ఇలా ఇద్దరమూ ఊరుయిడ్సి వీరాపురం వంక మోరీకాడ కూర్చోవల్సివచ్చింది.

ఆ తర్వాత సాయంత్రానికి ఆ దావలో వచ్చేవాళ్లు ఎవరో చెప్పినారు. పోలీసులు వచ్చింది గంగమ్మ దేవళం కాడుండే రాతిబావి నీళ్ళు బిందెలతో తీసుకొనిపోనీకి. ఈ సంగతి తెల్సుకొని పడి పడి నవ్వుకున్నాం.

***

మొత్తం పద్నాలుగు గ్రామాలు ముంపు ప్రాంతాల కిందకి వస్తాండేటట్లు గవర్నమెంటోళ్లు ప్రకటించినారట. దాంట్లో మా ఊరితో పాటూ బంగారుపల్లె,

కుడుమలూరు, చెండవాయి, కొత్తూరు, ఎగువపల్లె, బక్కయ్యపల్లె, రంగపల్లె, జాఫర్ సాహెబ్‌పల్లె, శింగనవారి పల్లె, కొమ్మూరు, రంగాయపల్లె, రాచపల్లె, గ్రామాలన్నీ ముంపు కిందకి వచ్చినాయి.

పెన్నమ్మ తల్లి ఎండిపోయింది. యాడాగూడా సుక్కనీళ్లు లేవు. మరి వీళ్లేందిముంపు ప్రాంతాల్లో మా ఊర్లను చేర్చినారు. అందరకీ ఇదే అనుమానం ఆశ ఏందంటే – నష్టపరిహారం ఇస్తారు కదా... అదే! సోమశిల ప్రాజెక్టు నెల్లూరు కాడ కట్టినారు. అది లేచేసరికి దాని వెనుక నీళ్ళకు ఈ పల్లెలన్నీ మునిగిపోతాయని చెప్పినారు.

ఈ ఊర్లో నడియేట్లో ఉండే చెత్తాచెదారం దిబ్బలన్నీ ఎక్కిరిస్తా వుండాయి. నష్టపరిహారం కోసం దిన్నం కడపకుపోవడం, ఆడ కలెక్టరు కార్యాలయం ముందు ధర్నాలు చేయడం.

మీ గ్రామాల ఖాళీ చేయండి మీకు వేరేచోట స్థలాలు ఇస్తాం అని చెప్పినారు.

అదో అక్కడే వచ్చింది మా ఊరోళ్ళకు, ఆ గవర్నమెంటోళ్ళకు. నీళ్ళురానీ, నిపులురానీ మా జాగా విడిపిపోయేదే లేదని చెప్పను తిరుక్కున్నారు.

ఈ ఊరు విడిస్తే మా ఉనికి పోతాదని చెప్పినారు. మా ఊపిరి పోతాదని చెప్పినారు. ఆర్థికంగా చితికిపోయిన వాళ్ళందరూ నష్టపరిహారం ఇస్తే ఖాళీ చేస్తామని అంటాండరు. ఊరిని ప్రేమించేటోళ్ళందరూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ స్థలాన్ని విడిచిపోమని తెగేసి చెప్తావుండారు. ఊర్లో రకరకాల అభిప్రాయాలు అయినాయి. ముంపు సమస్య మా జీవితాల్లోకి కూడా చోచ్చుకొని వచ్చింది. నెదురుపల్లెను అనుకొని కొత్త స్థలాలను గవర్నమెంటోళ్ళు చూపిచ్చినారు. కొంతమంది ఆడికిపోను సిద్ధమైనారు. చాలామంది ఆడకూడా స్థలాలను తీసుకున్నారు. గానీ యిక్కడ ఖాళీ చేయలేదు. నష్టపరిహారం లెఖ్క కట్టడానికి అధికారులు వచ్చినప్పుడు గొడవలు అయినాయి.

ముంపు గ్రామాల్లో రైతులు భూముల్ని సాగుచేయకూడదన్నారు.

నమ్ముకున్న నేలలను వదలి వెళ్ళమన్నారు. ఈ సంఘర్షణ కొనసాగు తూనేవుంది...

దిన్నం వొక సర్వే పేరుతో ప్రజల్ని బయపెట్టడం మొదలు పెట్టినారు అధికారులు.

నష్టపరిహారం ఇస్తామని చెప్పి మోసం చేసేటోళ్ళు పుట్టుకొచ్చారు. ముంపువాసుల జాబితాల్లోంచి కొందరి పేర్లు తొలగించడంతో మళ్ళీ ఆందోళన జరుపుతావుండారు... ఇదంతా ముంపువాసులగోడైంది. గొడవైంది. రెండు బృందాలుగా నందలూరు, అట్లూరు మండలాల్లో అధికారులు రీ సర్వే కూడా జరిపారు.

అయినా ప్రయోజనం ఏముంది? నష్ట పరిహారాలు ఎవరికి అందినాయి? కట్టడాలకు వచ్చే పరిహారానికి గవర్నమెంటు నలభైరెండు శాతమే ఇస్తుందని చెప్పడంతో బాధితులు అర్థంకాని పరిస్థితుల్లో పడ్డారు. ముంపు గ్రామాలకు విడుదల చేసిన డ్రాఫ్టునోటిఫికేషన్ బాధితులను అయోమయంలో పడేసింది. ఇంకేంచేస్తాం? అందరం కలిసి ఎన్నికలను బహిష్కరించాం.

***

రంగసముద్రం కాన్నుంచి తోలుబోమ్మలాట ఆడించేటోళ్ళు వచ్చినారు. విరాటపర్వం కత చెప్పాలని మా వూరోళ్ళు పిల్సకచ్చినారు.

తోలుబొమ్మలాడిస్తే వానలు కరుస్తాయని నమ్మకం. దిన్నం రెత్తిరి పూట ప్రదర్శన జరిగేటట్లు పదారు రోజులు విరాటపర్వం చెప్తారు. మొదటిరోజు బొమ్మలాట మొదలైంది.

చినుకుల కోసం చిందు ఆడతాండరు. వనపర్తి సోమూజీరావు గొంతెత్తి పద్యాలు ఆలపిస్తాండడు...

మధ్యమధ్యలో కేతిగాడు, బంగారక్క, జుట్టుపోలిగాడు నవ్విస్తావుండారు.

రెండురోజుల ప్రదర్శన అయింది.

చినుకులేదు.

నాలుగురోజుల ప్రదర్శన అయింది.

చినుకు కుర్సలేదు.

విరాటపర్వం సాగిపోతావుంది...

పాండవులు అష్టకష్టాలు పడ్తాండరు. మగధీరుడు అర్జునుడు ఆడవేషంలోకి మారాల్సి వచ్చింది... ఇలా సాగుతూనే బొమ్మలాట పూర్తయ్యింది. పదారు రోజుల కష్టం ఫలించలేదు. చినుకులు కుర్సలేదు.

మోడాలు కనికరించలేదు.

కళాకారులు నిరాశతో వెనుదిరిగినారు.

ఎండలు ముదిరిపోయినాయి.

వానలు వచ్చే పరిస్థితే కానరావడం లేదు.

సాగునీటి ఎద్దడి... నకిలీ విత్తనాలు.. అప్పులకు వడ్డీలులాంటి వైపరీత్యాలన్నీ రైతులు కాస్తోకూస్తో మిగుల్చుకున్నదీ వారికి దక్కనీకుండా చేశాయి.

తినడానికి తిండిలేదు.

మరో పంట వేసేందుకు శక్తిలేదు.

జవసత్వాలు కూడగట్టుకొని సేద్యం చేయడం ఎవరికి చేతనైతాది?

మనిషి కష్టాల్లో కొట్టుమిట్టాడుతాండరు.

కరువు రైతుల ఉసురు తీస్తాంది...

కౌలుకు తీసుకున్న భూమిలో పంటలురాక... అప్పులు తీర్చలేక అవమానభారంతో... బొందలకుంట శివయ్య, ఇరవై ఎకరాలు కౌలుకు తీసుకొని సేద్యం చేసిన రామపురం రవీంద్ర.... ఆరు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని అమోటా సాగుచేసి ధరలు పడిపోవడంతో సిద్ధారెడ్డి... ఇంకా... ఎందరో రైతులు ఒక్కొక్కరుగా ఆత్మహత్యలు చేసుకుంటా వుండారు.

ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాల్లోనూ దళారులు ప్రవేశించారు.

శవాలమీద కాసులు ఏరుకోవడం మొదలు పెట్టినారు.

సొంత ఊళ్లో పనులు లేక... "ఊళ్ళువదిలి వలసలు పోవడం... పరిస్థితి దుర్భరంగా మారింది. అందరూ పట్నానికి కదులుతాండరు.

ఊళ్లు పట్టిన రైతులు... ఊడిగంచేస్తేనే బతుకుల్లాగా జీవితం నడుపుకుంటా వుండారు.

గడుపుకుంటావుండారు.

***

నిన్నరాత్రి వద్దని చెప్తాంటే కూడా వినకుండా బయలుదేరిపోయిన ఆంజనేయులు భైరవగుట్టకాడ ఎర్రకొయ్య దుంగల్ని తరలించేటప్పుడు పోలీసులకు చిక్కినాడనే సంగతి ఊరంతా ప్రాకిపోయింది. ప్రమాదకర కార్యకాలపాల పి.డి చట్టాన్ని పెట్టినారని చెప్పినారు. ఈ చట్టం కింద అరెస్టు అయిన వారికి బెయిల్ రావాలంటే కనీసం ఆరునెలలు పడుతుందట. రాళ్ళమడుగుల్లో కూడా

ఇస్మాయిల్‌ను పోలీసులు పట్టుకొని పి.డి యాక్ట్ కింద జైల్లో వేసినారని తెల్సింది. స్మగ్లర్లు మదరాసునుంచి సింగపూర్ మీదుగా జపాన్‌కు ఎగుమతి చేస్తావుండారని కేసు పెట్టినారు.

ఆంజనేయుల వాళ్ళింట్లో విషాదం అలముకుంది. వాళ్ళమ్మ ఏడుస్తా వుండాది. 'చూడు... నాయనా... నీ సావాసగాడు పోలీసులకు చిక్కినాడంట. వాడ్ని బయటకు తీసుక రా... నాయనా... నీకు చేతులెత్తి నమస్కరిస్తా... వాడు యింగెప్పుడూ ఇట్లాంటి పనులు జెయ్యడు....' అని ఏడ్సుకుంటా చెప్పాంది.

చిన్నాయనా, నేనూ ఇద్దరమూ పట్నానికి పోయి లాయర్‌తో మాట్లాడి వచ్చినాం.

ఆరునెలల వరకు ఏం చేయలేమని చెప్పినాడు లాయర్.

ఊర్లో పశుగ్రాసం కొరత ఏర్పడింది. బిడ్డల్లా సాకుతుండే పశువులను వస్తులుంచడం ఇష్టంలేక బాధతో రైతులు వాటిని కబేళాలకు తరలిస్తుండారు. ఎండ తీవ్రతకు పాడి పశువులు సరిగ్గా పాలు కూడా ఇవ్వడంలేదు.

ఎంతో కొంత ధర మాట్లాడుకొని పశువులను కబేళాలకు అమ్మడానికి రైతులందరూ ఇష్టపడతావుండారు.

కరువు దెబ్బకు సంప్రదాయ సేద్యం దూరమైపోయింది. వాణిజ్య పంటలు పెరిగినాయి. గ్రాసం కొరత ఏర్పడింది. పశువులకు మేత యింగ యాన్నుంచి వస్తాంది?

ఈ రోజుల్లో... ఆ బంగారు కాలాల్లో అయితే వర్షాలు పుష్కలంగా పడేవి. ఇరుకార్లు వరి సాగు చేసి వందల బస్తాలు పండించేవారు. నిత్యం ధాన్యాగారంతో ఇంటిల్లిపాది సంతోషంగా గడిపేవారు. పశువులకు పశుగ్రాసం కొదవ వుండేది కాదు. పాడి పశులవులతో పల్లెలు కళకళలాడేవి.

కానీ నేడు భూముల్ని నమ్ముకొని బతికేరైతుల పరిస్థితి సాగునీరు లేక త్రాగునీరులేక విలవిలలాడే జీవితమై పోయింది. వరిసాగు లేదు. తినేందుకు నాలుగు గింజలు లేవు. అప్పులు జేసి బియ్యాన్ని కొనాల్సి వస్తాంది. ఇంతకాలం లోకానికి అన్నం పెట్టిన రైతు ఆకలితో మాడిపోతాండే విలయకరువు దృశ్యమిది. అందుకే గంగమ్మ గుడికాడ రోకలి సాంగెం చేయడానికి ఊర్లోవాళ్లు నిర్ణయించి నారు. రోకలి సాంగెం జరుగుతోందని చుట్టుపక్క పల్లెల్లో దండోరా కొట్టించినారు. నిజానికి చాలా రోజుల క్రితమే ఈ సాంగెం జరగాల్సింది. దేవళాన్ని చూసుకొని నరసింహులు ఆరోగ్యం బాగా లేకపోవడంతో వాయిదాలు వేస్తావచ్చినాడు.

ఇప్పటికీ నరసింహులు ఆరోగ్యమైతే బాగు కాలేదు. కానీ ఊర్లో రోజురోజుకు అరిష్టాలు అయితండయి. దీంతో ఎట్లైనాగానీ వెంటనే ఈ రోకలి సాంగెం జరిపించాలని తీర్మానించారు.

కరువు ఒకపక్క... మండిపోతాండే ఎండలు మరోపక్క రాతిబావిలో కూడా నీళ్ళు ఎండిపోవచ్చినాయి. అదే దిగులు అందరికీ పట్టుకుంది. చుట్టుపక్క పల్లెలందరికీ దిక్కు ఆ రాతి బావే. అది కూడా ఎండిపోతే ఎవరి ఉచ్చలు వాళ్ళు పట్టుకొని తాగాల్సిందేనని అనుకుంటావుండారు.

రాతిబావిలో నీళ్ళు భూమి పొరల్లో నుంచి రావు. బావిలోపల మొత్తం బండ వుంది. గట్టిరాయి బండమీదనే నీళ్లు ఊరతా వుంటాయి. ఈ రకంగా రాతి బండమీద నీళ్ళు ఊరడమంటే ఇది ఆ గంగమ్మ తల్లి మహిమేనంటారు. అందుకే ఈ నీళ్ళను పవిత్రంగా తీసుకపోతారు.

ఓసారి ముగ్గురాళ్ళ విజయమ్మ మొగుడితో కొట్లాడి ఈ బావిలో దూకాలని పరుగు పరుగున పోయింది. ఆ గట్టు మీదుండే గంగమ్మ తల్లి దగ్గరికి పోయి రెండు చేతులెత్తి మొక్కుకునింది. ఈ తాగుబోతు మొగుడితో కలిసి సంసారం చేయలేను. నన్ను నీతో తీసుకొనిపో తల్లీ. నా బిడ్డల్ని సల్లంగా కాపాడు... నేనూ నీకాడికే వస్తాండ... వస్తాండ.... అని చెప్పి ఉరుకుతా పోయి రాతిబావి కట్టమీదకెక్కి మనసులో నిండుగా ఆ గంగమ్మ తల్లిని తల్సుకుంది.

ఇంగో ఆలోచన లేకుండా రాతిబావిలోకి కళ్ళు మూసుకొని దూకింది.

ఈ విషయం తెల్సుకొని ఊర్లోని జనమంతా రాతిబావి కాడికి చేరుకున్నారు. రాతిబావిలో నట్టనడుమున విజయమ్మ వుంది. మనిషి మునగలేదు, చావలేదు. అంత ఎత్తు పైనుంచి దూకిందే గానీ ఏంకాలేదు.

మనసులో తల్సుకున్న ఆ గంగమ్మ తల్లి ప్రాణాలు తీసుకుంటాదా...

జనమంతా ఆశ్చర్యపోయినారు. చూద్దురు కదా... తామర పువ్వుల తీగలన్నీ పెనవేసుకొని నులక మంచం తీర్న అల్లుకొని వుండాయి మనిషి కింద.

తామరు పువ్వుల్లో దేవత తీర్న వుండాది బావిపై నుంచి చూసేటోళ్ళకు విజయమ్మ. అందరూ ఆ గంగమ్మ తల్లికి సేతులెత్తి మొక్కినారు.

ఇంకోసారి ఇదే రాతిబావిలో ఎవరో కావాలని కక్షకట్టి నీళ్ళను పాషాణం చేయాలని పథకం వేసుకొని వచ్చినారు.

బావికాడ నీళ్ళకోసం ఎవరూ లేనిది చూసుకున్నారు. తెచ్చిన విషం డబ్బాలోకి నీళ్ళు కలుపుకోను తాడు బావిలోకి యిడ్సినారు. పైకిలాగి చూస్తే నీళ్ళు రాలేదు. మళ్ళీ తాడు బావిలోకి యిడ్సినారు. ఈసారి కూడా నీళ్ళు బక్కెట్లోకి ఎక్కలేదు. ఇట్లనే నాలుగైదుసార్లు చేసినారు. అర్థం కాలేదు. ఇంగ అట్లనే విషయం డబ్బాను బావిలోకి వేయాలని సిద్ధపడినప్పుడు అప్పుడే నీళ్ళకు ఎవరో వస్తాండే గజ్జల శబ్దమైంది. వాళ్ళు ఆ విషం డబ్బాలు ఆడ్నేవేసి పరుగు పెట్టి వెళ్ళిపోయినాడు.

ఈ కత ఊర్లో అందరూ చెప్పుకుంటారు. ఇప్పటికీ రాత్రిపూట ఆ గంగమ్మ దేవళం కాడికిపోతే ఆ తల్లి గజ్జల శబ్దం వినిపిస్తావుంటాదని చెప్తారు.

ఆ తల్లి ఈ ఊరికి రక్షణ. ఆ రాతిబావికి రక్షణ. మంచి మనసుండే మనుషులందరికి రక్షణ.

అందుకే ఆ తల్లికి ఇప్పుడు రోకలి సాంగెం చేయాలని నిర్ణయించినారు. ప్రశస్తమైన వేడుక ఇది. ఆ తల్లికి చేసే సాంగెల్లో చివరిది. చిరస్మరణీయమైనది.

రోకలి సాంగెం చూడ్డానికి చుట్టుపక్క పల్లెల నుంచి జనం తండోపతండాలుగా వచ్చినారు. తప్పెట్లు మోగుతా వుండాయి. దేవళానికి యాపాకు కొమ్మలతో తోరణాలు కట్టినారు. దేవళం లోపల గంగమ్మ తల్లికి పసుపు కుంకాలు పూసినారు.

వెండి కళ్ళు, కోరలు పెట్టినారు. కొత్త గాజులు తొడిగినారు. నిమ్మకాయలు కోసిచుట్టుతా పర్సినారు. నిండు బోనం పట్టి వుండారు. బయట చిందు ఆడతా వుండారు. పులివేషాలు వేసినారు.

నరసింహులు రోకల సాంగెంకు దిగినాడు. రోకలికి పూజలు చేసినారు. బావి నీళ్ళతో దిష్టి తీసినారు. పసుపు, కుంకాలు పూసినారు. యాపాకు కొమ్మలు చుట్టినారు. ఆ రోకలి తీసుకొని దేవళం చుట్టుకారం మూడుసార్లు తిరిగినాడు నరసింహులు. ఆ తర్వాత రోకలి తీసుకొచ్చి ఆ తల్లిముందు ప్రతిష్టించినాడు. ఆ రోకలిపై భాగాన ఇత్తడి చెంబుతో నీళ్ళు ముంచి పెట్టినాడు.

గంగమ్మకు పూజలు చేస్తాండరు టెంకాయలు కొడ్తా వుండారు. చెంబు తిరుగుతాంది. చెంబులోని నీళ్ళు కిందపడ్డంలేదు. జీవాల తలలు తెగుతా వుండాయి. చెంబులోంచి కొన్ని నీళ్లు కింద పడినాయి. అందరిలోనూ సంతోషం. ఆ తర్వాత మళ్ళీ మంత్రాలు ఎత్తుకున్నాడు నర్సిహులు. చెంబు తిరుగుతా తిరుగుతానే వుంది. సగం నీళ్లు కింద పడినాయి.

సంతోషం. అందర్లోనూ ఆనందం.

"ఈసారి మంచి వానలే వుండాయి. ఆ తల్లి ప్రత్యక్షంగా చూపించింది" అన్నాడు నర్సింహులు.

రోకలి సాంగెం పూర్తయ్యింది. చీకటవుతుంటే ఎవరి పాటికి వాళ్ళు పల్లెలకు బయలుదేరి వెళ్ళిపోయినారు.

నేనూ, సిన్నాయన ఇంటికి బయలుదేరినాం.

***

తెల్లారిం తర్వాత ఆంజనేయులు వాళ్ళ అమ్మ వచ్చింది. వాడ్ని కడప జైళ్ళో వేసినారు. పోయి చూసొద్దాం అని చెప్పింది. సరే... అని చెప్పి బయలుదేరినాను. జైలర్‌తో మాట్లాడింతర్వాత చూడను జైలులోపలికి పోయినాం. ఆంజనేయుల్ని పిలి పించినారు. వాడ్ని చూడగానే ఏడ్చేశాను. వాళ్ళ అమ్మ అయితే అక్కడే కళ్ళు తిరిగి పడిపోయింది.

వాడు మనిషి బాగా పల్చబడ్డాడు. కళ్ళులోతుల్లోకి వెళ్ళాయి. ఏడుస్తావుండాడు.

"నీ మాట ఆరోజు విన్నా బాగుండేది" అన్నాడు కనీళ్ళు తుడుచుకుంటా.

"అయిపోయిందేదో అయిపోయిందిలే. బెయిల్‌కు చూస్తున్నామని" – ధైర్యం చెప్పినాను.

"జైల్లో కష్టంగా వుంది" అన్నాడు. ఇంతలో వాళ్ళ అమ్మ స్పృహలోకి వచ్చింది

"బాబూ... అంజి... ఏందిరా నాయనా... ఏంజేసినావురా..?" అని గట్టిగా అరుస్తాంది.

వాడు తల వంచుకున్నాడు వాళ్ళమ్మ వాడికి చాలా మాటలు చెప్తాంది.

కొంచెంలో తప్పిపోయింది ప్రమాదం. ఆరోజు నేను కూడా ఎర్రకొయ్య కొట్టనుపోయివుంటే నాక్కూడా ఈ జైలుగతే పట్టివుండేది. ఆ గంగమ్మతల్లి పుణ్యంతో నేను ఆ విపత్తు నుంచి బయటపడ్డాననుకుంటిని.

జీవితం విలువైంది కదా!

ఇలాంటి పనులు ఎందుకు చేయాల్సి వచ్చింది? ఇదో ఈ నేల తల్లి.. గుప్పెడు గింజలు కూడా ఇవ్వకుంటే ఎవరైనా ఎటు పోతారు? ఏం తిని బతుకుతారు?

ఎవరికి తోచిన దార్లలో వాళ్ళు వెళ్ళిపోతున్నారు. సక్రమ మార్గమా... అక్రమ మార్గమా అని ఎవరు ఆలోచిస్తాండరు. కడుపు నిండాలి... అంతే!

చివరగా వచ్చేటప్పుడు వాడడిగాడు – "ఉత్తరాలు రాస్తుండండి వాటి కోసం నేను ఎదురుచూస్తుంటాను" అని బాధతో!

## 14

**ఊ**ర్లోకి చూస్తాండంగానే ఏవోవో వస్తాండయి.

ముందుగా ఇసుక అమ్మికోను నీలకంతం ట్రాక్టర్లు పెట్టినాడు. అది లాభసాటి వ్యాపారంగా మారింది. కువైట్‌కు పోయి వచ్చిన ఖాదర్ కూడా ఒక ట్రాక్టర్ పెట్టినాడు.

పొద్దునా, రాత్రి తేడా లేకుండా ఇసుకను పట్నానికి అమ్ముకుంటా వుండారు.

ఇసుక ఉచితంగా దొరికే వస్తువు.

"లోడ్ చేసిందానికి కూలీల ఖర్చు, రానూ పోనూ ఖర్చులు పెట్టుకొని ట్రాక్టరును తిప్పకుంటావుంటే ఇంట్లో కూర్చోనివున్నా డబ్బులొచ్చి మన ముందు పడతాయి" ఖాదర్ చెప్పినాడు.

''మీరు అవేమ్మది ఇసుకలాగా అన్పించలేదు. ఒక నదిని అమ్ముకుంటావుండారు. ఒక నాగరికతను అమ్ముకుంటువుండారు. ఒక సంస్కృతిని అమ్ముకుంటా వుండారు..." అన్నాను ఆవేశంగా.

"ఏమోన్నా... నువ్వు దానికి ఏ పేరు అయినా పెట్టుకో... మేం బతకలేని నా కొడుకులం. ఇంతకంటే మాకు మార్గం కన్పించడం లేదు" అన్నాడు ఖాదర్.

నేను ఇంకేం మాట్లాడలేదు. ఖాదర్‌కూడా నిశ్శబ్దంగా వుండిపోయాడు. ఆంజనేయులు జైల్లో అడిగినట్లు చెప్పాను. వచ్చే ఆదివారం తాను కడపకెళ్తునట్లు అప్పుడు కల్సి వస్తానని చెప్పినాడు.

మరో రెండు రోజులకు ఊర్లో కంకరకొట్టే మిషన్ పెట్టినారు. యేటికి ఆనుకొనివుండే రాళ్ళగుట్ట దగ్గర! దాని శబ్దానికి ఊరు ఊరంతా ఊగిపోతా వుండాది. దుమ్ము, దూళి నిండిపోతుంది ముక్కుల్లో.

రాజంపేట దయాకర్‌రావు ఈ మిషన్ పెట్టుకున్నాడు. అంతకుముందు ఈ మిషన్ కోడూరు దగ్గరుండే గుట్టలపల్లి దగ్గరవున్నింది. అక్కడ నాణ్యమైన రాళ్ళు అయిపోయిన తర్వాత దయాకర్‌రావు మా ఊరును ఎంపిక చేసుకున్నాడు.

యేట్లో ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తుండగా ఈ కంకరరాళ్ళను లారీలతో తరలిచడం మొదలు పెట్టినారు.

చిన్నప్పుడు మేం ఆడుకోవడానికి ఎక్కే అందమైనరాళ్ళ గుట్ట... కొండనుంచి రకరకాల పక్షులు వాలే గుట్ట... కొండనుంచి వచ్చే జీవాలకు నీడనిచ్చే రాళ్ళగుట్ట ముక్కలు ముక్కలైతాంది. రాకాసి కంకర మిషన్ ఎంత పెద్ద రాళ్ళనైనా కరకర నమిలిపారేస్తాంది.

చూస్తాండగానే మా ఊరికి తుర్పుదిక్కునుండే ఎత్తైన పెద్దరాళ్ళ గుట్ట మాయమైంది. పోయింది కొంత మాత్రమే కాదు. ఊరి ఊనికి కూడా! ఊరు బోసిపోయింది.

నిద్రలో కూడా నాకు కంకర మిషన్ శబ్ధమే విన్పిస్తావుండాది. గుట్టల్ని మింగేస్తూ!

దయాకర్‌రావుకు పోటీగా నీలకంఠం ఊర్లోకి ప్రొక్లేనర్ తెచ్చి పెట్టాడు.

అదొక రాకాసి బల్లి. ఎంత పెద్ద గుంతలైనా తీస్తాది.

నీలకంఠం ప్రొక్లేనర్ కొనడం వెనుక పెద్ద కుట్రే వుంది.

ఇసుక తరలింపు కాడ దిన్నం కూలీలకు లోడ్ చేసిందానికి డబ్బులివ్వాలి. ఇప్పుడు ప్రొక్లేనర్ వుండడం వల్ల కూలీలందర్ని పంపించేశాడు.

ఇద్దరు ముగ్గుర్ని మాత్రం పనిలో పెట్టుకొని ప్రొక్లేనర్‌తో జరుపుకుంటా వుండాడు.

దాదాపుగా ఈ ప్రొక్లేనర్ దెబ్బకు యేట్లోని ఇసుకంతా పట్నానికి తరలిపోయింది. అప్పుడు ట్రాక్టర్లతో పోయేది. ఇప్పుడు లారీలకు పోతాంది. అంతే తేడా!

మా ఊరు బాగా అభివృద్ధి చెందుతా వుందని జనమంతా చెప్పుకుంటా వుండారు. రాయి కన్పిస్తే దయాకర్‌రావు విడవడం లేదు. ఇసుక గుట్ట కన్పిస్తే నీలకంఠం వదలడం లేదు.

ఇద్దరూ ఊరి అభివృద్ధికి తోచినంత చేస్తూనే వున్నారు. ఈ రకంగా! పోక్లేనర్ మా ఊరుని తవ్విపోయడం కోసమే కని పెట్టారేమో అనిపించింది.

నీలకంఠానికి పోటీగా దయాకర్‌రావు కూడా ఇంకో పొక్లేనర్ ఊర్లోకి దించాడు. ఇద్దరి మధ్య గొడవలు మొదలైనాయి. రచ్చబండ దగ్గరికి పంచాయితీకి వచ్చారు. పంచాతీ పెద్ద ఒకర్ని ఉత్తరం వైపు, మరొకర్ని దక్షిణంవైపు యేట్లో

ఇసుకను తోడుకోవడానికి అనుమతి ఇచ్చాడు. ఇద్దరూ కల్సినదిలో ఇసుక కన్పించకుండా చేయడానికి తాము చేయగలిగిందంతా చేస్తామని హామీ ఇచ్చి వెళ్ళిపోయారు. ఈ పంచాయితీకో నమస్కారం!

ఖాదర్ దిగువ పల్లెకుపోయే దావ దగ్గర సున్నం బట్టీలు రెండు ఏర్పాటు చేశాడు. తయారైన సున్నాన్ని పట్నానికి తీసుకెళ్ళడం... అమ్మడం మంచి వ్యాపార మైంది. మరో రెండు నెలలకే ఇంకో ఆరు బట్టీలు లేచాయి అక్కడే.

ఇంకేముంది? ఊరంతా దిన్నం పొగలోనే మునిగి తేలుతాంది.

మేమైనా నిద్రపోతాండం గానీ ఈ ట్రాక్టర్లు... లారీలు... ప్రొక్లేన్లు.. కంకర విషన్లు... సున్నం బట్టీలు నిద్రపోవడం లేదు.... రేయింబవళ్ళు కష్టపడి ఊరికి ఉరి పోస్తావుండాయి. జనమంతా తిట్టుకుంటా వుండారు. సగంమంది పట్నం డాక్టర్లు దోచుకుంటా వుండారు. చూస్తుండగానే ఊరు వల్లకాడైంది!

రచ్చబండ రావి చెట్టు ఎండిపోయింది.

ఊరంతా ఎర్రని దుమ్ము కొట్టుకొనిపోయింది.

పచ్చని చెట్లు ఏమీలేవు.

పచ్చని బతుకులు ఏవీలేవు.

ఊరు ఇప్పుడు దిష్టి బొమ్మతీర్న తయారైంది. అడవుల్లోని చెట్లు పోయినాయి. యేట్లోని తెల్లటి ఇసుకపోయింది. బొచ్చు పీకేసిన కోడిలా వుంది పెన్నమ్మ రూపం యిప్పుడు.

రాళ్ళ కొండలన్నీ పిండైనాయి. పక్షులు, పిట్టలూ, సున్నం బట్టీ పొగకు ఊపిరాడక సచ్చినాయి.

ఈ వాహనాల శబ్దాలకు అడవిలోని జంతువులూ, అరుదైన పక్షులు అన్నీ చెదిరి పారిపోయాయి.

కొద్ది రోజులకు మళ్ళీ రచ్చబండ దగ్గరికో పంచాయితీ వచ్చింది.

దయాకరరావు ఏదో ఫ్యాక్టరీ పెట్టబోతున్నాడు. దానికి నీళ్ళు కావాలి. స్థలం కావాలి. ఇది పంచాయితీకి కారణం.

ఫ్యాక్టరీ పెడితే కొందరికైనా మన ఊరోళ్ళకు పని దొరుకుతుంది. కాబట్టి ఎవరికీ అభ్యంతరం లేదు.

"నీళ్ళు ఎక్కడుండాయి?" అడిగినాడు గ్రామపెద్ద.

"గంగమ్మతల్లి రాతి బావిలో...."– చెప్పాడు చిన్నగా దయాకర్‌రావు.

"మరి స్థలం?"–

"అక్కడే దేవళానికి రోంత ఎడమవైపున"–

నీలకంఠం ఏమైనా అభ్యంతరం పెడ్తాడేమోనని చూస్తున్నాను.

నీలకంఠం – దయాకర్‌రావులు నిన్నరాత్రే పట్నంలో కల్సి స్వప్నాబార్‌కు వెళ్ళారని తెల్సింది.

పంచాయితీ ఎప్పటిలాగానే ముగుస్తుందనుకున్నాను.

కానీ ఎందుకో...

నిజమే.. సగం జనం ఫ్యాక్టరీ వద్దని అభ్యంతరం చెప్తాపైకి లేచారు.

గ్రామ పెద్దలకు అర్థం కాలేదు.

"అయ్యా.... ఇప్పటికే ఊరంతా ఊడ్చుకొని కనపడిన రాయీ రప్పా, చెట్టు, గుట్టా, పుట్టా అన్నీ మింగుతా వుండారు వీళ్ళు. దాన్లవల్ల ఊర్లో వీళ్ళు తప్ప బాగు పడినోళ్ళెవరు? ఏం జరిగింది..?" అని.

"చంపేశానమ్మ వాడ్ని... చంపేశాను. పీడపోయింది. ఎన్ని రోజులని భరించాలి వాడి చిత్రహింసలు. రోజూ తాగి వచ్చి నాలుగు గోడల మధ్య చితక బాదుతాడు. కాళ్ళతో తంతాడు. సిగరెట్లతో యాడంట ఆడ కాలుస్తాడు అన్నిటిని భరిస్తా వచ్చినాను. ఈ రోజు పాపను గొంతు నలిపి చంపబోయాడు. చూల్లేక పోయాను... గడ్డపారతో... వెక్కివెక్కి ఏడుస్తాంది కాంచన.

నా గుండె ఆగిపోయినంత పనైంది.

కాంచన... కాంచన...

ఎప్పుడూ నవ్వుతూ కన్పించే కాంచన. వెన్నెల పాటల ప్రవాహం కాంచన.

ఇంతకాలం ఎంత క్షోభననుభవించింది! కనీసం బాధ ముఖంలోనైనా కన్పించకుండా ఎలావుంటూ వచ్చింది?

కాంచనతో పాటు వచ్చిన పాప అమాయకంగా ఏడుస్తాంది.

నేను పాపను ఎత్తుకున్నాను.

అమ్మ కాంచనను ఓదార్చుతూ ఇంట్లోకి తీసుకెళ్ళింది. బయటన్నుంచి అంతా వింటున్న చిన్నాయన కళ్ళల్లోనూ కన్నీళ్ళు.

"ఏమైతుంది చిన్నాయనా?" అన్నాను ఆందోళనగా.

"ఏమైనా గానీ ఎదురు నిలబడదాం" అన్నాడు తెగింపుగా.

ఈ విషయం అప్పుడే ఊరంతా ప్రాకిపోయింది. నీలకంఠం చావుబతుకుల్లో వున్నాడంట, పెద్దాసుపత్రికి తీసుకుపోయినారు. ఖాదర్ వచ్చాడు. వీరయ్య తాత వచ్చాడు. ఒక్కొక్కరుగా ఆత్మీయులూ మిత్రులూ అందరూ వస్తున్నారు.

ఈ విషయం అప్పుడే పోలీసులకు కూడా చేరిపోయింది.

జీపు వచ్చి మా ఇంటి ముందు ఆడింది. ఊర్లో ముందు పంచాయితీ చేసిన తర్వాత దాని ప్రకారం మీరు ఏ నిర్ణయం తీసుకున్నా మాకు అభ్యంతరం లేదని వీరయ్య తాత పోలీసులకు చెప్పినాడు.

అప్పటికప్పుడు రచ్చబండ దగ్గర పంచాయితీ మొదలైంది.

పంచాయితీకి నీలకంఠం తండ్రి పెద్దిరెడ్డి వచ్చాడు.

నీలకంఠం బంధువులంతా కాంచనదే తప్పని జైలుకు పంపాల్సిందేనని పట్టుపట్టారు.

కాంచన తను చెప్పుకోవాల్సిందంతా ఏడుస్తూ చెప్పుకుంది.

"అయినా ఒక మనిషిని చంపాలనుకోవడం తప్పుకదా!" అన్నాడు సూటిగా గ్రామపెద్ద. కాంచన తలొంచుకుంది.

పెద్దిరెడ్డి చిన్నగా మాట్లాటం మొదలు పెట్టాడు.

"ఈ అమ్మాయి చాలామంచిది. ఎంత మంచిదంటే నీకు కొడుకంటే ఇష్టమా? కోడలంటే ఇష్టమా అంటే నేను ఈ అమ్మాయి వైపుకే పోతాను. నా కొడుకు చావుబతుకుల్లో వున్నందుకు నాకు బాధగా లేదు. కాంచన ఇప్పటికీ మా ఇంటి కోడలే."– చెప్పి చిన్నగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

పెద్దిరెడ్డే పంచాయితీ తెంచేసిన తర్వాత పోలీసులు ఏం చేయగలరు?

పెద్దిరెడ్డితో పాటే బంధువర్గమంతా లేచి వెళ్ళిపోయింది.

పోలీసులు కూడా వెళ్ళిపోయారు.

కాంచన మా ఇంట్లోనే వుండాలని నిర్ణయం తీసుకుంది.

***

చీకటి చినుకు పెనవేసుకపోతోంది. రాత్రంతా ఒకే దుఃఖం వీడదు. జ్ఞాపకాలైన, గాయాలైన.... స్మృతులన్నీ అలజడి గానే వుంటాయి. రెండు జ్ఞాపకాల

మధ్య కూడా సంఘర్షణ వుంటుంది. పాతజీవితం మర్చిపోవడానికి కాంచన ఊర్లోని పిల్లలకు ట్యూషన్ చెప్తొంది.

మొదట్లో చెప్పనంది.

నేనే చెప్పగా చెప్పగా ఒప్పుకుంది.

మొదట్లో పదిమంది పిల్లలు వచ్చేవాళ్ళు.

ఇప్పుడు ఇరవైరెండుమంది అయినారు.

మా ఇంట్లోనే వసారాలో చెప్తుంది.

రోజులు గడుస్తూనే వున్నాయి.

మా ఊరికి విద్యావాలంటీరు ఉద్యోగం ఒకటి కేటాయిస్తే మహిళల కోటాలో కాంచనకు ఇచ్చారు. కాంచన ఇప్పుడు పంతులమ్మ అయ్యింది.

అమ్మకు  తోడుగా వుంటుంది.

దయాకర్‌రావు అడిగితే పార్నపల్లె దగ్గర వుండే కొండరాళ్ళ భూమి అంతా అమ్మేశాము.

మొత్తం ఐదులక్షలు వచ్చాయి.

లక్ష రూపాయలు బ్యాంకులోను తీర్చేశాము.

కాంచన మా ఇంటికి వచ్చిన వేళావిశేషం బాగుంది. మా జీవితాలు కూడా బాగుపడుతున్నాయి.

పాత జీపు ఒకటి తక్కువ ధరకు వస్తుంటే తీసుకున్నాను.

చిన్నాయన డ్రైవింగ్ చేస్తాడు. జీపుబాగా ఉపయోగపడ్తాంది. లాభంగా కూడా వుంటోంది. స్కూల్ బిల్డింగ్ కాంట్రాక్టు ఒకటి వస్తే నన్నే చేయమని చెప్పినాడు పెద్దిరెడ్డి.

ఇప్పుడు స్కూల్ బిల్డింగ్ కట్టించడంకోసం బేల్దారులతో పని చేయిస్తూ అక్కడే వుంటున్నాను. రోజులు గడుస్తూనే ఉన్నాయి.

ఉగాది పండక్కు లక్ష్మిని పట్నానికి వెళ్ళి తీసుకొని రమ్మని కాంచన గుర్తు చేసింది.

జీపులో నేనే వెళ్లి దంపతుల్ని తప్పకుండా తీసుకొస్తానని చెప్పాను.

ఊర్లో కొద్దికొద్దిగా మార్పులు వస్తున్నాయి. ఖాదర్ సున్నం బట్టీల వ్యాపారం మానేసి మళ్లీ కువైట్ పోవడానికి సిద్ధిమైనాడు. దయాకర్‌రావు మా ఊరిని వదిలేసి

పార్నపల్లి దగ్గర వాలినాడు.

మా ఊరికి శనిపోయిందని జనం అనుకుంటావుండారు. ఊర్లో బట్టీల పొగ పోయింది. ఇసుక త్రవ్వడం తగ్గింది.

ఊరికి మంచి రోజులు వస్తాండయి.

ఆ గంగమ్మ తల్లి కూడా కరుణించి చినుకులు కురిపిస్తే రైతులంతా పచ్చగా ఉంటారు కదా అనిపిస్తావుండాది.

గంగమ్మ దేవళంకాడికి మొన్న పోయినప్పుడు త్వరలో చినుకులు పడ్తాయని తనకు అనిపిస్తావున్నట్లు నరసింహులు చెప్పాడు. ఆ మాట నిజమైతే ఎంత బాగుంటుందో!

ఆంజనేయులి కోసం లాయర్‌తో మాట్లాడాను. అన్నీ సరిగ్గా కుదిరినాయి. రెండు మూడు రోజుల్లో బయటకు వస్తాడన్నారు. నది ప్లాన్‌ను దగ్గర పెట్టుకొని ఈసారి సరిగ్గా రీసర్వే చేసి ఏఏ ప్రాంతాల ముంపుకు గురవుతాయో చెప్పాలని ప్రభుత్వం అధికారుల్ని మందలించింది.

పూనా నుంచి పూర్ణిమ వచ్చింది.

మనిషి ఎర్రగా తయారైంది. బంగారంతో మెర్సిపోతాంది. మాట్లాడిన తర్వాత మళ్లీ పూనాకు వెళ్లనని హామీ ఇచ్చింది.

ఊర్లో ఏవైనా సమస్యలున్నా నా దగ్గరికే మనుషులు వస్తాండరు. నాకు చేతనైన సహాయం చేస్తుండాను.

## 15

**ఆ**కాశం.... మా కన్నీళ్లు చూల్లేక... నీళ్లను... వాన నీళ్లను కురిపించడానికి పూనుకుంటున్నట్లే వుండాది... మబ్బు పడ్తాంది.

మోడాలు కమ్ముకుంటాండయి.

నల్ల మోడాలు... ఎర్ర రంగు ధూళిని చూల్లేని మోడాలు... ఎప్పుడూ ఖాళీగా ఒట్టి కడుపుతో ఎగిరిపోతూ వుండే మోడాలు...

దుఃఖార్ణవ రాగంలో సంకెళ్ల సంగీతం విన్పించే మోడాలు...

సాలెగూళ్లలో చిక్కుకున్న పురుగుల్లా పెనుగులాడే మోడాలు...

ఎప్పుడూ ఎక్కడికో కదిలిపోయే మోడాలు... కనికరం చూపిస్తాండయి.

మోడం మోడం పెనేసుకొని మబ్బులు పందిరి వేస్తావుండాయి...

ఉరుములతో... మెరుపులతో... కలిసి జతలు జతలుగా... లతలు లతలుగా అల్లుకుంటా ఉండాయి.

ఆకాశమంతా వర్షించడానికి... నెమలి పించమెత్తి నర్తించడానికి... ప్రకృతిని పులకింపజేయడానికి... నల్లమబ్బు మోడాలు కదిలే దృశ్యం... ఆకాశంలోకి దిగంతాల దిశగా చూస్తూ కొన్ని యుగాలు గడపాలనిపిస్తాంది.

చినుకులు కురిసేవేళ... జీపులో గువ్వల చెరువు దగ్గరున్నాను.

కంచన గుర్తుకొస్తాంది. ఆమె వెన్నెల పాట గుర్తుకొస్తాంది. మనిషి మనస్సును పరిచయం చేసే ఆత్మీయత గుర్తుకొస్తాంది... ప్రవాహంలా సాగే ఆమె వెన్నెల స్వరం...

"మోడాల కాలాల్లో ఎన్నెలా

బంగారం పండేది ఎన్నెలా

బతుకు పచ్చంగా పూసేది ఎన్నెలా

ఊర్లన్ని ఒకటయిన ఎన్నెలా

జనమంతా కలుసుండి ఎన్నెలా

రాజహంసల కాలం ఎన్నెలా

ఏమైంది ఎన్నెలా...?

ఏమైంది ఎన్నెలా...?"

.... అవును ఆరోజు దేవరప్పుడు గంగమ్మతల్లి పూని ఏం చెప్పింది..? "మోడాలే వచ్చి మీరు పిల్సినప్పుడు వానల్ని కురిపించి పోయేంత రోజులు వచ్చేంత గొప్పగా జీవించండి"... మరి ఆ రోజులు వస్తాయా?

ఇప్పటికైనా ఆ తల్లి కనికరించదా...

లోకమంతా పచ్చగా వుండాలని... మనుషుల మధ్య ఈ దూరాలు... తేడాలు... పోవాలని ఆ తల్లి ఆయాల అనింది. ఈ దూరాలు... రాచపుండ్లు...

***

నల్లవాడు ఎదురైనప్పుడు తెల్లవాడు చూసే ఓర చూపులో ఒక రాచపుండు వుంది. ఎప్పుడో ఇరవై ఏళ్ళ క్రితం ఆకలిబాధతో అన్నం కుండలు దొంగిలించిన నేరానికి ఎక్కడ దొంగతనం జరిగినా ఇప్పటికీ విచారణతో వేధింపబడే వీరయ్య

వీపుకు అదో రాచపుండు... కుటుంబాన్ని పోషించాల్సిన తండ్రి కల్తీకల్లు తాగి చేస్తే... మంచానపడిన తల్లి అనారోగ్యం చూడలేక... ఇద్దరు చెల్లెళ్లకోసం వేశ్యబతుకు అంగీకరించిన సీతాలు శీలానికి అదో రాచపుండు... ఊరంటే అందరూ అని కాకుండా ఊరి బయటకు కొన్ని ఇళ్ళను విసిరేసినప్పుడు వెన్నెన్ని నల్లసముద్రాలు మౌనంగా రాచపుండ్లను భరించాయో...? అప్పు తీసుకున్నందుకు, అప్పు తీర్చినందుకు కూడా వేలిముద్ర వేసే గిరిజన గుడెం గుండెమీద చదువు రానితనం ఒక రాచపుండు... రాజుల వీపులకు పుట్టాల్సిన రాచపుండ్లు... రాజులు పోయాక, రాజ్యాలు పోయాక... రాజకీయంగా తయారయ్యాయి...

ఏ లేపనాలకు తగ్గని దేశలో... ఏ ఔషధాలకు తలొంచన దశలో... పెరగడమే గానీ తరగని ఒకే దశలో.. ఎన్నిసార్లు తల నరికినా పుట్టుకొస్తున్న ఒంటికొమ్ము రాక్షసుడిలా... ఎన్నెన్నో రూపాల్లో రాచపుండ్లు మొల్చుకొస్తూనే వున్నాయి....?

దేవుడా!

నువ్వంటూ వుంటే ఈ మనిషిని రక్షించు ఈ ప్రపంచాన్ని రక్షించు.

కాలి బూడిదైపోతున్న నైతిక విలువల్ని పరిరక్షించు. దోచుకోవాలని చూస్తున్న మనిషి ఆలోచనల్ని మార్చు సాటి మనిషికి సాయం చేసే విశాల హృదయం ఇవ్వు. నైతికంగా పతనమైన మనిషికి పవిత్ర ఆత్మను ప్రసాదించు. ఈ విలువల వత్తి ఆరిపోతే విశ్వమంతా గాడాంధకారం అలముకొంటుంది. అదే అసలైన ప్రళయం.

దయవుంచి అలాంటి ప్రళయం వద్దు తండ్రీ. జీవితం కొందరికి విలాసాల వేడుకవుతోంది. మరికొందరికి విషాదాల వలయం...

ఇలా కొందరి జీవితాలు శోకాక్షరాలతో లిఖించిన కన్నీటి గీతం ఎందు కవ్వాలి?

ఈ హెచ్చుతగ్గుల సమాజమెందుకు? వద్దు... వద్దు.... వద్దు తండ్రీ!

మానవ సంబంధాల మధ్య అంతర్వాహినిలా ప్రవహించే ప్రేమను ప్రసాదించు...!

వీళ్ళకు గాఢమైన పరిపక్వతనందించు కేవలం రక్త మాంసాలతో మాత్రమే వుండే మనిషి కాదు...

మనసు పొరలు చీల్చుకొని అరలమూలాల్లోని ఆత్మను ఆవిష్కరించే మనిషి..

అడ్డంకుల్ని తెగ్గొట్టుకొని అద్దంలా కన్పించే మనిషి...

ఎప్పుడూ ప్రకాశించే వెండి వెన్నెల్ని దోసిట్లో చూసుకొనేలా... తనని తాను పగలగొట్టుకొని పాలరాతిగా మారిన మనిషి...

హృదయాన్ని తెరిచి ఒక పవిత్ర నదిని చూపించలగల మనిషి...

ఒక్కడు... ఒక్కడు చాలు... దేవుడా...

అలాంటి మనిషిని సృష్టించు దేవుడా...

రెండు వందల ఆరు ఎముకల్ని పేర్చి - కూర్చి - మార్చి తీర్చిదిద్దిన మాంసపు ముద్దల కాయం లోపల పిడికెడు హృదయాన్ని పెట్టి ఒక మహా సముద్రాన్ని మోసే శక్తిని ఊపిరి చేసి పోసి... ప్రాణానికి ఒక గది కట్టి... పంజరంలో పెట్టి... అస్థిపంజరంలో ప్రతిష్టించి... పంజరం పగిలితే మనిషిలోని ఒక మహా సముద్రం పేలుతుందనే విషయం తుదివరకూ గుర్తుండేలా... చాలు.. ఈ జన్మ అనుకొని తరించేలా... ఒక్క మనిషిని నిర్మించు తండ్రీ...!

## 16

"ఇది హిరణ్య రాజ్యం...

అంటే బంగారం పండే నేల.

రత్నాలు రాశులు పోసి అమ్మిన వజ్రాల గడ్డ. ఇక్కడ రైతంటే నేల తలికి ప్రాణం. పంచభూతాలు పరవశించేవి. నింగీ... నేలా... గాలీ... నీరూ... నిప్పు... పరిమళించేవి. రైతును గుండెల్లో పెట్టుకొని చూస్కోనేవి.

ఈ బంగారు నేలమీద జన్మిస్తే చాలు వెయ్యి జన్మల తపస్సు ఫలించేది... తపస్సు... తపస్సు.. జల తపస్సు...

... ఇలా ఆలోచనల్లో ఉండగానే చినుకులు కురవడం మొదలైంది.. చినుకు... చినుకు... తర్వాత చినుకు... ఒక్కొక్కటిగా నేల తల్లిని తడుపుతున్నాయి... పరిమళిస్తున్న మట్టి వాసన... తడారి... తడారి.. ఎడారైన గుండెమీద వెచ్చటి చినుకులు... చినుకులు...

మబ్బుల్లో నీడల కోసం చూసే కళ్ళమీద చినుకులు... పాత చినుకులు ఎప్పుడో కురవాల్సిన చినుకులు... చిన్నగా చిన్నగా చినుకులు... వానైంది.

వాన... వాన... వాన... వరదైంది.

వరద... వరద... తుపానైంది.

పారతాంది... పారతాంది పెన్నమ్మ పారతాంది...

వర్షానికి తడిసిన యేటి గట్టుపైనుండే శాసనం గంభీరంగా చూస్తోంది.

ఆ రోజుల్లో... ఆ బంగారు కాలాల్లో.. రైతు రాజుగా లోకాలు ఏలే కాలాల్లో... మట్టి మిద్దె వసారాలో దూలానికి జొన్న కంకుల గుత్తి తగిలించి తను పండించిన పంట వైభవాన్ని ప్రదర్శించే రోజుల్లోని మాధుర్యం కావాలి...

ఊరపిచ్చుకలు కిలకిల రావాల శబ్దం చేసుకుంటూ వసారాలో కట్టిన జొన్న కంకుల్ని పొడుచుకొని తింటూ వుండే దృశ్యం చూడాలి...

ఒక ప్రాచీన నాగరికతకు ప్రాణం పోస్తూ శాఖోపశాఖలుగా వ్యాప్తమై... పరి వ్యాప్తమై... వొక హరిత లోకమై... అణు వంత విత్తనం విస్తరించి అరణ్యమై... మహారణ్యమై... జనారణ్యమైన తర్వాత కూడా ఈ హిరణ్యరాజ్యంలో –

రాజహంసలు ఎగరాలి!

బంగారం పండాలి!!

# పురస్కారాలు

- ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి 'సాహిత్య విమర్శ' ప్రశంసా పురస్కారం- 1999
- ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి 'పత్రికా రచన' ప్రశంసా పురస్కారం- 2001
- ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి నాటక రచన ప్రశంసా పురస్కారం- 2003
- కడపజిల్లా కడపోత్సవాల 'సమన్వయ' ప్రశంసా పురస్కారం- 2003
- గణతంత్ర దినోత్సవ ప్రశంసాపత్ర పురస్కారం- 2004
- న్యూఢిల్లీ 'కథాఫౌండేషన్' కథా పురస్కారం- 2004
- కడపోత్సవాల సమన్వయ ప్రశంసాపత్ర పురస్కారం- 2004
- అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) కథా పురస్కారం- 2004
- 'విపుల' కథా పురస్కారం- 2006
- ఆర్.ఎస్.కృష్ణమూర్తి జాతీయ కథా పురస్కారం- 2007
- 'తేజ' కథా పురస్కారం- 2008
- గురజాడ అప్పారావు స్మారక కథాపురస్కారం- 2008
- సాహిత్య నేత్రం కథాపురస్కారం- 2008
- 'విశాలసాహితి' బి.ఎస్.రాములు కథాపురస్కారం- 2009
- హసన్ ఫాతిమా సాహితీ ప్రకాశంజిల్లా పురస్కారం- 2010
- ధార్వాడ్ సాహిత్య వేదిక పురస్కారం- 2011
- కేంద్ర ప్రభుత్వ రైటర్స్ ట్రావెల్ గ్రాంట్ ప్రోగ్రాం- శాంతినికేతన్ పర్యటన-2011
- కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం- 2011
- ఆచార్య దివాకర్ల వేంకటావధాని సాహితీ పురస్కారం- 2012
- 'In Residence Programme' లో భాగంగా 2014 సెప్టెంబర్ 8వ తేది నుండి 26వ తేది వరకు గంగాధర్ రాష్ట్రపతి భవన్‌లో విశిష్ట అతిథిగా విడిదిచేశారు.



# nela digina vaana

Dr. Vempalli Gangadhar

SAHITYA AKADEMI
FIRST " YUVA PURASKAR " WINNER IN TELUGU

జాలి లేని ఆకాశం నుంచి ఒకానొక
సుదీర్ఘ సంఘర్షణ తర్వాత
రాతి వాసన వేస్తున్న మట్టి రైతును
మొలిపించడం కోసం ..
చినుకు .... నేలకు దూకుతుంది .
చెరువు ఒడిని ఆకాశ మంత నింపడానికి !

పెద్దబ్బా... ఈ పాడువాన ఎప్పటికి
కురుస్తుందోనని ఎందుకు ఎదురు చూస్తావు ?
మేఘాలన్నీ భళ్ళున విరిగి కరిగి నేల నేలంతా
నీరై పాకే శబ్దం కోసం ఎంత కాలం నిరీక్షిస్తావు ?
నాగరికతలు నీళ్ళ తోనే ప్రవహిస్తాయి .
చరిత్రలు యేటి అలలే రాస్తాయి .

